నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

సంపుటి 11 | సంచిక 104
గురువారం | 8 ఫిబ్రవరి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్ష తిథి : అష్టమి మ.1.19, విశాఖ సా.5.21, వర్జ్యం రా.9.38 నుంచి 11.21 వరకు,
రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుంచి 10.48 వరకు, తిరిగి మ.2.48 నుంచి మ.3.36 వరకు, సూర్యోదయం : ఉ.6.50 గం; సూర్యాస్తమయం: సా. 6.11 గం.

నరేంద్ర మోడీ ఫైర్

కాంగ్రెస్ వల్లే ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలని నిప్పులు

టీడీపీ ఎంపీల నిరసన శ్రేయస్కరం కాదని హితవు



- లోక్ సభలో కీలక పరిణామం
- టీడీపీ ఎంపీలపై నరేంద్ర మోడీ ఆగ్రహం
- కాంగ్రెస్‌ను ఎండగడుతూనే తెలుగుదేశం ఎంపీలకు చురకలు అంటించిన ప్రధాని
- నరేంద్ర మోడీ ప్రసంగాన్ని అడ్డుకున్న టీడీపీ ఎంపీలు
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ
- చర్చకు ముందే వాకౌట్ చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులు
- మోడీ మాట్లాడుతుంటే నినాదాలతో హోరెత్తించిన టీడీపీ సభ్యులు
- ఈ పరిణామాలు శ్రేయస్కరం కాదన్న మోడీ
- చర్యలు ఉంటాయని ఆగ్రహంతో హెచ్చరికలు
- కాంగ్రెస్ వైఖరిపై విమర్శలు
- అంజయ్య, నీలం, పీవీలను కాంగ్రెస్ అవమానించిందని వ్యాఖ్యలు
- విభజన సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- అందుకు కొంత సమయం పడుతుందన్న నరేంద్ర మోడీ

బుధవారం లోక్ సభలో కీలక పరిణామాలు సంభవించాయి. బుధవారం ఉదయం నుంచి నిరసన తెలుపుతున్న టీడీపీ ఎంపీలు నరేంద్ర మోడీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోడీ లోక్ సభలో ప్రసంగిస్తున్న వేళ, పెద్ద పెట్టున నినాదాలు చేస్తున్న తెలుగు దేశం ఎంపీలపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాలను ముక్కలు చేయడంపై పాటించిన వైఖరే ఇంత దూరం తీసుకువచ్చిందని, ఇప్పుడు సభ్యులు ఇలా చేయడం కూడా సరి కాదని అన్నారు. ఆంధ్ర ప్రజల అభిమతాన్ని పట్టించుకోకుండానే రాష్ట్రాన్ని విభజించారని ఆరోపించిన మోడీ సమస్యలన్నింటినీ తాము పరిష్కరిస్తామని పదే పదే చెబుతుంటే ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. విభజన జరిగిన నాలుగు సంవత్సరాల తరువాత కూడా సమస్యలు ఉన్నాయని తమను నిలదీస్తున్నారని, వీటన్నింటికీ కారణం కాంగ్రెస్ పార్టీ అని మరచిపోయారని అన్నారు. ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో ఏపీని విభజించారని, ఆ తరువాత కాంగ్రెస్ నాశనమైందని వ్యాఖ్యానించారు. టీడీపీ సభ్యులు ఈ పద్ధతిలో నిరసనలు తెలపడం ఎంత మాత్రమూ అంగీకరించేది కాదని అన్నారు. దేనికైనా సమయం వస్తుందని, ఇచ్చిన హామీలను అమలు చేసే క్రమంలో ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే ఆందోళనలను విరమించాలని తాను కోరుతున్నట్టు చెప్పారు. టీడీపీ వైఖరి పార్లమెంట్‌కు ఎంత మాత్రమూ శ్రేయస్కరం కాదని హితవు పలికారు. ప్రభుత్వంలో భాగస్వామ్యమై ఉండి ఇంతగా నినాదాలు చేయాల్సిన అవసరం ఏమిటో తనకు తెలియడం లేదని వ్యాఖ్యానించారు. సభా కార్యక్రమాలను ఎవరు అడ్డుకున్నా తప్పేనని, ఎవరినీ ఉపేక్షించేది లేదని పరోక్షంగా టీడీపీ సభ్యులను హెచ్చరించారు. తన ప్రసంగంలో ఎన్టీ రామారావును గుర్తు

మిగతా 6లో

టీడీపీ ఎంపీలపై స్పీకర్ ఆగ్రహం



- ఇదేనా మీ క్రమశిక్షణ
- కనీసం ఇంట్లో మీ పిల్లలనైనా అదుపులో ఉంచగలరా?
- నినాదాలు చేస్తున్న టీడీపీ సభ్యులను ఉద్దేశించి సుమిత్రా మహాజన్

వివరాలు 11లో

ఊకదంపుడు ఉపన్యాసమెందుకు?

- మోడీ ప్రసంగంపై సోనియా తీవ్ర విమర్శలు
- మోడీ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు
- జనానికి ఉపాధి కావాలి
- నాలుగేళ్ల పాలన వృథ అయిందన్న సోనియా



వివరాలు 11లో

మోడీ భార్యకు యాక్సిడెంట్



11లో

- హుటాహుటి ఆసుపత్రికి తరలింపు
- రోడ్డు ప్రమాదానికి గురైన జశోదా బెన్
- ప్రమాదంలో బెన్ బంధువు మృతి
- రాజస్థాన్‌లో ఘటన

చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన



12లో

- దక్షిణాఫ్రికాపై ఘన విజయం
- వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన టీమిండియా
- భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి
- సెంచరీ చేసిన కోహ్లీ

మాల్యా అప్పులపై కేంద్రం దాటవేత



5లో

- ఎంత అప్పున్నారో తెలియదన్న ఆర్థిక శాఖ
- స.హ. చట్టంపై అడిగిన ప్రశ్నకు సమాధానం
- అసంతృప్తి వ్యక్తం చేసిన సమాచార మంత్రిత్వశాఖ



కేవీపీ ఒంటరి

- మద్దతు తెలపని కాంగ్రెస్ సభ్యుల
- రాజ్యసభలో నిరసన తెలిపిన ఎంపీ కేవీపీ
- ప్లకార్డుతో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ నిరసన
- చైర్మన్ వెంకయ్య ఆదేశానుసారం వెనక్కి తగ్గిన కేవీపీ
- కేవీపీ చర్యలను సమర్థించబోమని చెప్పిన గులాం నబీ ఆజాద్
- గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డుతో నిరసన కొనసాగించిన కేవీపీ

వివరాలు 6లో

మారని పరపతి

- వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచిన రిజర్వ్ బ్యాంక్
- ద్రవ్య లోటు లక్ష్యాన్ని కేంద్రం పెంచినందునే
- వెల్లడించిన ఉర్జిత్ పటేల్
- రెపో రేటు 6 శాతం
- రివర్స్ రెపో 5.75 శాతం
- ముగిసిన పరపతి సమావేశం



వివరాలు 5లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

అచ్చంపేటలో లక్ష ఎకరాలకు నీరు

- ఉల్పర రిజర్వాయర్ తో ఒక్క ఎకరం కూడా ముంపుండదు
- మరింత వేగంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాయం
- ప్రజాప్రతినిధులు, రైతులతో మంత్రి హరీశ్ రావు సమీక్ష



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్పర రిజర్వాయర్ తో ముంపు ఉండదని ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. అతితక్కువ ముంపుతో,రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాజెక్టులను రీ డిజైను చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.బుధవారం

మిగతా 6లో

నా సవాలుకు జవాబు ఏది?



- డొంక తిరుగుడు మాటలొద్దు
- మూడున్నరేళ్లలో ఏ ఎన్నికల్లోను గెలువలేదు
- తాడు బొంగరం లేని 'ఉత్తమ్' మాటలు
- 2019లో అధికారం మాదే
- ఓడిపోతే రాజకీయాలనుంచి తప్పుకుంటా
- సవాల్‌కు సైయా
- ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ సవాల్

2019 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తిరిగి టీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం...అధికారంలోకి రాకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా...అందుకు పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైయ్యా అంటూ మరో మారు రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సవాల్ విసిరారు.



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః గతంలో తాను చేసిన సవాల్‌కు జవాబు ఇవ్వకుండా డొంక తిరుగుడుగా కుటుంబాన్ని తీసుకురావడం సరికాదని, తాను చేసిన సవాల్‌కు స్పష్టంగా జవాబు ఇవ్వాలని..లేకుంటే తోకముడిచిపోతారా? లేక ఉత్తర కుమార్‌గా మిగిలిపోతారా తెలుపాలని మంత్రి డిమాండ్ చేశారు. బుధవారంనాడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్..ఛాట్ చేశారు. నిన్న గద్వాల్ సదస్సు లో జీహెచ్ ఎంసీ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పానని, గెలువకపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పానని, ప్రస్తుతం 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాకుంటే తన రాజకీయజీవితాన్ని పణంగా పెడుతానని సవాల్ విసిరితే అప్పుడు సవాల్‌ను స్వీకరించలేదని, ఇప్పుడు కూడా డొంకతిరుగుడు సమాధానం చెబుతున్నారని ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. మూడున్నరేళ్ల సమయంలో ఏఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలువలేదని, తీరా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట నారాయణఖేడ్, పాలేరు నియోజకవర్గం ఉప ఎన్నికలు నిర్వహిస్తే సానుబూతికూడా వ్యక్తం చేయకుండా ప్రజలు నిర్దాక్షిణంగా

మిగతా 6లో

అంతా ఇంతే!



విభజించింది వాళ్లయినా, నిధులు మాత్రం ఇవ్వాల్సింది మనమే సార్



చంద్రబాబు పాలన అంతా మోసాలమయం

ముస్లింలందరినీ బీసీ-ఇ గా చేరుస్తాం

- మేం వస్తే ముస్లింల సంక్షేమానికి పెద్దపీట
- ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో వై.ఎస్.జగన్ హామీ
- ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజమ్‌లకు రూ. ఐదు వేలు
- దుల్హాన్ పథకం కింద తల్లిదండ్రులకు రూ. 1లక్ష ఆర్థిక సాయం
- మసీదులతో పాటు ఆలయాలు, చర్చిలను అభివృద్ధిచేస్తాం
- పాదయాత్రలో వైఎస్ జగన్

(ఆత్మకూరు నుంచి సూర్య పొలిటికల్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : తాము అధికారంలోకి రాగానే ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజమ్‌లకు రూ. 5 వేల చొప్పున నెలవారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దుల్హాన్ పథకం కింద ఆడపిల్లల తల్లిదండ్రులకు లక్ష రూపాయల

మిగతా 6లో



గాలికి అశ్రు నివాళి

- బుధవారం తెల్లవారు జామున మరణించిన గాలి ముద్దుకృష్ణమ నాయుడు
- పలు పార్టీల నేతల నివాళి
- మచ్చలేని నాయకుడన్న పెద్దిరెడ్డి
- నేడు అంత్యక్రియలు
- గాలి మృతికి సీఎం దిగ్భ్రాంతి
- ముద్దు కృష్ణమనాయుడి మృతికి పలువురు ప్రగాఢ సంతాపం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ మంత్రి టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుకి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు నివాళులర్పించారు. ముద్దుకృష్ణమ మృతి సమాచారం తెలుసుకున్న నేతలు బంజారాహిల్స్ లోని కేర్ ఆస్పత్రికి చేరుకుని కుటుం బసభ్యులను పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ, రావుల, పెద్దిరెడ్డితో పాటు ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు, తెలంగాణ కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎన్టీఆర్ కుమారులు హరికృష్ణ, రామకృష్ణ, సినీనటుడు చలపతిరావు, లక్ష్మీపార్వతి తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ముద్దుకృష్ణమనాయుడు మృతిపట్ల సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంతాపం ప్రకటించారు.

పుత్తూరు ఎమ్మెల్యేగా రికార్డుల కెక్కి

ముద్దుకృాఎష్ణమ నాయుడు 1947 జూన్ 9న

మిగతా 6లో

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున కార్మికులు గల్ఫ్ దేశాలకు వలసలువెళ్లి అక్కడ సరైన ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా అన్నారు. గల్ఫ్ దేశాల్లో తెలంగాణ కార్మికులు అనేక అవస్థలు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గల్ఫ్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లిన కార్మికుల వద్ద నుంచి అక్కడి యాజమాన్యాలు, వీసాలు, పాసు పోర్టులు తీసుకుని దగ్గర పెట్టుకొని వేధిస్తున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాలకు ఉపాధినిమిత్తం వెళ్లిన వేలాది మంది కార్మికులు చట్టాలపై అవగాహన లేక, చేసిన చిన్నచిన్న పోరపాట్ల వల్ల జైళ్లలో మగ్గు తున్నారని కుంతియా అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, తమ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆయన విమర్శించారు. గల్ఫ్‌లో ఇండియా ఎంబసి వద్ద రోజు ప్రవాస భారతీయులు తిరిగి ఇండియాకు వచ్చేందుకు పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన సహాకారం లభించడం లేదన్నారు. ఏజెంట్ల మోసాలకు, అక్కడి యజమానుల వేధింపులకు తెలంగాణ కార్మికులు బలి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కార్మికులను వెంటనే తిరిగి రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అనేక సార్లు గల్ఫ్ కార్మికుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వ దృష్టికి తాము తీసుకువెళ్లామన్నారు. అయినా ఎలాంటి స్పందన లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో గల్ఫ్ కార్మికుల కోసం అనేక పథకాలను ప్రకటించిన టిఆర్ఎస్ , అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళలో ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే ఒక ఉన్నత స్థాయి అధికారుల బృందాన్ని గల్ఫ్ కు పంపించి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ విషయంలో తగిన విధంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని లేకపోతే గల్ఫ్ కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

రాహుల్ కంటే పెద్ద పప్పు ఎవరూ లేరు

- కాంగ్రెస్ ఓ లోఫర్ పార్టీ
- సీఎంలను మార్చేందుకు నరమేధం సృష్టించారు
- దేశంలో జాతీయ పార్టీలు కనుమరుగు
- ప్రాంతీయ పార్టీలకే జనం దన్ను
- కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరిగిన మంత్రి కేటీఆర్





హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఈ దేశంలో రాహుల్‌గాంధీ కంటే పెద్ద పప్పు ఎవరూ లేరని రాష్ట్ర మున్సిపల్, ఐటి, పరిశ్రమలు, మైనింగ్, చేనేత, జౌళిశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బుధవారంనాడు క్యాంపు కార్యాలయంలో మీడియాతో నేడు చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇంచార్జీ కుంతియాతో పాటు ఇతర నేతల వ్యాఖ్యలపై మంత్రి నిప్పులు చెరికారు. గుడారాల చాటున, కుటుంబం వెనకాల దాక్కుని ఉత్తమ్‌కుమార్ రెడ్డి సవాల్ నుంచి తప్పించుకుంటున్నరన్నారు. 2019లోనూ ఒంటరిగా పోటీ చేస్తాం. భారీ మెజారిటీతో గెలుస్తాం. సొంత నియోజకవర్గంలో మున్సిపాలిటీని గెలిపించుకోలేని అసమర్థుడు రాహుల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఇటీవల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యోగాలు ఇవ్వని దద్దమ్మ కేసీఆర్ అంటూ ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రస్థాయిలో ఖండించారు. మూడున్నరేళ్లలో ముప్పైవేల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. దేశంలో ఎవరన్నా దద్దమ్మ ఉన్నారంటే అది రాహుల్‌గాంధీ మాత్రమే నని అన్నారు. మీ నాయకుడు పప్పు అని దేశమంతా తెలుసని.. గూగుల్‌లో వెతికినా అదే వస్తుందని ఎద్దేవచేశారు. కాంగ్రెస్‌నేతలు తనను బచ్చా అంటున్నారని, రాహుల్‌గాంధీ బచ్చా అని కేసీఆర్ అన్నారు. కేసీఆర్ దద్దమ్మకాదని దేశంలో మొనగాడు కేసీఆర్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. 2004నుంచి 2014 కాలంలో ఐదువేల ఉద్యోగాలు కల్పించారని, కేసీఆర్ మూడున్నరేళ్లలో ఇప్పటికే 30వేల ఉద్యోగాలు కల్పిచారన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మెదడు మోకాళ్లలో ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికి, రాష్ట్రానికి దరిద్రకొట్లు పాలనకు విముక్తి కలిగించిన నేత కేసీఆర్ అన్నారు. మాట్లాడే ముందు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు ఎలాంటి సమస్యలు కనిపించడంలేదని, దీంతో ప్రతి దానిని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

దేశంలో జాతీయ పార్టీలు లేవు: దేశంలో జాతీయ పార్టీలు కనుమరుగు అయ్యాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. పెద్ద, చిన్నసైజు ప్రాంతీయ పార్టీలు మాత్రమే ఉన్నాయన్నారు. అయిదు దక్షిణాధి రాష్ట్రాలలో జాతీయ పార్టీల ఉనికి లేదన్నారు. ప్రాంతీయ పార్టీలు ఉంటేనే ఆ రాష్ట్రాల పరిస్థితి, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాయని ప్రజలు నమ్ముతున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలో జాతీయ పార్టీల ఉనికి లేదన్నారు. అలాంటప్పుడు జాతీయ పార్టీలు ఎక్కడున్నట్లు అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు నిలదొక్కుకున్నాయన్నారు. గుజరాత్, మహారాష్ట్ర మినహా దక్షినాధిలోని కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు ఎగుమతుల్లో అగ్రగామిగా ఉన్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో రెండు ప్రాంతీయ పార్టీలు సక్సెస్ అయ్యాయన్నారు. ఇందులో టీడీపీ, టీఆర్ఎస్‌లని మంత్రి తెలిపారు. తాను సిరిసిల్లను వదిలిపెట్టి వెళ్లాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ తర్వాత రాజకీయ వారసులుగా ఎవరు అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఇది ఊహాజనిత ప్రశ్న అని కొట్టిపారేశారు. కేసీఆర్‌కు 65ఏళ్లు అని ఇంకా 10-15ఏళ్లు ప్రభుత్వాన్ని నడిపేఊ ఆరోగ్యం, ఆయుష్షు ఆయనకు ఉందని మంత్రి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ చేసిన అభివృద్ధితో ఎన్నికలకు వెళ్తామని, లోపాలుంటే సరిదిద్దుకొని పార్టీ కేడర్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ కేడర్‌కు త్వరలో శిక్షణ సైతం ఇస్తామన్నారు.

సీఎంను మార్చేందుకు నరమేధమా?: పదవుల కోసం నరహంతుకులుగా మారిన వాళ్లు కాంగ్రెస్ నాయకులని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పదవికోసం సొంత మనుషులను చంపిన వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు. హైదరాబాద్‌లో 1991లో చేసిన నరమేధాన్ని మరిచిపోయి నల్గొండ హత్య గురించి మాట్లాడుతున్నారు. లోకల్‌లో హత్య జరిగితే అదేదో రాష్ట్ర సమస్య అన్నట్లు మాట్లాడుతున్నరని దుయ్యబట్టారు. కోమటిరెడ్డి తమ తలపు తట్టి వెళ్లిందని చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టులు అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు అందడం మొదలైతే ఇంకా తమ బలం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో నూతన పార్టీల ఏర్పాట్లపై వస్తున్న కథనాలపై మంత్రి స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాల్లోకి రావొచ్చని, పార్టీలు పెట్టుకోవచ్చన్నారు. వాటి ఫలితం ఏంటనేది ఎన్నికల్లో తెలుస్తదన్నారు. జాతీయ పార్టీలు పనికిరావు అని దేశ ప్రజలు ఆలోచిస్తున్నరన్నారు. బీజేపీ కనీసం మిత్ర పక్షాలను కూడా మెప్పించలేకపోయింది. ఇంక ప్రజలను ఎం మెప్పిస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్ ఎవరిని మెప్పించలేదన్నారు. టీడీపీ, బీజేపీతో ఉందా లేదా అనేది అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు.

ఐక్యంగా ముందుకెళుతున్న కాంగ్రెస్

- గ్రూపు విభేదాలకు స్వస్తి
- గెలుపే లక్ష్యంగా నాయకుల కలయిక
- రెండవసారి ఉత్తమ్ అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత మారిన సీన్
- ఉత్తమ్ నాయకత్వాన్ని తొలుత బాహాటంగానే వ్యతిరేకించిన కోమటిరెడ్డి
- బొడ్డుపల్లి హత్యనంతరం పార్టీ నాయకత్వ సహకారంతో రాజీకి మొగ్గు
- గత ఎన్నికల్లో నేతల మధ్య విభేదాలే కొంప ముంచిన వైనం
- గత ఎన్నికల పరిస్థితి పునారవృతం కాకుండా ఉత్తమ్ జాగ్రత్తలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు సమసిపోయినట్లేనా? నేతలంతా ఐక్యంగా ఏకతాటిపైకి వచ్చారా??, గెలుపే లక్ష్యంగా అధికారపార్టీపై పోరుకు సిద్ధపడుతున్నారా? అంటే ఆపార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. రానున్నా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలంతా ఐక్యంగా ముందడుగు వేయాలని నిర్ణయించారు. గ్రూపు విభేదాలకు తావునిస్తే, రానున్నా ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోతామని భావిస్తున్న అగ్రనేతలు, టీ- పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పనిచేయడం ఇష్టమున్నా, లేకపోయినా రానున్నా ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కలిసి పనిచేయడానికి మానసికంగా సిద్ధపడుతున్నారు. టీ-పీసీసీ అధ్యక్షునిగా ఏఐసీసీ నాయకత్వం ఉత్తమ్‌ను రెండవసారి నియమించిన తరువాత పార్టీ నేతల్లో కొద్దిమార్పు కనిపిస్తోంది. ఉత్తమ్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం, గ్రూపులు కట్టడం కంటే ఉత్తమ్ నేతృత్వంలో పనిచేయడానికి ఒకొక్కరుగా రెడీ అవుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఎన్నికైన తరువాత టీ-పీసీసీ అధ్యక్షునిగా ఉత్తమ్‌ను రెండవసారి నియమించిన విషయం తెలిసిందే. దీంతో 2019 ఎన్నికల వరకు ఆయన్నే అధ్యక్షునిగా కొనసాగించే అవకాశాలున్నాయని భావిస్తున్న పార్టీ అగ్రనేతలు రాజీ ఫార్మూలాకు వచ్చినట్లు తెలుస్తోంది. రానున్నా ఎన్నికల వరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉత్తమ్ కొనసాగే అవకాశాలున్న తరుణంలో ఆయన నాయకత్వానికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం ద్వారా వచ్చే ప్రయోజనమేమి లేదని భావిస్తున్నారు. దానికితోడు రేపు ఎన్నికల్లో తమ అనుచరులకు టికెట్లిప్పించుకోవడం కష్టమవుతుందని భావిస్తున్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకుంటున్న అగ్ర నేతలంతా ఇప్పుడిప్పుడే ఏకతాటిపైకి వచ్చి, పార్టీ నిర్వహిస్తోన్న ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో ఐక్యంగా పాల్గొంటున్నారు. నల్గొండ జిల్లాలో ఇటీవల దారుణహత్యకు గురైన బొడ్డుపల్లి శ్రీనివాస్ సంతాపసభకు పార్టీ అగ్రనేతలంతా హాజరుకావడం, పార్టీ నాయకులమధ్యనున్న ఐక్యతకు సంకేతామని కాంగ్రెస్‌పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తమ్ నాయకత్వాన్ని బహటంగానే వ్యతిరేకించిన కోమటిరెడ్డి సోదరులు, బొడ్డుపల్లి హత్య అనంతరం పీసీసీ నాయకత్వం స్పందించిన తీరుచూసి, కాసింత వెనక్కి తగ్గడమే మంచిదన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీనివాస్ హత్యకు గురైన విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఉత్తమ్, కోమటిరెడ్డికి ఫోన్ చేసి ఆరాతీయడమే కాకుండా,ఆ మరుసటి రోజు పార్టీ కీలకనేతలంతా నల్గొండకు చేరుకుని శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. దీంతో నల్గొండలో అధికారపార్టీ నేతలతో మొదటి నుంచి విభేదిస్తూ వస్తున్న కోమటిరెడ్డికి, పార్టీ నాయకత్వమంతా దన్నుగా ఉందన్న సంకేతాలను పంపడంలో ఉత్తమ్ సక్సెసయ్యారని పార్టీ వర్గాలంటున్నాయి. అలాగే శ్రీనివాస్ సంతాపసభకు కూడా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి కుంతియా, సీఎల్పీనేత జానారెడ్డి, కేంద్రమాజీమంత్రి జైపాల్‌రెడ్డి, మండలివిపక్షనేత షబ్బీర్‌అలీ, ఏఐసీసీ కార్యదర్శి హన్మంతరావు వంటి అగ్రనేతలు హాజరుకావడంలో ఉత్తమ్ కీలకపాత్ర పోషించారని అంటున్నారు. తన కుటుంబ సభ్యుడిమాదిరిగా వ్యవహరించిన శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ నేతలంతా దన్నుగా నిలిచేందుకు సహకరించిన ఉత్తమ్‌తో విభేదాలు కొనసాగించడం కంటే రాజీనే బెటరన్న నిర్ణయానికి కోమటిరెడ్డి వచ్చినట్లు తెలుస్తోంది.

స్పీడ్ పెంచిన ఉత్తమ్...: రెండవసారి అధ్యక్షునిగా నియమించిన అనంతరంఉత్తమ్ స్పీడ్ పెంచారు. ప్రజాసమస్యలపై స్పందించడంతోపాటు, కలిసివచ్చే శక్తులను కలుపుకువెళ్లే ప్రయత్నాన్ని చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. పార్టీ నేతలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఆయన శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ నేతల మధ్య విభేదాలే కొంపముంచాయని భావిస్తున్న ఉత్తమ్, ఈసారి అటువంటి పరిస్థితి తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మీడియా ముందుకు రారు

చిటపటలని లీకులు

- బాబుపై జగన్ ఫైర్
- బాబుకు తెలియకుండానే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారా
- బాబువి విలువల్లేని రాజకీయాలు
- మోడీ హవా బాగున్నప్పుడు బాబు ముస్లింలను అసలు పట్టించుకోరు
- మోడీ హవా తగ్గితేనే ముస్లింలు గుర్తుకొస్తారు
- ప్రజా సంకల్ప యాత్రంలో వై.ఎస్.జగన్ ధ్వజం





(ఆత్మకూరు నుంచి సూర్య పొలిటికల్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి): కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టి ఐదు రోజులవుతున్నా ఇప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీడియా ముందుకు రాలేదని, రోజూ గంటలు గంటలు మీడియాతో మాట్లాడి ప్రజలకు బోర్ కొట్టించే చంద్రబాబు ఇప్పుడెందుకు మీడియా ముందుకు రావడం లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బాబు మీడియా ముందుకు రాకుండా.. తన అనుకూల మీడియాతో లీకులు ఇప్పిస్తున్నాడని, బడ్జెట్‌పై చంద్రబాబు చిటపటలాడుతున్నారని ఆయన అనుకూల మీడియా ఊదరగొడుతోందని, బాబు తీరు ఆశ్చర్యం కలిగిస్తోందని వైఎస్ జగన్ అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం హసనాపురంలో వైఎస్ జగన్ ముస్లింలతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో చంద్రబాబు పార్టీకి చెందిన ఎంపీలే మంత్రులుగా ఉన్నారని, వాళ్లంతా ఆమోదించిన తర్వాతే బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెడతారని వైఎస్ జగన్ గుర్తుచేశారు. ఈ క్రమంలో నిజంగా చంద్రబాబుకు తెలియకుండానే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారా అని నిలదీశారు. నిజానికి ఇది ఐదో కేంద్ర బడ్జెట్ అని, చంద్రబాబు పార్టీకి చెందిన కేంద్రమంత్రులు ఆమోదించిన తర్వాతే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని మరోసారి స్పష్టం చేశారు. తన తప్పులు, వైఫల్యాలకు కేంద్రం మీద నెపం నెట్టేందుకే బాబు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయంలోనూ చంద్రబాబు విశ్వసనీయత, విలువలేని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో మోదీ హవా ఎక్కువగా ఉన్నప్పుడు బాబు మైనారిటీలను విస్మరిస్తారని, అదే మోదీ హవా డౌన్ కాగానే ఆయనకు మైనారిటీలు గుర్తుకు వస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రత్యేక హోదా సంజీవిని అనీ, పదేళ్లు కాదు పదిహేనేళ్లు కావాలని పేర్కొన్న బాబు ఇప్పుడు హోదా ఏమైనా సంజీవినా అనీ రివర్స్ ప్రశ్నిస్తున్నారని గుర్తుచేశారు. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి విలువలు రావాల్సిన అవసరముందని, రాజకీయాల్లో నిజంగా మార్పు రావాల్సిన అవసరముందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలంటే సిన్సియారిటీ, నిజాయితీ, విశ్వసనీయత ఉండాలని అన్నారు. ఇంకా జగన్ ఏమన్నారంటే "చంద్రబాబు తన మ్యానిఫెస్టోలో ప్రతి కులానికి ఒక పేజీ పెట్టి ప్రతి ఒక్కరినీ మోసం చేశాడు, బాబు మ్యానిఫెస్టో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వెతికినా దొరకదు, ఎందుకంటే మ్యానిఫెస్టోలోని ప్రతి పేజీలో ఒక మోసం తెలుస్తోంది, మ్యానిఫెస్టోను ప్రజలు చూస్తే బాబును కొడతారేమోనన్న భయంతోతో దానిని ఆన్‌లైన్‌లో కనబడకుండా చేశారు, ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోతే నాయకుడు రాజీనామా చేసి దిగిపోవాలి, అప్పుడే చెడిపోయిన ఈ రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత వస్తుంది, రాజకీయాల్లో సిన్సియారిటీ, నిజాయితీ, విశ్వసయనీత లేకపోతే, అప్పుడు అచ్చం ఏపీ రాజకీయాల్లో దిగజారిపోతాయి, అప్పుడు రాజకీయ నాయకుడు అచ్చం చంద్రబాబులా దిగజారిపోతారు, కూతురిని ఇచ్చి పెళ్లి చేసిన సొంత మామను వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుది, మైనారిటీలను మోసం చేశారు, అధికారంలోకి వస్తే మైనారిటీలకు ఏం చేస్తానో చెప్తూ చంద్రబాబు మ్యానిఫెస్టోలో పెట్టారు, నిరుద్యోగ ముస్లిం యువతకు ఐదు లక్షల వరకు వడ్డీలేని రుణాన్ని అందిస్తానని చెప్పారు, పేద, మధ్య తరగతి ముస్లింలకు లక్ష వరకు వడ్డీలేని రుణాన్ని 50శాతం సబ్సిడీతో బ్యాంకులతో నిమిత్తం లేకుండా ఇస్తామని ఊదరగొట్టారు, వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానంతో ముస్లింలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తామని పేర్కొన్నారు, ముస్లిం బాలికలకు, పిల్లలకు ఎల్కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామన్నారు, వీటిలో ఏ ఒక్క హామీ అయిన అమలైందా ఏ ఒక్కరికైనా వడ్డీలేని రుణాలు వచ్చాయా, ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానం అమలైందా." అని వైఎస్ జగన్ ప్రశ్నించారు.

బాబుపై మరో బీజేపీ నేత సంచలన వ్యాఖ్యలు



గుంటూరు, మేజర్‌న్యూస్: టీడీపీ నాయకులపై బీజేపీ నేతల మాటల దాడి కొనసాగుతోంది. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపైనే బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. గుంటూరులో విలేకరుల తో మాట్లాడుతూ టీడీపీ నేతలు ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ వృధా ఖర్చులు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని మరింతగా అప్పులపాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,500 కోట్లు ఇచ్చినా చిన్న నిర్మాణం కూడా మొదలు పెట్టలేదని విరుచుకుపడ్డారు. ఇచ్చిన సొమ్ముకు లెక్కా, పత్రాలు లేవని, కనీసం డీపీఆర్ ఇవ్వకుండా నిధులు ఇవ్వమంటే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సినిమా డైరెక్టర్లతో డిజైన్లు వేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇదివరకే బీజేపీ నేత సోము వీర్రాజు టీడీపీ అక్రమాలపై బహిరంగా విమర్శలు చేసిన సంగతి తెల్సిందే. తాజాగా కన్నా లక్ష్మీనారాయణ కూడా చేరడంతో టీడీపీ నేతలకు ఏంచేయాలో తోచడం లేదు

ఏపీకి తీవ్ర నిరాశే : సీతారామ్ ఏచూరి



నల్గొండ, మేజర్‌న్యూస్: కేంద్రం బడ్జెట్‌లో రెండు రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో నిరాశే మిగిలిందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మంగళవారం పార్లమెంట్‌లో ఆందోళన చేయడంపై సీపీఎం నేత సీతారాం ఏచూరి స్పందించారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ అయిదేళ్లు ప్యాకేజీ ఇస్తామంటే, పక్కనే ఉన్న వెంకయ్యనాయుడు పదేళ్లు అయితే బాగుంటుందని సూచించారని గుర్తు చేశారు. పదేళ్లపాటు ప్యాకేజీ ఉన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతున్న ఎన్డీఏలో ఉన్న టీడీపీ ప్రజలకు ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. బీజేపీతో జతకట్టి టీడీపీ సాధించింది శూన్యమని విమర్శించారు

ముద్దుకృష్ణమ మృతికి కడియం, ఉత్తమ్ సంతాపం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు హఠాన్మరణం పట్ల ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు కడియం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముద్దుకృష్ణమ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కడియం ఈ సందర్భంగా ముద్దుకృష్ణమతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముద్దుకృష్ణమ మృతి పట్ల టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ సీఎల్పీ నేత జానారెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముద్దుకృష్ణమతో తనకు చక్కటి అనుబంధం ఉన్నదని ఉత్తమ్ చెప్పారు. తాను చైర్మన్‌గా వ్యవహరించిన కమిటీలో ఆయన సభ్యునిగా వ్యవహరించారని చెప్పుకొచ్చారు. ముద్దుకృష్ణమ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఉత్తమ్, జానారెడ్డిలు వెల్లడించారు. పార్టీలకతీతంగా పలువురు నేతలు, ముద్దుకృష్ణమ మృతికి సంతాపం తెలియజేశారు.

పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీల నిరసన

★రెండోరోజు కొనసాగుతున్న వైసీపీ ఎంపీల ఆందోళన
★పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన

న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు రెండోరోజు కూడా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే వైసీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి ఏపీకి తగిన న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు రాజ్యసభలో విజయసాయిరెడ్డి సైతం విభజన చట్టంలోని హామీలన్నీ అమలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏపీలో అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదా కల్పించాలని, నిధులు కేటాయించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో వైసీపీ ఎంపీలు ప్రశ్నించారు. అంతకుముందు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్, వైఎస్ అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. దుగరాజపట్నం పోర్టు, ప్రత్యేక రైల్వే జోన్, ప్రత్యేక హోదా ఇవ్వాలని, కడపకు స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటూ నినాదాలు చేస్తూ తమ నిరసన తెలిపారు. న్యాయబద్ధంగా రావాల్సిన ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, నిధులను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ బీజేపీలోకి చేరికలు!



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ బీజేపీలో చేరికలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ మాదిగ విద్యార్థి జేఏసీ చైర్మన్ గద్దల అంజిబాబు బీజేపీలో చేరినట్టు చెప్పారు. బీజేపీ ద్వారానే దళితులకు సామాజిక న్యాయం లభిస్తుందన్న నమ్మకంతో విద్యార్థి నేత గద్దల అంజిబాబు పార్టీలో చేరారని తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలో టీఆర్ఎస్‌కు చెందిన దళిత నేత రామలింగేశ్వరరావు బీజేపీలో చేరినట్టు వివరించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన వైఫల్యంపై అసంతృప్తితోనే దళిత నేతలు కమలదళంలో చేరుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ దళితులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీల ఎబీసీడీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహూల్ గాంధీ ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయం బీజేపీనే అని అన్నారు.

యాదాద్రిలో గవర్నర్ పర్యటన



యాదాద్రి: రాష్ట్ర గవర్నర్ నరసింహన్ యాదాద్రిలో పర్యటిరచారు. ఇందులో భాగంగా పోచంపల్లి మండలం కనుముక్కులలో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ పార్క్‌ను గవర్నర్ సతీసమేతంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్ పాల్గొన్నారు.

సూర్య
హైదరాబాద్
గురువారం
8 ఫిబ్రవరి 2018
3

రానున్న ఎన్నికల్లో నల్గొండ నుంచి శ్రీనివాస్ సతీమణి పోటీ?

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఇటీవల హత్యకు గురైన కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ సతీమణి, నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిని, రానున్నా ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దింపాలని టీపీసీసీ నాయకత్వం భావిస్తోంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే, సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకత్వానికి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లి ఆయన చేత నల్గొండ అభ్యర్థిగా లక్ష్మి పేరును ప్రకటించేవిధంగా చర్యలు తీసుకోవాలని టీ-పీసీసీ నాయకత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పథకరచన చేశారని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ హత్య కేసులో నిందితులు ఘటనకు ముందు, తరువాత ఎమ్మెల్యే వేముల వీరేశం బంధువులతో ఫోన్‌లో సంభాషించిన కాల్‌డేటాను ఇటీవల కాంగ్రెస్‌నేతలు బహిర్గతం చేశారు. దీంతో టీఆర్ఎస్ నేతలే శ్రీనివాస్ హత్యకు బాధ్యులంటూ ఆపార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. నల్గొండలో నిర్వహించిన శ్రీనివాస్ సంతాపసభలో ఇదే విషయాన్ని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియా, టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీనేత జానారెడ్డి తదితరులు చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్ హత్య రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్‌నేతలు, శ్రీనివాస్ హత్యను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడానికి అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. బొడ్డుపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించడానికి ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీని పిలవాలని, అదే సందర్భంగా లక్ష్మిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటన చేయించాలని టీపీసీసీ భావిస్తోంది. ఒకవేళ రాహుల్ పర్యటన సాధ్యం కాకుంటే, ఏఐసీసీ ముఖ్యులతో ప్రకటన చేయించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. బీసీ సామాజికవర్గానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మికి అవకాశమివ్వడం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక కోమటిరెడ్డి కూడా లోక్‌సభకు పోటీచేయాలన్న ఆసక్తితో ఉన్నట్టు పలుమార్లు చెప్పుకొచ్చారు. శ్రీనివాస్ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అత్యంత నమ్మకమైన అనుచరుడు కావడంతో, ఆయన కుటుంబానికి రాజకీయంగా పెద్దపీట వేసేందుకు తన సిట్టింగ్ స్థానాన్ని వదులుకునేందుకు సిద్ధపడినట్లు సమాచారం.

అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక

- హైటెక్స్ మైనింగ్ 2018
- హైటెక్స్ లో 14 నుంచి 17 వరకు ఈ కార్యక్రమం
- అమెరికా, కెనడా, అస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికాలోని మైనింగ్ కంపెనీలు, ప్రతినిధుల హాజరు
- మైనింగ్ టూడే కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ నర్సింహాన్,
- కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ హాజరు
- రాష్ట్రంలో అవకాశాలు, మైనింగ్ అనుబంధం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపైన ఈ సమావేశం ప్రత్యేక చర్చ
- నేడు ఢిల్లీకి మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: హైదరాబాద్ నగరం మరో అంతర్జాతీయ స్థాయి సదస్సుకు వేదిక కాబోతోంది. మైనింగ్ టూడే కార్యక్రమాన్ని నగరంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు, ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో మైనింగ్ ఇంజనీర్స్ అసోషియేషన్ అప్ ఇండియా , ఫిక్కి కలిసి నిర్వహిస్తున్నాయన్నారు. టెక్నాలజీ, ఎక్విప్ మెంట్, మేషినరీ, పాలసీ మరియు ఒవర్ సీస్ థీమ్ తో ఈ సమావేశం జరుగుతున్నది. హైటెక్స్ లో ఈ నెల 14 నుంచి 17 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. దేశ అర్ధిక ప్రగతిని బలోపేతం చేసేందుకు మైనింగ్ ఒక కీలకమైన అంశం అని, పవర్, సిమెంట్, ఏరోస్పేస్, ఢిఫెన్స్, అయిల్ మరియు గ్యాస్ వంటి రంగాలను ప్రభావితం చేసే పలు అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఖనిజాల అన్వేషణలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజాన మార్పులపైన ప్రధానంగా ఈ సమావేశంలో చర్చ జరగనున్నది. మైనింగ్ సాంకేతిక పరిజాన అంశంలో గనుల గుర్తింపులో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల వినియోగం, గనులకు రేటింగ్ ఇవ్వడం, గనుల పర్యవేక్షణ వంటి అధునాతన సాంకేతిక పరిజానాలపైన వివిధ దేశాల నుంచి వచ్చే నిపుణులు చర్చిస్తారు. దీంతోపాటు మైనింగ్ పాలసీలు, వాతావరణం, మైనింగ్ రంగంలోని అవకాశాలు, సాంకేతిక పరిజాణ బదిలీ వంటి అంశాలపైన ఈ సదస్సులో చర్చించడంతోపాటు అయా అంశాలకు సంబందించిన నూతన ప్రొడక్టుల అవిష్కరణ జరపనున్నారు. ముఖ్యంగా ఇసుక ప్రొక్యూర్ మెంట్ విధానాల అధ్యాయనంలో భాగంగా బీచ్ సాండ్స్, రివర్ సాండ్స్, క్రష్‌డ్‌స్టోన్ సాండ్(రాతి ఇసుక) వంటి అంశాలను ప్రత్యేకంగా చర్చిస్తారు. మైనింగ్ రంగంలోని పెట్టుబడులు అవకాశాలు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని అవకాశాలు, మైనింగ్ అనుబంధం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపైన ఈ సమావేశంలో ఒక చర్చకార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఈ సమావేశాలకు అమెరికా, కెనడా, అస్ట్రేలియా, ఆసియా, అఫ్రికాలోని దేశ విదేశాల నుంచి ప్రతనిధులు హాజరవుతారు. ఈ ప్రతినిధులు చర్చల్లో పాల్గోనడంతోపాటు, అయా దేశాలకు చెందిన మైనింగ్ మరియు అనుబంద కంపెనీలు వారి వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. ఈ మైనింగ్ టూడే కార్యక్రమ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఈయస్ యల్ నర్సింహాన్, కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లు హజరవుతారు. ఈమేరకు మంత్రి కెటి రామారావు గవర్నర్‌ను కలిసి అహ్వానం అందజేశారు.

నేడు ఢిల్లీకి : రాష్ట్ర మైనింగ్, పరిశ్రమలు, ఐటి, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గురువారంనాడు ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈ పర్యటనలో వరల్డ్ కాంగ్రెస్ సదస్సులో పాల్గొనాలంటూ రాష్ట్రపతిని కలిసి ఆహ్వానించనున్నారు. అలాగే ఈనెల 14 నుంచి నగరంలో జరుగుతున్న మైనింగ్ సదస్సులోపాల్గొనేందుకు కేంద్ర మంత్రి తోమర్‌ను కలిసి ఆహ్వానం అందజేయనున్నారు. మైనింగ్ శాఖాధికారుల డైరీని అవిష్కరించిన మంత్రి కెటి రామారావు గనుల శాఖాధికారుల 2018 డైరీని గనుల శాఖ మంత్రి కెటి రామారావు ఈ రోజు బేగంపేట క్యాంపు కార్యాలయంలో అవిష్కరించారు. డైరెక్టర్ అఫ్ మైన్స్ సుశీల్ కూమార్ అద్యర్యంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖాధికారుల సంఘం రాష్ట్ర నాయకులు ఈ డైరీ అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గనుల శాఖాధికారులు సంఘానికి మంత్రి కెటిరామారావు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

కేసీఆర్ గొప్పలు చెప్పడం తప్ప పనులు చేయడం లేదు

ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి కేసిఆర్‌కు గొప్పలు చెప్పడం మినహా పనులేమి చేతకావని ఏఐసీసీ కార్యదర్శి వీ.హన్మంతరావు ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి రాష్టానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో టీఆర్ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమయిందని ఆయన దుయ్యబట్టారు. బుధవారం గాంధీభవన్‌లో వీహెచ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణకు ఎంత అన్యాయం చేస్తున్నా, కేసిఆర్ స్పందించడ లేదని మండిపడ్డారు. కేసిఆర్ ఏదో చేస్తున్నట్టు గొప్పలు చెప్పడం తప్పితే ఏ ఒక్క ప్రజా ప్రయోజనమున్న పనిచేయడం లేదని ఆయన విమర్శించారు. కర్ణాటకలో గెలిచేందుకు నరేంద్రమోడీ చీఫ్ ట్రిక్స్ చేస్తున్నారని, ముగిసిపోయిన బోఫోర్స్ కుంభకోణం మళ్లీ తెరపైకి తెచ్చి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని ఆయన అన్నారు. కర్ణాటకలో అత్యంత అవినీతి పరుడైన యద్యూరప్ప తో చట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్న మోడీ కర్ణాటకలో గెలిచేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఐసెట్ షెడ్యూల్ విడుదల

మార్చి 22న నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఐసెట్-2018 షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. తొలిసారి ఆన్‌లైన్‌లో ఐసెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు కన్వీనర్ సుబ్రహ్మణశర్మ తెలిపారు. మార్చి 6 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 30వతేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని వెల్లడించారు. మే 23, 24 తేదీల్లో ఐసెట్ పరీక్ష జరుగుతుందని చెప్పారు. జూన్ 6 న ఫైనల్ కీ, అదే నెలలో ఫలితాలు విడుదల చేస్తామని ఆయన అన్నారు. . తెలంగాణలో 12, ఆంధ్రప్రదేశ్‌లో 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

చట్టసభల్లో బీసీల వాటా కోసం 12న ధర్నా

గుంటూరు, మేజర్‌న్యూస్: దేశ జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు చట్ట సభల్లో 50 శాతం సీట్లు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు, దీక్షలు చేస్తున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. స్థానిక రైలుపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన సంస్థ సమన్వయ సమితి సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా 55 శాతం జనాభా ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కలేదన్నారు. కేవలం మూడు నుంచి 10 శాతం ఉన్న అగ్రవర్ణాలే నేటికి రాజ్యమేలుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం 9 శాతం దాటలేదన్నారు. న్యాయ స్థానాల్లో 6 శాతంకే పరిమితం అయిందన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ చిత్తశుద్ధి ఉంటే మోదీని కలిసి బీసీ బిల్లు పెట్టేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సం ఘం రాష్ట్ర సెక్రటరి అంగిరేకుల ఆదిశేషు, కుమ్మర క్రాంతి కు మార్, పిన్నిబోయిన సుబ్బారావు, విన్నకోట వెంకటేశ్వర్లు, శివరాఘవయ్య, కాసుల కృష్ణంరాజు పాల్గొన్నారు

దుర్గగుడి పాలకమండలి సమావేశం

విజయవాడ, మేజర్‌న్యూస్: దుర్గగుడి పాలకమండలి సమావేశం బుధవారం ప్రారంభమైంది. ఇంద్రకీలాద్రిపై శివరాత్రి ఉత్సవాలు, మల్లేశ్వర ఆలయం పున:ప్రారంభంపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. క్యూలైన్లలో మార్పులపై పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది. ఈవో ఎం.పద్మ, పాలకమండలి చైర్మన్ గౌరంగబాబు, సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

ఎస్సార్డీపీ ప్రాజెక్టు వేగవంతం

ప్రాజెక్టు పనుల పురోగతిపైన శాఖల సమన్వయ సమావేశం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: హైదరాబాద్ నగరాన్ని విశ్వనగంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ఎస్సార్డీపి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్, ఐటి, పరిశ్రమలు, మైనింగ్‌శాఖ మంత్రి కేటీ రామారావు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతిపైన మంత్రి కెటి రామారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. బేగంపేట క్యాంపు కార్యాలయంలో ట్రాన్స్ కో, జలమండలి, సిపిడిసియల్, జిహెచ్ఎంసీ అధికారుల సమన్వయం సమావేశంలో మంత్రి ఎస్సార్డీపి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సార్డీపి ప్రాజెక్టు పనుల కోసం తరలించనున్న విద్యుత్, వాటర్ వర్స్ లైన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపైన ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఎస్సార్డీపి ప్రాజెక్టు ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అన్న మంత్రి, దీని పనులను వేగంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా శాఖల మద్య సమన్వయానికి ఇలాంటి సమావేశాలు తరచుగా నిర్వహించాని, ఎద్దైన సమస్యలుంటే తనకు నేరుగా తెలియపరచాలన్నారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగితేనే పనులు వేగవంతం అవవుతాయన్నారు. జలమండలి, విద్యుత్ శాఖల లైన్ల తరలింపు పనులకు సాద్యమైనంత త్వరగా చేసేందుకు టెండర్ గడువు తగ్గించాలన్నారు. శాఖల మద్య అర్ధిక పరమైన లావాదేవిలు(తరలింపు, రోడ్డు రిస్టోరేషన్ పనులు ఫీజులు) పూర్తి అయ్యేదాకా పనులు అపకుండా వేంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఎస్సార్డీపి పనులకు అవవసరం అయిన భూసేకరణ సమన్యలపైన మంత్రి, జిల్లా కలెకర్లు, రెవెన్యూ యంత్రాంగంతో మంత్రి ఫోన్లలో మాట్లాడారు. ఎస్సార్డీపి భాగంగా కామినేని, యల్ బి నగర్, బయోడైవర్సీటి పార్కు, చింతల కుంట, దుర్గం చెరువు వంటి ప్రాంతాల్లో చేపట్టిన పనులపైన ఈ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

పవన్ కల్యాణ్‌కు నా మద్దతు : కత్తి మహేష్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రత్యేక హోదాపై ఆంధ్రప్రదేశ్ అట్టుడుకుతోంది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు ఈ విషయమై ఆందోళన చేపడుతున్నారు. మరోవైపు వైసీపీ ఎంపీలు బుధవారం సభ నుంచి వాకౌట్ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. అయితే ఈ అంశంపై తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కానీ కత్తి మహేష్ మాత్రం పవన్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, తన పూర్తి మద్దతు పవన్‌కే అని తెలియజేస్తూ ఓ ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ఈ నెల 21నుంచి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేయనున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు నా మద్దతు తెలుపుతున్నాను అని మహేష్ ట్వీట్ చేశారు. కొద్ది రోజుల క్రితం వరకూ పవన్‌పై కారాలు మిరియాలూ నూరిన మహేష్ ఇప్పుడిలా ట్వీట్ చేయడం ఆశ్చర్యపరుస్తోంది.

పనిని బట్టి రేట్ ఫిక్స్ !

- ఫైలు కదలాలంటే పైకం ఇవ్వాల్సిందే
- ఆన్‌లైన్ ఉన్నా దళారులదే రాజ్యం
- అవినీతికి అడ్డాగా షాద్‌నగర్ మునిసిపాలిటీ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రరాజధాని హైదరాబాద్ సమీపంలోని మున్సిపాలిటీలలో అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారాయి. మున్సిపల్ కార్యాలయంలో పని ఉందా..? మీరు రోజుల తరబడి కార్యాలయాలకు తిరగాల్సిన పనిలేదు.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు అని సాక్షాత్తు మంత్రి కేటీఆర్‌తో పాటు మున్సిపల్ అధికారులు చెప్పిన మాటలు వింటున్నారా..? అయితే మీరు తప్పులో కాలేసినట్లే.. మున్సిపల్ సేవల్లో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను ప్రారంభించింది. ఉన్నతాధికారులు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని అనుకుంటున్నా.. క్షేత్రస్థాయి సిబ్బంది మూలంగా అది నీరుగారిపోతుంది. షాద్‌నగర్ మున్సిపాలిటీలో కిందిస్థాయి సిబ్బంది, మధ్యవర్తుల హవానే మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్నది. పనిపై ప్రజలు వెళ్తే అక్కడ పనిచేస్తున్న కమీషనర్‌తో పాటు సిబ్బంది ఎవరు కూడా మాట్లాడరు. పనికోసం వెళ్లేవారిపై కమీషనర్‌తో సహా అందరు కసురుకుంటారని, మధ్యవర్తితో వెళ్తేనే పని అవుతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఒక్కో పనికి ఒక్కో రేటు: షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో పనిని బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు.. గవర్నమెంటు రేటు కాదండి వారి రేటు... పనికి తగ్గ రేటు ఇస్తే మీ పని క్షణాల్లో అయిపోతుంది.. ఇంకా త్వరగా కావాలా..? ఇంకాస్త ఎక్కువ రేటు ఇస్తే మీకు కావాల్సిన కాగితం ఇంటికే నడిచి వస్తుంది. !జనన, మరణ ధృవీకరణ పత్రాలు, భవన నిర్మాణ, వ్యాపార అనుమతులు, యాజమాన్య పేరు మార్పు, ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లకు ఒక రేటు అంటూ ఫిక్స్ చేస్తున్నారు. రేటు ఇవ్వని వారి కాళ్లకు ఉన్న చెప్పులు అరగాల్సిందే.

పెండింగ్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు: ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల విషయంలో నేరుగా ప్రజలు వెళ్లి మధ్యవర్తులను ఆశ్రయిస్తేనే పని జరుగుతుందని వాపోతున్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం మున్సిపల్ అధికారులకు అమ్యామ్యాలు చెల్లించాల్సిందే.. లేదా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగే దాకా తిరగాల్సిందే. ధృవీకరణ పత్రాల కోసం బాహాటంగానే డబ్బులు అడుగుతున్నారని విమర్శలు వినవస్తున్నాయి. అలాగే ఇక్కడ అక్రమనిర్మాణాలకు కొదువేలేకుండా పోయింది. మున్సిపాలిటీలో జరుగుతున్నఅ వినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులతో విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ధీనంగా వేడుకుంటున్నారు.

పవన్! పిచ్చి రాజకీయాలు మానుకో

గిరిజన సంఘం హెచ్చరిక



విజయవాడ, మేజర్‌న్యూస్: పవన్‌కళ్యాణ్ పిచ్చి రాజకీయాలు మానుకో....నీ స్వార్ధ ప్రయోజనాల కోసం మత్స్యకారులను ఎస్టి జాబితాలో చేరుస్తానని హామీ ఇస్తావా, మాకు అన్యాయం చేయాలని చూస్తావా, ఖబడ్దార్ అంటూ గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గుర్నాథం మండిపడ్డారు. పవన్‌కళ్యాణ్ మత్స్యకారులకు ఇచ్చిన హామీని వెనక్కి తీసుకోవాలని గిరిజన హక్కుల పరిరక్షణ సమితి నాయకులు విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి బయటకి వస్తున్న ప్రయాణికుల బూట్లకు పాలిష్ చేసి, వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాదిగాని గుర్నాథం మాట్లాడుతూ కులాలు, జాతుల ఆచార వ్యవహారాలు, స్థితిగతులు తెలియని పవన్‌కళ్యాణ్ ఎవరు జిందాబాద్ అంటే వారికి వరాలు ఇచ్చేస్తున్నారని మండిపడ్డారు. పిచ్చి పిచ్చి స్టేట్‌మెంట్‌లు ఇవ్వడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు మేడా రమేష్, పేరం సత్యం, రవివర్మ, ఎం.నవీన్, సరోజా తదితరులు పాల్గొన్నారు

పవన్‌పై మండిపడిన గిరిజన ఐక్య వేదిక : మత్స్యకారుల డిమాండ్లకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మద్దతు పలకడంపై గిరిజన ఐక్య వేదిక మండిపడింది. మత్స్యకానులను ఎస్టీలో చేర్చాలన్న ప్రతిపాదనకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ఐక్య వేదిక నాయకుడు దొర తెలిపారు. ఏనాడు గిరిజన హక్కుల గురించి పవన్ మాట్లాడలేదని అన్నారు. పవన్ విశాఖ, శ్రీకాకుళం పర్యటనను అడ్డుకుంటామని అన్నారు. మత్స్యకారులు బోయ, వాల్మీకిల అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే వారిని ఎస్టీల జాబితాలో చేర్చడం మాత్రం ఒప్పుకోబోమని ఆయన అన్నారు. ప్రభుత్వమే పవన్ చేత ఇలా ఆడిస్తుందా అని దొర విమర్శించారు

పవన్ పర్యటనను అడ్డుకుంటాం : గిరిజన సంఘాలు

ఎస్టీ జాబితాలో చేర్చే విషయంలో మత్స్యకారులకు మద్దతిస్తున్న పవన్ కళ్యాణ్ పర్యటనను అడ్డుకుంటామని గిరిజన సంఘాలు హెచ్చరించాయి. పవన్ దిష్టిబొమ్మలను తగలబెడతామన్నారు. ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడతామని గిరిజన సంఘాలు స్పష్టం చేశాయి.

నేడు ప్రజా సంకల్ప యాత్ర నిలుపుదల

ఏపీ బంద్‌కు మద్దతుగా నిర్ణయం

అమరావతి, మేజర్‌న్యూస్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు గురువారం నిలుపుదల చేయాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకొంది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు మద్దతుగా వామపక్షాలు చేపట్టే బంద్‌కు వైసీపీ తన విధానంలో భాగంగా సంఘీభావం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ బంద్‌కు మద్దతుగా వైఎస్ జగన్ గురువారంనాడు ప్రజాసంకల్పయాత్ర నిలిపివేయనున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఒకటిగా నిలబడాలని, ఈ బంద్‌ను విజయవంతం చేయాలని వైసీపీ విజ్ఞప్తి చేసింది

ప్రజా సంకల్పయాత్ర 82వ రోజు సాగిందిలా



నెల్లూరు, మేజర్‌న్యూస్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర 82వ రోజు ప్రజాసంకల్పయాత్ర మొదలైంది. బుధవారం ఉదయం ఆయన ఆత్మకూరు నియోజకవర్గం సంగం బైపాస్ రోడ్డు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కలిగిరి క్రాస్ రోడ్డు, తలుకురుపాడు క్రాస్ రోడ్డుమీదుగా కొరిమెర్ల క్రాస్ రోడ్డు వరకు పాదయాత్ర కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భోజన విరామం తీసుకున్నారు. మధ్యాహ్నం 2.45 గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభించారు. హసనాపురం ఎంట్రెన్స్ చేరుకున్న తర్వాత వైఎస్ జగన్ అక్కడ మైనార్టీలతో సమావేశమయ్యారు. అనంతరం హసనాపురం మీదుగా దుండిగామ్ వరకుపాదయాత్ర కొనసాగింది. రాత్రికి అక్కడే బసచేశారు.

1100 కిలోమీటర్లకు చేరుకొన్న ప్రజా సంకల్పయాత్ర

ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 1100 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. 82వ రోజు పాద్యాత్రలో భాగంగా ఆయన బుధవారం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని క్లిగిరి వద్ద 1100 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పార్టీ జెండా ఆవిష్కరించి, మొక్కను నాటారు. కాగా జిల్లాలోనే వైఎస్ జగన్ 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంక్టిరి నియోజకవర్గంలోని సైదాపురం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన విజయ సంకల్ప స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. కాగా వైఎస్ జగన్ గత ఏడాది నవంబర్ 6న వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయలో ప్రజాసంకల్పయాత్రను ప్రారంభించిన విషయం తెలిసిందే.

కొలువుల జాతర ఎక్కడ?

- ఇంటికో ఉద్యోగం ఉత్తమాటేనా?
- అరకొర ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లు జారీ
- ప్రభుత్వ తీరును నిరసిస్తున్న నిరుద్యోగులు
- రాష్ట్రంలో రోజు రోజుకు పెరిగిపోతున్న నిరుద్యోగులు
- నిరుద్యోగుల పోరుకు మద్దతు ఇస్తున్న బీసీ సంఘాలు
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా ఉద్యమాలకు శ్రీకారం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలు లేక, మరోవైపు ప్రైవేటు సంస్థల్లో సరియైన అవకాశం దక్కక పోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం వివిధ శాఖలల్లో నెలకొన్న ఖాళీలపై పూర్తిస్థాయిలో నోటిఫికేషన్లు జారీ చేయడంలేదంటూ ఆరోపిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొలువుల జాతర ఎక్కడ? అంటూ లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళన బాటపడుతున్నారు." నీళ్లు', 'నిధులు', 'నియామకాలు" అంటూ సాగిన ఉద్యమంలో... విద్యార్థులు, నిరుద్యోగులు చేసిన పోరాటమే కీలక భూమికి పోషించింది. సకల జనుల సమ్మెను విజయవంతం చేసింది కూడా విద్యార్థులే అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మిలియన్ మార్చ్‌లో కూడా విద్యార్థులదే పై చేయిగా కొనసాగింది. కాగా... ఉద్యమాలతో ఊపిరి పోసుకున్న ప్రత్యేక తెలంగాణలో నిరుద్యోగుల సమస్య రోజు రోజుకు జఠిలంగా మారుతోంది. ప్రభుత్వ వివిధ శాఖల్లోని ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడానికి సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షాలదిగా ఉన్న ఖాళీ ఉద్యోగాల పోస్టుల భర్తీ కోసం నామమాత్రపు ఉద్యోగాల సంఖ్యను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లను జారీచేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అరకొర నోటిఫికేషన్ల ద్వారా వెలువడుతున్న ఉద్యోగాలకోసం లక్షలాది మంది నిరుద్యోగులు ధరఖాస్తు చేసుకుంటూనే... ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని ఆశించిన నిరుద్యోగుల ఆశలు ఫలించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజిస్తే ప్రత్యేక తెలంగాణలో కొలువుల జాతర ఏర్పడనుందని ఉద్యమ సమయంలో అధికార టీఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు, మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎన్నో కలలుగన్నారు. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా అధికార టీఆర్ఎస్ ప్రభుత్వం నామ మాత్రంగా ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేస్తుండటంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగ యువత చేపడుతున్న ఆందోళనలకు బీసీ సంక్షేమ సంఘం పూర్తిస్థాయిలో మద్దతు తెలిపింది. వారు చేసే న్యాయమైన పోరాటంలో పాల్గొనేందుకు సిద్దం అంటూ బీసీ సంఘాల నేతలు వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ సమస్యపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అలాగే ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ శాఖలల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“ తాజాగా మాల్దీవులలో మరొక పరిణామం చోటు చేసుకుంది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ దెబ్బకు సుప్రీం కోర్టే వెనుకంజ వేయవలసి వచ్చింది. దేశంలో అత్యవసర పరిస్థితికి కారణమైన నిర్ణయాన్ని కోర్టు ఉపసంహరించింది. తొమ్మిది మంది రాజకీయ ఖైదీలను విడుదల చేయాలన్న నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లుగా కోర్టు మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ పరిణామంతోనైనా అక్కడ సంక్షోభం సద్దుమణిగితే అందరికీ మంచిది. భారత్ తన సైన్యాన్ని పంపే అవసరం కూడా తప్పుతుంది. మాల్దీవులలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా భారత్ అడుగులు వేస్తున్న వేళ ఆ దేశం సంగతి మీకెందుకని ప్రశ్నించేందుకు చైనా తెగించడం గమనార్హం. మాలేలోకి భారత్ సైన్యాన్ని పంపించరాదని, వారి సంక్షోభంలో భారత్ కల్పించుకోరాదని చైనా కోరింది. ఇండియా కావాలనే మాల్దీవుల ప్రభుత్వంపై ఒత్తిడి పెడుతోందని, ఇది సరి కాదని కూడా చైనా వ్యాఖ్యానించింది. మాల్దీ వుల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్‌పై ప్రభుత్వం మోపిన ఉగ్రవాద అభి యోగాలను సుప్రీం కోర్టు క్రితం వారం రద్దు చేయడమే కాకుండా నిర్బం ధం లో ఉన్న ఎనిమిది మంది ప్రతిపక్ష నేతల విడుదలకు ఆదేశించడం ఆ దేశంలో సంక్షోభానికి దారి తీసింది. పార్లమెంట్ నుంచి అనర్హులుగా ప్రక టించిన 12 మంది శాసనకర్తల పదవులను పునరుద్ధరించాలని ఆదేశించిం ది. ఆ ఉత్తర్వు అమలు జరిగిన పక్షంలో పార్లమెంట్‌లో సమైక్య ప్రతిపక్షానికి మెజారిటీ లభించి, అధ్యక్షుని అభిశంసించేందుకు మార్గం సుగమం అవుతుం ది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి ప్రభుత్వం ఇంత వరకు నిరాకరిస్తూ వచ్చింది. ”

భారత్‌కు మాల్దీవుల తంటా

మనకు పొరుగున, హిందు మహాసముద్రంలో ఉన్న దేశమైన మాల్దీవులలో తాజాగా నెలకొన్న సంక్షోభం మన ప్రభుత్వానికి సమస్యలు తెచ్చిపెట్టేదిగా కనిపిస్తోంది. మాల్దీవుల అధ్యక్షునికి, సుప్రీంకోర్టుకు మధ్య ప్రారంభమైన ఘర్షణ సైనిక జోక్యం చేసుకుంటుందేమోననే ఆందోళనను రేకెత్తించింది. ఆ పరిస్థితి భారత్‌లో విధాన నిర్ణేతలను అమితంగా కలవరపరుస్తోంది. మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్‌పై ప్రభుత్వం మోపిన ఉగ్రవాద అభియోగాలను సుప్రీం కోర్టు క్రితం వారం రద్దు చేయడమే కాకుండా నిర్బంధంలో ఉన్న ఎనిమిది మంది ప్రతిపక్ష నేతల విడుదలకు ఆదేశించడం ఆ దేశంలో సంక్షోభానికి దారి తీసింది. ప్రస్తుతం తనకు తానుగా ప్రవాస జీవితం సాగిస్తున్న నషీద్ ఆ కోర్టు తీర్పు దృష్ట్యా తాను మాల్దీవులకు తిరిగి వచ్చి ఎన్నికలలో పాల్గొంటానని ప్రకటించారు. మాల్దీవులలో ఈ సంవత్సరం ద్వితీయార్ధంలో ఎన్నికలు జరగవచ్చునని భావిస్తున్నారు. పార్లమెంట్ నుంచి అనర్హులుగా ప్రకటించిన 12 మంది శాసనకర్తల పదవులను పునరుద్ధరించాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వు అమలు జరిగిన పక్షంలో పార్లమెంట్‌లో సమైక్య ప్రతిపక్షానికి మెజారిటీ లభించి, అధ్యక్షుని అభిశంసించేందుకు మార్గం సుగమం అవుతుంది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి ప్రభుత్వం ఇంత వరకు నిరాకరిస్తూ వచ్చింది. ప్రతిపక్ష నేతలపై కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఉపసంహరించాలని అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ కోరుతున్నారు.కోర్టు జారీ చేసిన రాజ్యాంగ విరుద్ధమైన ఉత్తర్వును తాము పాటించేది లేదన్న సైన్యంతో పాటు పోలీస్ దళం కూడా యమీన్‌కు అండగా నిలుస్తున్నట్లు కనిపిస్తోంది. కోర్టు ఉత్తర్వును అమలు జరపగలమని చెప్పిన పోలీస్ ఉన్నతాధికారి ఒకరిని అటార్జీ జనరల్ వెంటనే బర్తరఫ్ చేశారు. సైన్యం సోమవారం సుప్రీం కోర్టు ప్రాంగణం చుట్టూ పహరా ప్రారంభించింది. ఎవరిది పైచేయో న్యాయమూర్తులకు ఆ చర్య ఒక సంకేతం కావచ్చు. యమీన్ 2013లో అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తమ దేశంలోని బహుళ పక్ష ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా బలహీనపరచసాగారు. తన నాయకత్వానికి బలమైన, చట్టబద్ధమైన సవాళ్లు ఎదురుకాకుండా అధికారానికి అంటి పెట్టుకోవడమే లక్ష్యంగా ఆయన అందుకు పూనుకున్నారు. వాస్తవానికి మాల్దీవులలో బహుళ పక్ష ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొన్నది అప్పటికి ఐదు సంవత్సరాలకు ముందు మాత్రమే. పార్లమెంట్ స్పీకర్‌ను అభిశంసించేందుకు ప్రతిపక్షం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి యమీన్ క్రితం సంవత్సరం సైనిక బలగాలను ఉపయోగించుకున్నారు. అంతే కాదు. ఆయన తన రాజకీయ ప్రత్యర్థులను నిర్బంధించారు. నిరసనలను, భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకున్నారు.

మాల్దీవులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి అధ్యక్షుడు నషీద్‌ను 2012లో తన పదవికి రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చినప్పటి నుంచి దేశం ఏదో ఒక రాజకీయ సంక్షోభంతో సతమతం అవుతూనే ఉన్నది. మాల్దీవులలో చైనా ప్రభావం పెరుగుతుండడం కూడా అక్కడ రాజకీయ అనిశ్చితిని పెంచింది. మాల్దీవులు గత డిసెంబర్‌లో చైనాతో తొలి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఆ ఒప్పందాన్ని పార్లమెంట్‌లో ఆదరాబాదరా ఆమోదింపచేశారు. అంతే కాదు. మాల్దీవుల ప్రభుత్వం చైనా ప్రతిపాదిత మారిటైమ్ సిల్క్ రూట్ పథకానికి సహకరించేందుకు కూడా అంగీకరించింది. ఆ రెండు పరిణామాలు మన దేశంలో అమిత ఆందోళనకు కారణమయ్యాయి. ఎందుకంటే మాల్దీవులపై తమ ప్రభావం చెక్కుచెదరనిదని భారత ప్రభుత్వం భావిస్తోంది. మరొక వైపు మాల్దీవుల యువత తీవ్రవాద ప్రభావానికి లోనవుతున్నారనే వార్తలు కూడా కలవరం కలిగిస్తున్నాయి. సుమారు 200 మంది మాల్దీవుల యువకులు ఇస్లామిక్ స్టేట్‌తో కలసి పోరు సాగిస్తున్నారని తెలుస్తోంది. మాల్దీవులలో పాగా వేసిన పాకిస్తానీ లష్కర్ -తయ్యిబాకు వారు అనుబంధంగా కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. తమ దేశంలో జోక్యం చేసుకోవలసిందిగా మాల్దీవుల ప్రతిపక్షం చేస్తున్న అభ్యర్థనలకు భారత ప్రభుత్వం స్పందించవలసి రావచ్చు. అయితే, అలా చేసినప్పుడు తాము అక్కడ ఎవరి పక్షమో వహిస్తున్నట్లుగా కాకుండా ప్రభుత్వం ఆచి తూచి అడుగు వేయవలసి ఉంటుంది.

ఇది ఇలా ఉండగా, మాల్దీవులలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా భారత్ అడుగులు వేస్తున్న వేళ ఆ దేశం సంగతి మీకెందుకని ప్రశ్నించేందుకు చైనా తెగించడం గమనార్హం. మాలేలోకి భారత్ సైన్యాన్ని పంపించరాదని, వారి సంక్షోభంలో భారత్ కల్పించుకోరాదని చైనా కోరింది. ఇండియా కావాలనే మాల్దీవుల ప్రభుత్వంపై ఒత్తిడి పెడుతోందని, ఇది సరి కాదని కూడా చైనా వ్యాఖ్యానించింది.

కాగా, మాల్దీవులకు సైన్యాన్ని, దూతలను పంపించి పరిస్థితి సద్దుమణిగేలా చూడాలని ఆ దేశ ప్రతిపక్ష నేత పదే పదే కోరుతుండడంతోను, ప్రజల నిరసనలను అదుపు చేసేంత సైనిక బలం ఆ దేశంలో లేకపోవడంతోను భారత సైన్యం ఏ క్షణమైనా మాలేలో కాలు పెట్టేందుకు సిద్ధంగా ఉందన్న సంగతి తెలిసిందే. వాస్తవానికి భారత నావికా దళానికి సంబంధించిన రెండు యుద్ధ నౌకలు ఎల్లప్పుడూ పశ్చిమ సముద్ర తీరంలో గస్తీ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. అవసరమైతే వాటిని మాల్దీవులకు పంపుతామని నేవీ అధికారి ఒకరు తెలిపారు.

మరొక వైపు రక్షణ సహకారం కోసం మాల్దీవుల్లో భారత్‌కు రక్షణ దళం కూడా ఉంది. యుద్ధ నౌకలు, విమానాలు, హెలికాప్టర్లు తరచు పహరా కాస్తుంటాయని ఆయన చెప్పారు. మాల్దీవులకు గతంలోనూ భారత్ సాయం అందించింది. ఉదాహరణకు, 1988లో మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ ప్రభుత్వంపై అబ్దుల్లా లుతుఫీ నేతృత్వంలో కొందరు పన్నిన కుట్రను అణచివేసేందుకు అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 'ఆపరేషన్ కాక్టస్' కింద పారాట్రూపర్లు, నావికా దళ యుద్ధ నౌకలను మాల్దీవులకు హుటాహుటిని తరలించిన సంగతి విదితమే.

తాజాగా మాల్దీవులలో మరొక పరిణామం చోటు చేసుకుంది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ దెబ్బకు సుప్రీం కోర్టే వెనుకంజ వేయవలసి వచ్చింది. దేశంలో అత్యవసర పరిస్థితికి కారణమైన నిర్ణయాన్ని కోర్టు ఉపసంహరించింది. తొమ్మిది మంది రాజకీయ ఖైదీలను విడుదల చేయాలన్న నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లుగా కోర్టు మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ పరిణామంతోనైనా అక్కడ సంక్షోభం సద్దుమణిగితే అందరికీ మంచిది. భారత్ తన సైన్యాన్ని పంపే అవసరం కూడా తప్పుతుంది.

మళ్లీ తమిళ రాజకీయాలలో ఉత్కంఠ

సత్య ఎం.వి.ఎస్.ఎస్, హైదరాబాద్
8333011972

- రజనీ, కమల్‌ల పార్టీలపై నేటికీ రాని స్పష్టత
- సిఎం పదవి ఇస్తే పార్టీలో కలిసిపోతానన్న దినకరన్
- దినకరన్‌పై శశికళ కుటుంబ సభ్యుల గుస్సా
- రంగంలోకి దిగిన కృష్ణప్రియ.. 24న రాజకీయాల్లోకి
- అన్నిస్థానాలలో పోటీ చేసేందుకు సిద్ధమన్న భాస్కరన్



తమిళనాడు రాజకీయాలు ఏక్షణాన ఎలా మారుతాయో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు సైతం తలలు పట్టుకుంటు న్నారు. ఓ వైపు నటుడు రజనీ కాంత్ పార్టీని పెడు తున్నట్లు ప్రకటించి నెల కావస్తున్నా ఆ విషయంలో ఇప్పటికీ ఒక్క ముందడుగు కూడా పడలేదు. ఇక మరో నటుడు కమల్ హాసన్ పరిస్థితి కూడా ఇలా నే ఉంది. ఇక రాష్ట్రంలో మిగిలిన అన్నాడిఎంకె, డిఎంకెలు యథాప్రకారం ఎవరికి వారే తమ కత్తులను నూరుకుంటుంటే కాంగ్రెస్, బిజెపిలాంటి జాతీయ పార్టీలు ఎవరు కలిసివస్తే వారితో జతకట్టి రానున్న లోక్‌సభ ఎన్నికలలో సీట్లు పొంది గెలుపొందాలన్న ప్రయత్నాలను ప్రారంభిం చేసాయి.

అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు 18 మందిపై స్పీకర్ ధన్ పాల్ అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. అయితే అనర్హత వేటుపై ఎమ్మెల్యేలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం మాత్రం తీర్పు రిజర్వ్ లో ఉంచింది. అయితే ఈ తీర్పు పాతం వెలువడేలోగా బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ముఖ్య మంత్రి పళనిస్వామి నిర్ణయించుకున్నారు. అందుకోసమే తమిళనాడు అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 16వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరపాలని పళనిస్వామి నిర్ణయించి అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు కూడా అవిశ్వాసం పెడతారని.

మరోవైపు ఆర్కే నగర్ ఓటర్లు రెండాకులను కుక్కర్‌లో ఉడికించేసి,. ఉదయించే సూర్యుడిని ఈసారికి అస్తమించమని సాగనంపిన స్వతంత్ర అభ్యర్థి దినకరన్ వర్గం కూడా తీర్పు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. తమకు అనుకూలంగా వస్తే పళని సర్కార్ పై అవిశ్వాసం పెట్టాలన్నది వాళ్ల ఆలోచన. ఇందుకు డీఎంకే మద్దతు ఉంటుంది. అలాగయితే పళని ప్రభుత్వం కూలిపోయినట్లే. ఇప్పటికే 18 మంది ఎమ్మెల్యేలు తాము పళని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు లేఖలు ఇచ్చారు. ఇప్పుడు శాసనసభలో అన్నాడీఎంకే సభ్యుల సంఖ్య 114 మంది మాత్రమే. ప్రతిపక్షాల బలం 102. ఈ 18 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటుపై కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే ప్రతిపక్షాల బలం 120 కు చేరుకుంటుంది. అప్పుడు పళనిస్వామి ప్రభుత్వానికి కష్టాలు తప్పవు. తీర్పు వారికి అనుకూలంగా రాకపోతే మాత్రం పళని గట్టెక్కినట్లే. అయితే టీటీవీ దినకరన్ ఆర్కే నగర్‌లో గెలిచిన తర్వాత ఆయన చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు అన్నా డిఎంకె పార్టీలో సహ సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, మూడు నెలల్లో ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెప్పారు. దీంతో అసలు దినకరన్ వ్యూహం ఏంటి? ప్రభుత్వాన్ని పడగొట్టేలా ఆయన ఏం చేయబోతున్నారు? ఈ ప్రశ్నలకు జవాబులు వెతికే పనిలో ఉన్నారంతా.

నిజానికి తమిళనాడు రాజకీయాలు గత 40ఏళ్లుగా రెండు పార్టీల చుట్టూనే తిరిగేవి. గతంలో ఎంజీఆర్, కరుణానిధి తమిళనాడు రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన వ్యక్తులుగా ఎదిగారు. జయలలిత కూడా ఎంజీఆర్ అడుగుజాడల్లో నడిచి తమిళ రాజకీయాలను ఒకానొక దశలో శాసించే స్థాయికి ఎదిగారు. ఇప్పుడు ఇదే తరహాలో దినకరన్ కూడా ఎదిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అన్నాడీఎంకేలో నెలకొన్న వర్గ విభేదాలు కూడా దినకరన్ కీలకంగా ఎదిగేందుకు దోహదపడతాయని అభిప్రాయపడుతున్నారు. శశికళ కుటుంబంపై నెలకొన్న వ్యతిరేకత దినకరన్ విషయంలో కనిపించకపోవడం విశేషంగా రాజకీయ పరిశీలకులు కూడా చెప్తున్న వాస్తవం.

పన్నీరు సెల్వం, పళనిస్వామి మధ్య నెలకొన్న వర్గపోరు... అధికారం కోసం ఇరు వర్గాలు చేసిన ప్రయత్నాలు ప్రజల్లో ఆ పార్టీకి ఉన్న ప్రతిష్ఠను దిగజార్చాయి. అనంతరం పన్నీరు, పళని కలిసిపోయినప్పటికీ ప్రజల్లో ఇంకా ప్రభుత్వంపై అప నమ్మకం ఉందనడానికి ఆర్కే నగర్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఈ పరిణామాలు దినకరన్‌కు కలిసొస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అధికారంలో ఉన్నా తమకు సరైన గుర్తింపు దక్కడం లేదని భావించే ఎమ్మెల్యేలు దినకరన్ వైపు చూసే అవకాశముందని చెబుతున్నారు. అదేగానీ జరిగితే తమిళనాడులో మరోసారి ప్రభుత్వం అస్థిత్వాన్ని కోల్పోయే ప్రమాదముంది.

కాగా తమ వర్గానికి ముఖ్యమంత్రి పదవి అప్పగిస్తే, అన్నాడిఎంకెలో కలసిపోతానంటూ దినకరన్ చేసిన ప్రకటన సర్వత్రా చర్చనీయాంశమైంది. జయ అక్రమాస్తుల కేసులో శశికళ జైలుకెళ్లినప్పటికీ ఆమె కుటుంబ సభ్యులు కొందరు తెర వెనుక పావులు కదువుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న శశికళ వారిని రంగంలోకి దించాలని భావిస్తోంది. దినకరన్ గెలుపుతో శశికళ కుటుంబ పొలిటికల్ రీఎంట్రీకి తొలిమెట్టు పడింది. జయలలిత పేరుతో దినకరన్ పార్టీని స్థాపించే అవకాశాలు లేకపోలేదని కథనాలు వినిపించాయి. ఈ క్రమంలోనే ఆర్కేనగర్‌లో గెలువు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడాలనే ఆశ దినకరన్‌లో ఏర్పడింది. కొత్త పార్టీపై దినకరన్ తరచూ శశికళను కలుస్తున్నారు. అంతేగాక జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుంటున్నారు. అయితే శశికళ కుటుంబ సభ్యులు మాత్రం దినకరన్ పట్ల తీవ్రవ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని సమాచారం. జయ నేతృత్వంలోని పార్టీని తిరిగి సొంతం చేసుకోవటం ద్వారా పూర్వ వైభవాన్ని అందుకోగలమని భావిస్తున్న శశికళ కుటుంబం ఇక తమిళనాడు రాజకీయాల్లో తామంతా క్రియాశీలకంగా మారాలన్న వ్యూహం రచించినట్లు కనిపిస్తోంది. ఇందుకు అనుగుణంగానే దినకరన్ కారణంగా శశికళ కుటుంబాల రేగినచిచ్చు తొలగించుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే దినకరన్‌కు వ్యతిరేకంగా శశికళ అన్న కుమార్తె డాక్టర్ కృష్ణప్రియ(ఇళవరసి కుమార్తె) ఈనెల 24వ తేదీన జయలలిత జయంతి రోజున రాజకీయ ప్రవేశానికి ముహూర్తం పెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు శశికళ తమ్ముడు దివాకరన్, ఇళవరసి కుమారుడు వివేక్, కుమార్తె కృష్ణప్రియల అడుగు జాడలోనే దినకరన్ సోదరుడు భాస్కరన్ సైతం రాజకీయ ప్రవేశంపై ఖాయంగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెపుతున్నాయి. ఇటీవల దివాకరన్ తిరువళ్లూరు జిల్లా అన్నాడీఎంకే క్యాడర్‌తో ప్రత్యేక సమావేశమై, పార్టీ పునర్వైభవం గురించి చర్చించడం గమనార్హం. ఒకప్పుడు దివాకన్‌కి అనుచరులుగా ఉన్న వారిలో చాలా మంది ఇప్పుడు దినకరన్ వెంట నడుస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో వీరందరినీ తనవైవు తిప్పుకోవాలని దివాకరన్ ప్రయత్నాలు చేస్తున్నారనిపిస్తోందని, సమాచారం అలాగే దినకరన్ సొంత సోదరుడు భాస్కరన్ సైతం రానున్న ఎన్నికలలో పోటీకి సిద్ధమవుతున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 234 స్థానాల్లో పోటీచేస్తామని దినకరన్ సోదరుడు భాస్కరన్ ఇటీవల ప్రకటించారు. భాస్కరన్ చేసిన ప్రకటన దినకరన్ అనుచరుల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. దినకరన్ సోదరుడే రాజకీయాల్లోకి దిగితే ఎవరివైవు నిలవాలనే ఆలోచనలో పడ్డారు.

అయితే దినకరన్ వ్యూహాలు గమనించిన ముఖ్యమంత్రి పళనిస్వామి బడ్జెట్ సమావేశాలను కేవలం ఐదు రోజులకే పరిమితం చేయటంతో పాటు ఎమ్మెల్యే జీతాలను 55 వేల నుంచి లక్షా ఐదు వేలకు పెంచారు. నియోజకవర్గ నిధులను రెండు కోట్ల నుంచి రెండున్నర కోట్లకు పెంచారు. ఇలా ఎమ్మెల్యేలను మంచి చేసుకోవాలన్నది పళనిప్లాన్ కొంత మేర ఫలించినట్టు కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు శాసనసభ్యులు తనతో రాకున్నా, లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీలో కలవటమో? చీల్చడమో చేయాలన్నది దినకరన్ వ్యూహంగా కనిపిస్తోందన్న ఆందోళన వినిపిస్తోంది. పళని, పన్నీరు వర్గాల్లో మరిన్ని చీలికలను తెచ్చి వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని డీఎంకే వ్యూహాలు రచిస్తోంది. ఇలాంటి సమయంలో దినకరన్ గెలువు డీఎంకే వ్యూహాన్ని అమలు చేసేందుకు మార్గాన్ని సుగమం చేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని దినకరన్ వర్గంతో డీఎంకే పొత్తు పెట్టుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. మరేం జరగనుందో చూడాలి.

చరిత్రలో ఈరోజు

ఫిబ్రవరి 8

జననాలు

1897: జాకీర్ హుస్సేన్, పూర్వ రాష్ట్రపతి.

1902: ఆండ్ర శేషగిరిరావు, సుప్రసిద్ధ కవి, నాటకకర్త

1934: పొత్తూరి వెంకటేశ్వర రావు, పత్రికారంగ ప్రముఖుడు.

1941: జగ్జీత్ సింగ్, ప్రఖ్యాతిగాంచిన భారతీయ గజల్ గాయకుడు.

1963: ముహమ్మద్ అజహరుద్దీన్, భారతీయ క్రికెట్ మాజీ కాప్టన్.

మరణాలు

1971: కె.ఎం.మున్షీ, నిజాము సంస్థానంలో ప్రభుత్వ ప్రతినిధి

1995: మంచికంటి రాంకిషన్ రావు, వీరతెలంగాణా విప్లవ పోరాట యోధుడు.

ఆండ్ర శేషగిరి రావు


ఆండ్ర శేషగిరిరావు (ఫిబ్రవరి 8, 1902– 1979) సుప్రసిద్ధ కవి, నాటకకర్త మరియు పత్రికా సంపాదకులు. వీరు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంతాలూకా కొడమంచిలి గ్రామంలో 1902 సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన జన్మించారు. నరసాపురం టైలర్ ఉన్నత పాఠశాలలో చదివారు. వీరు సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించారు. వీరు పాలకొల్లు హైస్కూలులో తెలుగు పండితులుగా 34 సంవత్సరాలు పనిచేశారు. హిందూ యువజన సంఘం స్థాపించి ఏడాదికి ఆరు నాటకాలు ప్రదర్శించేవారు. వీరు కొంతకాలంఆనందవాణి వారపత్రికకు అసోసియేట్ ఎడిటర్‌గా ఉన్నారు. ఆంధ్రభూమి మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. సాహితీ తపస్విగా ప్రసిద్ధులైన వీరు 1979 ప్రాంతంలో పరమపదించారు.

మంచికంటి రాంకిషన్ రావు



మంచికంటి రాంకిషన్ రావు (అక్టోబరు 11, 1917 – ఫిబ్రవరి 8, 1995) తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు (రైతుసంఘం) నాయకులు, మాజీ శాసనసభ్యులు. రాంకిషన్ రావు కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, పెనుగంచిప్రోలులో జన్మించారు. హైదరాబాదులో ల్యాండ్ రెవెన్యూ కార్యాలయంలో చిన్న ఉద్యోగంలో చేరారు. 1952లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, 1964 నుంచి సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, 1972 నుండి రాష్ట్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 1971 నుండి 78 వరకూ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1980లో అదే జిల్లాకు సిఐటియు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1982, 1985లో ఖమ్మం శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

జాకీర్ హుస్సేన్



జాకిర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969), భారత 3వ రాష్ట్రపతి (మే 13 1967 నుండి 1969 మే 3 న మరణించినంతవరకు) హుసేన్ హైదరాబాదు (భారతదేశం)లో జన్మించాడు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందినవాడు. ఇతడు హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్‌కు వలస వచ్చాడు. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్)లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల'లో చదువుకున్నాడు, ఉన్నతవిద్య అలీఘర్‌లోని ఆంగ్లో మహమ్మదన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించాడు. ఇచట విద్యార్థిసంఘ నాయకుడిగా గుర్తింపబడ్డాడు. హుసేన్ 23 సంవత్సరాల వయస్సులో ఢిల్లీ దగ్గర, ఒక జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, దానికి జామియా మిల్లియా ఇస్లామియా అనే పేరు పెట్టాడు. తరువాత ఇతను విత్త శాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వవిద్యాలయానికి (జర్మనీ) వెళ్ళాడు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవిత గాథ, కవితాసంగ్రహాలను క్రోడీకరించాడు. బ్రిటిష్‌వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులుకలిపి, బేసిక్ విద్యపై కఠోరపరిశ్రమ చేశాడు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించాడు.

విజన్ 2022

–డా.డి.వి.జి.శంకరరావు,
మాజీఎంపీ, పార్వతీపురం.

సంవత్సరం: 2022

ప్రాంతం: అమెరికాలో కేంటుకి రాష్ట్రం.

పాత్రలు: ఓ అమెరికన్ కుటుంబం.

డాడీ. మంచి మార్కులొస్తే నాకు బీఎఫ్ సీ ట్రీట్ ఇస్తానన్నారు. మరిచిపోయారా

నో. కిడ్.అంత డబ్బు లేదు ప్రస్తుతం నావద్ద. అందాకా కే ఎఫ్ సీ ఇవ్వనా!

నో డాడ్. గ్రేట్ డిప్రెషన్ టైంలో కల్నల్ సాండర్స్ తాతయ్య ఇక్కడే మొదలెట్టిన ఆ ఫుడ్ చైన్ ఇప్పుడు తానే డిప్రెషన్‌లోకి పోయింది. ఇప్పుడంతా బీ ఎఫ్ సీ నడుస్తోంది. అఫ్ కోర్స్. వెరీ కాస్టీ.

ఐ నో కిడ్. ది ఇండియన్ బీ ఎఫ్ సీ. ఐ మీన్ భారత్ ఫ్రెష్ పకోడీ చైన్ మొత్తం గ్లోబ్ అంతా లాగేసుకొంది. డామిట్. నో స్పేస్ ఫర్ అదర్ స్నాక్ ఫ్రాంఛైస్.

ఆ ఇండియన్స్ వాళ్ళ ప్రొడక్ట్ అక్కడే అమ్ముకోవచ్చు కదా డాడ్. మనకి అల వాటు చేసి మన మార్కెట్ ఎందుకు కొట్టేయడం?

యూ నో.అక్కడ ప్రధాని పిలువు మేరకు అందరూ అక్కడ తయారు చేయడం మొదలు పెట్టారట. ఇక కొనేవాళ్ళు లేక ఇబ్బంది వచ్చిందట. ఇక లాభం లేదని ఎక్స్ పోర్ట్ వ్యూహం అమ లుచేసారట.అక్కడ జీడీపీలో సగం జీడి పప్పు పకోడీ సంపాదిస్తుంది తెలుసా!

అక్కడ అంత తక్కువ జీడీపీ యా!

యూ. సిల్లీ. చైనా కన్నా ఎక్కువ. ఇన్ ఫాక్ట్. చైనా బెదిరిపోయి పకోడీకి పోటీగా ఫేక్–కోడి అని డూప్లికేట్ దించితే ,పాకిస్తాన్ పాక్–కోడి అని మరోటి మార్కెట్లోకి దించింది. అవేవీ పకోడీలో ఉల్లిరెక్కను కూడా పీకలేక పోయాయి.

మీ నోరూరించే కబుర్లు తర్వాత. ట్రీట్ ఎప్పుడో చెప్పండి

మిట్టమధ్యాహ్నం ఏమిటా నిద్ర. లేవండి.అన్న ఆవిడ పిలువుతో మత్తు వదిలింది. షా, మోడీ జోడీ వేడివేడి పకోడీపై చేస్తున్న వాడివాడి చర్చలు విని కునుకేస్తే ఈ పగటి కల వచ్చిందన్నమాట.అదేమాట చెప్పాను.

బాగా గుర్తు చేశారు. ఓ ప్లేట్ పకోడీ చెయ్యండి. తినాలనిపిస్తుంది.

నేను కదలకపోయే సరికి మళ్లీ గదమాయించింది, షా, కాంగ్రెస్ వాళ్ళని గదమాయించి నట్టు.

పకోడీ చెయ్యడం నామోషీ కాదు. మీరు కథలు రాయడం కన్నా గొప్ప పని. మీరు కథలు రాసి పేపరేస్తే, వాటి కన్నా ఆ పేపరుపొట్లం లోని పకోడీలే బాగుంటాయి తెలుసా!

నామోషీ ఏమిటి? దానికీ,దీనికీ పోలికే మిటి?దేనికదే గొప్ప. ఇలా కంపేర్ చెయ్యడం బాగులేదు.. నువ్వయినా, ఈ దేశ ప్రధాని అయినా.

సణుగుతూ కిచెన్ వైపు నడిచాను.

ఇదుగో, ఉల్లిపాయల ధరలు పెరిగాయి. వాడకండి. గ్యాసు, ఆయిల్ ధరలు కూడా.. అట్టే వేస్ట్ చేయకండి

సాయం లేకపోయినా, దేశంలో ఉపదేశాలకు లెక్క లేదు.

–శుభం –

బడ్జెట్ లాభం రైతుకు దక్కేనా?

తాతా శ్యాం కుమార్, మణికొండ
రాజేంద్రనగర్. హైదరాబాద్

ఇటీవల కొంత కాలంగా రైతులకు ఆర్థిక సహాయం గురించి అధికార పార్టీలలో హంగామా కనిపిస్తోంది. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి కాపాడేందుకంటూ భారీ ఎత్తున బడ్జెట్ కేటాయించినట్లు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఇవన్నీ రైతుని ఉరితాడు బారిన పడకుండా రైతును కాపాడే చర్యలేనా లేక జీవగంజి పోసే వ్యవహారమా అన్నది తేల్చుకోవాల్సిన సమయమిది అనిపిస్తోంది. నిజంగా కష్టాల్లో ఉన్నవాడికి రూపాయి ఇచ్చినా సంతోషమే! అందువల్ల ఎకరానికి ఎంత అందించినా వాళ్లకి కొంత తోడ్పటు అందించినట్టే. అది రుణమాఫీ పేరు అయినా, ఆర్థిక సహాయం అని పేరుపెట్టినా సరే. అయితే ఇలాంటి చర్యలే రైతాంగ సమస్యలకు పరిష్కారం కాదన్న విషయాన్ని పాలకులకు తెలిసినా, అధికారంలోకి వచ్చిన పార్టీలు ఇది సరికాదన్న నేతలను రైతు వ్యతిరేకులుగా బూతద్దంలో పెట్టి మరీ చూపించే పనిలో పడుతున్నారు. దీంతో విపక్షాలు మౌనాన్ని ఆశ్రయించడమో? సహాయం అందని వ్యవహారంపై టివి చర్చలలో మాట్లాడటంతో సరిపుచ్చుతున్నారు. నిజమైన రైతులకు సహాయం అందే అస్కారం ఉందని అంతా అనుకున్నప్పటికీ ఈ నామమాత్రవు సహాయాలకు కూడా కౌలు రైతులు నోచుకోలేదన్నది వాస్తవం. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కౌలురైతులను పొమ్మనకుండా పొగబెట్టారు. రాష్ట్రం విడిపోయాక కూడా ఇరు తెలుగు రాష్ట్రాలలో కౌలు రైతుల బాధ్యత తమది కాదన్న తీరుగా వ్యవహరిస్తున్నాయి ప్రభుత్వాలు. దీంతో భూమి స్వంతదారులైన పేద, మధ్యతరగతి రైతులకు అందే ప్రయోజనం కూడా పరిమితమే. 14శాతం ఉన్న ధనిక రైతుల చేతుల్లో 68లక్షల ఎకరాల భూమి ఉండగా, 86శాతం రైతుల చేతుల్లో 84లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉన్నది. అంటే ఆర్థిక సాయం పేరుతో ప్రభుత్వం ఖర్చు చేసే వేల కోట్లలో దాదావు సగం, కొద్దిమంది ధనికులకే. ఎకరం ఎనిమిది వేలు ఇస్తే సాధారణ రైతులు మహా అయితే పదిహేను వేలు దక్కుతుంటే వంద ఎకరాల భూస్వామికి ఎనిమిది లక్షలు దక్కించుకుంటు న్నారు. మరి బాధిత రైతులను ఆదుకోవటం పేరుత తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి. అది నాడు కాంగ్రెసూ, టీడీపీలైనా నేడు టీఆర్ఎస్ అయినా సరే. గతంలో టీడీపీ పాలనలో రైతుమిత్ర పేరుతో కార్యకర్తలకు అజమాయిషీలు అప్పగిస్తే కాంగ్రెసు ఆదర్శరైతు అంటూ రంగంలోకి దించింది. ఇప్పుడు టీఆర్ఎస్ పాలన లో రైతు సమన్వయ సమితులు వచ్చేసాయి. ఏది ఏమైనా ఓట్ల వేట అన్ని పార్టీల లక్ష్యం. రైతుకు కావల్సింది రుణసదుపాయం విషయంపైన కానీపంటకు గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయమైన సూచనలు, కరువు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఆదుకోవటంపై ఏనాడూ మాట్లాడని పాలకులు కేవలం రుణమాఫీ లేదా ఆర్థిక సహాయం చుట్టూ తమ రాజకీయాలను తిప్పుతుంటారు. లక్షల కోట్లు ఎగవేసిన బడా కార్పొరేట్ సంస్థలకే మళ్లీ మళ్లీ మాఫీలూ...మరిన్ని రుణాలు అందజేస్తున్న ప్రభుత్వాలు రైతులకు మాత్రం రుణా లను పూర్తి మాఫీ సాధ్యం కాదంటున్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులకు బలిపెడుతున్నారు. ఉత్పత్తిఖర్చుకు 50శాతం అదనంగా కలిపి ధాన్యం ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ సిఫారుసు చేసిందని తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పిన ప్రధాని మోడీ, గత మూడు న్నర ఏండ్ల వారిని ఆదుకున్నది లేదు.

అయితే తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు వరాల జల్లు కురిపించడం కేవలం ఓట్ల గురించే అన్నది వాస్తవం. ఈ నిధులు ఎంతమేరకు ఖర్చు జరుగుతుందన్నది చెప్పలేని పరిస్థితి. ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలలో పండుతున్న పంటలకు ఖద్దతు ధరలు వస్తాయన్న గ్యారంటీ ఏ ప్రభుత్వం ఇవ్వలేక పోతున్నాయి. పంటల మార్పిడి ద్వారా సుదీర్ఘలాభాలు పొందుతారని, మార్చాలనీ రాష్ట్ర పాలకుల సూచనలను నమ్మిన రైతులు పంటలు మార్చారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి పత్తికి మాత్రమే ధర పలికింది. మిర్చి రైతు చేతికి మాత్రం సంకెళ్ళు పడ్డాయి. ఈ సీజన్‌లో పత్తి రైతుకు దిక్కులేదు. వ్యాపారులు, సీసీఐ అధికారులు చేతులు కలిపేయటంతో మార్కెట్ శక్తుల చేతుల్లో రైతు విలవిల్లాడుతున్నాడు. వరి వద్ద నీ, వాణిజ్యపంటలే ముద్దు అనీ... రైతును ఆ వైపు నెట్టింది పాలకులే. ఇప్పుడు ఎకరానికి నలభైవేలు పెట్టుబడి పెడితే కానీ పంట చేతికి రాని దుస్థితి. పొర పాటున ఏమాత్రం నష్టం వచ్చినా, అప్పు సౌకర్యానికీ, గిట్టుబాటు ధరకూ తమ కు సంబంధం లేదని కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారూ, రాష్ట్రాలలో టీఆర్ఎస్, తెలుగుదేశం పాలకులంతా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. దీంతో మోసపో తున్నది మాత్రం రైతులే.

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా సాధారణ రైతులకు అందే పరిమిత రుణ సదుపాయానికి ఆంక్ష లు పెరిగాయి. విత్తనచట్టం చేయవల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వాటి ఊసు ఎత్తవు. ఈ చట్టం తామే చేస్తామని చెప్పిన కేంద్రం ఇంకా మాటలలోనే కాలం గడుపుతు, ఆచరణలో పేద, మధ్య తరగతి రైతులను వ్యవసాయరంగం నుండి బయటకు తోసి, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించటమే లక్ష్యంగా పెట్టుకోవటం కనిపిస్తోంది. రైతు కష్టాలు మాత్రం ఎవరికీ పట్టలేదు. అయితే... ఈ పార్టీలూ, పాలకులూ ఒక విష యం గుర్తుంచుకోవాలి. అందరినీ, అన్ని సందర్భాలలోనూ మోసం చేయటంలో సఫలం కాలేరు. రేపటి ఎన్నికల కోసం వచ్చిన బడ్జెట్ నిర్దిష్టంగా అమలు చేయకుంటే బిజెపి సర్కారు తన పతనం కొనితెచ్చుకున్నట్టే

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా:
Editor, Surya, Surya Soudha, Plot.No.185,
MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d



మాల్యా అప్పుల వివరాలు ఆర్థిక శాఖ వద్ద లేవట

న్యూఢిల్లీ: బ్యాంకులకు వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా అప్పులపై ఆర్థికమంత్రిత్వ శాఖ బిత్తరపోయే సమాధానమిచ్చింది. మాల్యా అప్పులకు సంబంధించి ఎలాంటి రికార్డులు తమ దగ్గర లేవని కేంద్ర సమాచార కమిషన్‌కి కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. మాల్యా అప్పులకు సంబంధించి వివరాలు కావాలంటూ రాజీవ్ కుమార్ ఖరే అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా ఆర్థికశాఖకు దరఖాస్తు చేశారు. అయితే ఆ వివరాలపై ఆర్థికమంత్రిత్వ శాఖ నుంచి సరియైన స్పందన రాలేదు. అంతేకాక తాము ఆ రికార్డులను ఇవ్వలేమని, వ్యక్తిగత భద్రత, దేశ ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం చూపే వివరాలు ఇవ్వకుండా ఆర్‌టీఐ చట్టంలో కొన్ని మినహాయింపులు ఉన్నాయంటూ ఆర్థిక శాఖ తెలిపింది. కానీ అంతకముందు ఇదే విషయంపై పార్లమెంట్‌లో ఆర్థికమంత్రిత్వ శాఖ సమాధానం కూడా ఇచ్చింది. ఆర్థిక శాఖ వైఖరితో షాక్ అయిన రాజీవ్, సమాచార హక్కు కమిషన్‌ను ఆశ్రయించారు. ఆ కమిషన్, ఆర్థికశాఖను వివరాల కోరింది. మళ్లీ అదే సమాధానాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెప్పింది. మాల్యా అప్పులకు సంబంధించిన రికార్డులేవీ తమ దగ్గర లేవని, దరఖాస్తుదారుడు కోరుతున్న సమాచారం ఆయా బ్యాంకులు లేదా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర ఉండొచ్చని చెప్పింది. ఆర్థికశాఖ సమాధానంపై సమాచార హక్కు కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్టప్రకారం ఇది అస్పష్టమైన, అస్థిరమైన జవాబు అంటూ నిరసన వ్యక్తం చేసింది.




6-2-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	34,630.72
గరిష్ఠం	34,850.21
కనిష్ఠం	36,621.67
ముగింపు	**34,082.71**
మార్పు (పా)	-113.23
మార్పు (శా)	-0.31

నిఫ్టీ	
ఆరంభం	10,607.20
గరిష్ఠం	10,507.25
కనిష్ఠం	10,447.45
ముగింపు	**10,476.70**
మార్పు (పా)	-21.55
మార్పు (శా)	-0.21

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,918.68	-29.62	-0.27
S&P BSE SENSEX Next 50	34,035.63	+160.65	+0.47
S&P BSE 100	10,838.00	-16.75	-0.15
S&P BSE Bharat 22 Index	3,699.90	+16.40	+0.45

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
CENTURYPLY	338.45	+44.75	+15.24
CHAMBLFERT	157.85	+16.65	+11.79
RAIN	362.20	+31.60	+9.56
LTI	1294.40	+109.45	+9.24
BAJAJELEC	487.10	+40.30	+9.02

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
NATCOPHARM	831.45	-72.85	-8.06
VAKRANGEE	202.50	-10.65	-5.00
REDINGTON	139.70	-6.55	-4.48
AMBUJACEM	245.40	-9.60	-3.76
ECLERX	1326.45	-51.70	-3.75

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
SHANKARA	1711.15	77.13	459891
VEDL	315.35	76.49	2407816
TATAMOTORS	377.50	72.28	1890021
SPICEJET	134.50	62.38	4593464
PCJEWELLER	380.20	61.83	1571431

రూపాయి మారకపు విలువ


కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	64.0295	యూరో	79.7295
యన్	58.2200	పౌండ్	90.4033

కొంచెమే తేడా వస్తే నోటీసులు పంపబోము

ఆదాయపు పన్ను చెల్లింపుల్లో చిన్నపాటి తేడాలకు నోటీసులు వద్దని ఐటీ శాఖ నిర్ణయం

- చెల్లింపుల్లో స్వల్ప తేడాలకు నోటీసులు ఇవ్వబోము
- ఈ ఏడాది ఏప్రిల్ నుండే ఈ విధానం అమల్లోకి
- ఎనిమిది కోట్లకు పెరిగిన పన్ను చెల్లింపుదారుల సంఖ్య
- వారానికి 15-25 లక్షల పాన్ కార్డు దరఖాస్తులు
- పరిశీలించి జారీ చేసేందుకు రెండు వారాల సమయం
- జనవరి 28 నాటికి పెండింగ్‌లో 20.7 లక్షల దరఖాస్తులు

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల కేంద్రీయ బోర్డు (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్-సీబీడీటీ) పన్ను చెల్లింపుదారులకు ఓ శుభవార్త వినిపించింది. ఆదాయపు పన్ను చెల్లింపుల్లో చిన్నపాటి మొత్తంలో తేడాలకు నోటీసులు జారీ చేయరాదని బోర్డు విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు నివేదించామని బోర్డు ఛైర్మన్ సుశీల్ చంద్ర తెలిపారు. 2018-19 అసెస్‌మెంట్ ఏడాదికి గాను ఏప్రిల్ 1 నుండే దీన్ని అమల్లోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉన్నా, ఎగవేసినట్లు అనుమానాలున్నా మరింత జాగ్రత్తగా పరిశీలిస్తామని ఆయన అన్నారు. చెల్లించే ఆదాయపు పన్ను, టాక్స్ క్రెడిట్ స్టేట్‌మెంట్‌గా వ్యవహరించే ఫారం-26 ఏఎస్, ఉద్యోగులకు సంస్థ జారీ చేసే ఫారం-16లో వ్యత్యాసాల ఆధారంగా బెంగళూరులోని సీపీసీ ద్వారా ఐటీ శాఖ నోటీసులు జారీ చేస్తోంది. మరోవైపు పన్ను చెల్లింపుదారుల జాబితా లోకి మరింత మందిని తీసుకురావడం ద్వారా మొత్తం పన్ను చెల్లింపుదారుల సంఖ్య 8 కోట్లకు చేరుకుందని



సుశీల్ చంద్ర చెప్పారు. ప్రత్యక్ష పన్నుల సంస్కరణలను ప్రభుత్వం మరింత కఠినతరం చేసిందని, వాటన్నింటినీ తాము సంఘటితం చేసి అమలు చేస్తున్నా మని ఆయన అన్నారు

కాగా, పాన్ కార్డు కోసం వస్తున్న దరఖాస్తులకు సంబంధించి ఆదాయపన్ను శాఖ ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించింది. శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కోసం వారానికి 15-25 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నట్టు పేర్కొంది. వీటిని పరిశీలించి పాన్‌కార్డులను జారీ చేసేందుకు కొన్ని గంటల నుంచి రెండు వారాల వరకు పడుతోందని వివరించింది.

ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి 20.7 లక్షల అప్లికేషన్లు ప్రాసెసింగ్ దశలో ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పాన్ దరఖాస్తులను ఐటీ విభాగం ఎన్ఎస్‌డీఎల్ ఈ-జీవోవీ, యూటీ ఐటీటీఎస్ఎల్ ద్వారా స్వీకరించి, ప్రాసెస్ చేసి డేటాను డిజిటలైజ్ చేస్తుంది. అనంతరం ఆ వివరాలను ఐటీడీకి పంపుతుంది. అక్కడ చివరిసారి పరిశీలించి దరఖాస్తుదారుడికి పాన్‌కార్డును జారీ చేస్తారు.

వాహనదారులకు నిరాశ

పెట్రోలు, డీజెల్ ధరలు తగ్గే అవకాశం లేనట్టే

- పెట్రో ధరలపై రూ.2 సుంకం తగ్గింపు ఆలోచన నుంచి వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- ద్రవ్యలోటు ఎక్కువగా ఉండే అవకాశాలుండడంతోనే నిర్ణయం
- పెట్రో ధరల్లో 50 శాతం పన్నులే

న్యూఢిల్లీ: పెట్రోలు, డీజెల్ ధరలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. ఇటీవలి బడ్జెట్‌లో పెట్రోలు, డీజిల్‌పై రూ.2 చొప్పున దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే



ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించేలా లేకపోవడంతో ఈ విషయాన్ని పక్కనపెట్టినట్టు తెలుస్తోంది. అంచనా వేస్తున్న దానికంటే ద్రవ్యలోటు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండడంతో ఇప్పుడు దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. అందుకనే ఈ ఆలోచన నుంచి ప్రభుత్వం ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది.

ఈ మేరకు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఇక, దక్షిణాసియాలోని ఇతర దేశాలతో పోలిస్తే పెట్రో ధరలు భారత్‌లోనే అధికం. పెట్రోలు రిటైల్ ధరల్లో 50 శాతం పన్నులే ఉండడంతో ఇరుగు పొరుగు దేశాల కంటే కూడా భారత్‌లో పెట్రో ధరలు అధికంగా ఉంటున్నాయి.

అశోక్ గజపతిరాజు శాఖపై మోడీ ప్రశంస



న్యూఢిల్లీ: టీడీపీకి చెందిన అశోక్ గజపతిరాజు నిర్వహిస్తున్న పౌరవిమానయాన శాఖపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. లోక్ సభలో ఆయన ప్రసంగిస్తూ అద్భుతమైన విమానయాన విధానాన్ని తాము తీసుకొచ్చామని తెలిపారు. చిన్నచిన్న పట్టణాలకు కూడా విమానాశ్రయాలను తీసుకొచ్చామని చెప్పారు. యావత్ దేశానికి రెక్కలు తొడిగామని తెలిపారు. ఆధార్ కార్డ్ ను కాంగ్రెస్ పార్టీ రాజకీయ అస్త్రంగా వాడుకోవాలని భావిస్తే... అదే ఆధార్ కార్డును తాము సగటు మనిషికి ఆధారంగా తీర్చి దిద్దామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విఫలమైన ప్రతి చోటా, తాము విజయవంతమయ్యామని తెలిపారు. బీజేపీ వస్తే ఆధార్ ను ఆపేస్తుందనే ప్రచారం చేశారని... తాము అదే ఆధార్ కు టెక్నాలజీని జోడించి వివిధ స్థాయుల్లో వినియోగిస్తున్నామని చెప్పారు. అసలైన లబ్ధిదారులను ఆధార్ ద్వారా ఎంపిక చేస్తున్నామని తెలిపారు.

మీట్ అండ్ గ్రీట్‌లో అమితాబ్



హైదరాబాద్: ఎన్ఆర్ గ్రూప్ అగర్‌బత్తి బ్రాండ్ సైకిల్ ప్యూర్, తన కస్టమర్ల కోసం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో అమితాబ్ పాల్గొని తన అభిమానులను పలకరించారు. ఎన్ఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన ముంబైలో జరిగిన 'మీట్ ది లెజెండ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి అక్టోబర్ వరకూ జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రొడక్టులు విక్రయించిన 50 వేల మందికి పైగా రిటైలర్ల నుంచి 550 మంది విజేతలను ఎంపిక చేసి వారిని అమితాబ్‌తో భేటీ అయ్యేలా సంస్థ ఏర్పాటు చేసింది. తమ ట్రేడ్ పార్టనర్ల కోసం సైకిల్ ప్యూర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

మారని పరపతి విధానం

- వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచిన రిజర్వ్ బ్యాంక్
- ద్రవ్యలోటు లక్ష్యాన్ని కేంద్రం పెంచినందునే
- వెల్లడించిన ఉర్జిత్ పటేల్
- రెపో రేటు 6 శాతం
- రివర్స్‌రెపో 5.75 శాతమే



న్యూఢిల్లీ: అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆర్బీఐ పాలసీ సమీక్షలో ఎటువంటి సానుకూల నిర్ణయం లేదు. కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 6%, రివర్స్ రెపో రేటు 5.75%గా ఉంచారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ద్రవ్యోల్బణం పెరగడం, ద్రవ్య లోటు లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో కేంద్ర బ్యాంకు రేట్ల మార్పుకు సిద్ధపడలేదు. ప్రస్తుతం రెపో రేటు 6.0శాతంగా ఉంది. రివర్స్ రెపో రేటు 5.75 శాతంగా ఉంది మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు 6.25% బ్యాంకర్లు, విశ్లేషకుల అంచనా వేసినట్లుగానే ఆర్బీఐ కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. మంగళవారం మొదలైన రెండు రోజుల ద్రవ్య పరపతి విధాన కమిటీ(ఎంపీసీ) సమావేశం ఈ రోజు ముగిసింది. ఈసారి వడ్డీ రేట్లను పెంచనూలేదు, తగ్గించలేదు. అయితే గత సమీక్ష జరిగిన డిసెంబరులోనూ ఎంపీసీ రేట్ల కోతకు మొగ్గుచూపలేదు.

2017 ద్వితీయార్థంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక కార్యకలాపాలు బాగా పెరిగాయి. భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుందని భావిస్తున్నారు.

ప్యాజియో నుంచి అప్రిల్లా ఎస్ఆర్ 125



హైదరాబాద్: భారత మార్కెట్లో అప్రిల్లా ఎస్ఆర్ 125 పేరిట కొత్త వాహనాన్ని విడుదల చేసింది. స్మార్ట్ మొబైల్ కనెక్టివిటీ ఈ స్కూటర్ ప్రత్యేకతని తెలిపింది. ద్విచక్ర వాహన విభాగంలో వైవిధ్యమైన ఉత్పత్తులను అందించాలన్న లక్ష్యంలో భాగంగా దీన్ని తయారు చేశామని సంస్థ ఎండీ డిగో గ్రాఫీ వెల్లడించారు. వినియోగదారులు కోరుతున్న ఫీచర్లను అందిస్తూ ఈ స్కూటర్‌ను విడుదల చేశామన్నారు.

ఆరంభం లాభాల్లో - చివరికి నష్టాలు

- వరుసగా ఏడో రోజు కూడా
- నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- 113 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 22 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ


ముంబై: భారతీయ స్టాక్ మార్కెట్ల పతనం వరుసగా ఏడో రోజు కూడా కొనసాగింది. అమెరికా మార్కెట్లు కొంత కోలుకున్న నేపథ్యంలో, మన దేశీయ సూచీలు కూడా ఉదయం లాభాలతోనే ప్రారంభమయ్యాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 300 పాయింట్లు పెరిగింది. అయితే ఆ జోరు ఆ తర్వాత కొనసాగలేకపోయింది. ఆర్బీఐ పాలసీ రివ్యూ ఉండటంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. చివరకు మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. 113 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ 34,083 పాయింట్ల వద్ద క్లోజ్ అయింది. 22 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ 10,477 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్‌గా సెంచరీ ప్లైబోర్డ్స్ (15.24%), చంబల్ ఫర్టిలైజర్స్ (11.79%), రెయిన్ ఇండస్ట్రీస్ (9.56%), ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ (9.24%), బజాజ్ ఎలక్ట్రికల్స్ (9.02%) తదితర కంపెనీలుండగా, నాట్కో ఫార్మా (-8.06%), వక్రాంగీ లిమిటెడ్ (-5.00%), రెడింగ్టన్ ఇండియా లిమిటెడ్ (-4.48%), యునైటెడ్ బ్రూవరీస్ (-4.17%), బేయర్ క్రాప్ సైన్స్ లిమిటెడ్ (-3.86%) తదితర కంపెనీలు నష్టపోయాయి.

కస్టమర్లకు మరిన్ని ప్రయోజనాలు: ఆడి



ముంబై: లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ, ఈ ఫిబ్రవరిలో తమ కస్టమర్ల కోసం ప్రత్యేక ప్రయోజనాలను దగ్గర చేస్తూ సేల్స్ అండ్ సర్వీస్ విభాగాల్లో మరింత సహకారాన్ని అందించనున్నామని ప్రకటించింది. ఆడీలో ఉన్న సర్వీస్ ప్లాన్ల ధరలను తగ్గిస్తున్నామని, ఆకర్షణీయమైన ఆర్థిక సదుపాయాలు, బీమా ప్యాకేజీలను అందిస్తామని సంస్థ భారత హెడ్ రాహిల్ అన్సారీ వెల్లడించారు. పరిమితకాల ఆఫర్‌లో భాగంగా ఈ సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. కార్ల పరిశీలన, విడిభాగాల్లో రాయితీలు వంటి సదుపాయాలు దగ్గర చేస్తామని తెలిపారు.

ఆటో ఎక్స్‌పోలో హోండా కొత్త కార్లు



హైదరాబాద్: ఇండియాలో జరుగుతున్న వాహన ప్రదర్శనలో హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ పలు కొత్త కార్లను ఆవిష్కరించింది. సంస్థ ప్రెసిడెంట్ తకహిరో హచిగో సమక్షంలో సరికొత్త అమేజ్, ఆల్ న్యూ హోండా సీఆర్-వీ, సివిక్‌లను ప్రదర్శించింది. సంస్థ ప్రదర్శించిన రెండో తరం హోండా అమేజ్ అందరినీ ఆకర్షించింది. ఇదే సమయంలో ఐదో తరం హోండా సీఆర్‌వీని సైతం సంస్థ చూపించింది. ఈ సందర్భంగా తకహిరో మాట్లాడుతూ, ఈ సంవత్సరం భారత మార్కెట్లో పలు కొత్త వేరియంట్లను అందించనుందని అన్నారు.

రేపటి నుంచి అగ్రిటెక్ సదస్సు

హైదరాబాద్: రేపటి నుంచి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్శిటీలో దక్షిణ భారత వ్యవసాయ సదస్సు జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు వెల్లడించారు. సమీకృత వ్యవసాయ విధానం, పంటల వివిధీకరణ, ఈ-నామ్, పంటల బీమా తదితర అంశాలపై సదస్సు సాగుతుందని, మూడు రోజుల పాటు జరిగే సదస్సులో భాగంగా 100కుపైగా కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయని, వ్యవసాయ భూమి, బీడు, రసాయనాల వాడకం, అందుబాటులోని యంత్రాలు తదితరాలపైనా చర్చలు సాగుతాయని తెలిపారు.



ఆధార్ కార్డు లామినేషన్ వద్దు

- అనధీకృత ముద్రణతో వ్యక్తిగత సమాచారం లీక్ కావచ్చు
- ఆధార్ కార్డు పోగొట్టుకుంటే ఫ్రీగా పొందే ఛాన్స్
- ఈ-మెయిల్లు, ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయని పౌరుల ఫిర్యాదులు
- సమాచారం సేకరించవద్దంటూ ముద్రణ సంస్థలకు యూఐడీఏఐ వార్నింగ్



న్యూఢిల్లీ: ఆధార్ కార్డులను లామినేషన్ చేయించడం లేదా ప్లాస్టిక్ కార్డులపై ముద్రించడం లాంటివి చేయొద్దని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) మంగళవారం ప్రజలకు సూచించింది. అనధీకృత ప్రింటింగ్ వల్ల క్యూఆర్ కోడ్ పని చేయకపోవచ్చని, వ్యక్తిగత సమాచారం బహిర్గతమయ్యే అవకాశముందని కూడా పేర్కొంది. ప్రజల నుండి ఆధార్ సమాచారాన్ని సేకరించడం ఐపీసీ, ఆధార్ చట్టం, 2016 కింద శిక్షార్హమైన నేరమని ముద్రణా సంస్థలనూ ఉడాయ్ హెచ్చరించింది.

ప్లాస్టిక్ లేదా లామినేటెడ్ ఆధార్ స్మార్ట్ కార్డుల తయారీ కోసం పలు వ్యాపార సంస్థల నుండి తమకు ఈ-మెయిల్లు లేదా సెల్‌ఫోన్ సందేశాలు వస్తున్నాయని పలువురు పౌరులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉడాయ్ ఈ మేరకు స్పష్టం చేయడం గమనార్హం. లామినేషన్‌లు, ప్లాస్టిక్ కార్డులు, స్మార్ట్‌కార్డుల పేరుతో డబ్బులు ఖర్చు చేయడం అనవసరమని సంస్థ సీఈఓ అజయ్ భూషణ్ అన్నారు.

తాను జారీ చేసిన ఆధార్ లేఖ లేదా దానిలో కత్తిరించగలిగేలా ఉన్న భాగమూ ఆధార్‌గా చెల్లుబాటవుతుందని ఉడాయ్ పేర్కొంది. ఒకవేళ ఆధార్ కార్డు పోగొట్టుకున్నా...తమ వెబ్‌సైటులో ఉచితంగా, అధికారికంగా దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. కాగితంపై నలుపు, తెలుపు రంగులో ముద్రితమైన ఆధార్ కార్డూ చెల్లుబాటవుతుందని తెలిపింది. మొబైల్-ఆధార్‌నూ వినియోగించుకోవచ్చని ఉడాయ్ పేర్కొంది. కాగా, వ్యక్తిగత సమాచార గోప్యత విషయంలో వెల్లువెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో సంస్థ గతనెల ఒక కొత్త వర్చువల్ ఐడీ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వాస్తవికమైన 12 అంకెల బయోమెట్రిక్ ఐడీకి బదులుగా ఆధార్ కార్డు ఉన్న వారు తమ వెబ్‌సైటులో ఈ వర్చువల్ ఐడీని పొందవచ్చని సంస్థ తెలిపింది.

స్మార్ట్‌ఫోన్‌ల ధరలు తగ్గే కాలం

- స్మార్ట్ ఫోన్ల ధరల తగ్గింపు సీజన్
- పాప్యులర్ మోడళ్లపై భారీ తగ్గింపు
- నోకియా 8, 5 సహా చాలా మోడళ్లపై తగ్గింపులు
- ఈ జాబితాలో వివో, శామ్ సంగ్, ఆనర్, ఒప్పో, హెచ్ టీసీ ఫోన్లు
- పోటీ పెరగడంతో దిగొస్తున్న ధరలు

న్యూఢిల్లీ: ప్రముఖ మొబైల్ తయారీ సంస్థలకు చెందిన పాప్యులర్ స్మార్ట్ ఫోన్ల ధరలు దిగొస్తున్నాయి. ఒక దాని వెంట ఒక కంపెనీ పలు మోడళ్ల ధరలను సవరిస్తున్నాయి. పోటీ బాగా పెరిగిపోవడంతో మరింత తక్కువ ధరలకే అందించే ప్రయత్నం చేస్తున్నాయి.

ధరలు తగ్గిన మోడళ్లు ఇవే: నోకియా 8 మోడల్ ఆవిష్కరణ ధర రూ.36,999 కాగా, అదిప్పుడు రూ.28,999కు దిగొచ్చింది. రూ.8,000 తగ్గిపోయింది. నోకియా 5 మోడల్ కూడా రూ.13,499 నుంచి రూ.12,499కు



తగ్గింది.

శామ్ సంగ్ గెలాక్సీ జే7 ప్రైమ్ ఆవిష్కరించిన సమయంలో ధర రూ.18,790. అదిప్పుడు 13,900కు దిగొచ్చింది. గెలాక్సీ జే7 ఎన్ఎక్స్ టీ ధర రూ.10,490కు తగ్గింది. వివో వి7 దేశీయ మార్కెట్లో ఆవిష్కరణ ధర రూ.18,990. రూ.2,000 తగ్గింపుతో అదిప్పుడు రూ.16,990కే లభిస్తోంది. వివో వై69 ధర తాజా ధర రూ.13,990. అంటే రూ.1,000 తగ్గింది.


వివో వై55 రూ.1,500 తగ్గి రూ.10,490కు లభిస్తోంది.

ఆనర్ 8ప్రోను రూ.29,999కు ఆవిష్కరించగా ఏకంగా రూ.4,000 తగ్గిపోయి రూ.25,999కు దిగొచ్చింది.

ఒప్పో ఏ71 ను గతేడాది రూ.12,990 ధరకు ఆవిష్కరించగా, ఇది రూ.9,990కు చేరింది. హెచ్ టీసీ యూ11 ధర రూ.51,990 స్థాయి నుంచి రూ.45,999కు దిగొచ్చింది. కూల్ ప్యాడ్ కూల్ 1 3జీబీ 32జీబీ మోడల్ రూ.7,999కే దిగొచ్చింది. 4జీబీ 32జీబీ మోడల్ రూ.8,999కు లభిస్తోంది. అలాగే, కూల్ ప్యాడ్ నోట్ 5 తాజా ధర రూ.7,999. కూల్ ప్యాడ్ నోట్ 5 లైట్ తాజా ధర రూ.5,999.


ఆసుస్ జెన్ ఫోన్ 3 ధర రూ.2,000 తగ్గిపోయి రూ.11,999కు లభిస్తోంది. జెన్ ఫోన్ 3 మ్యాక్స్ రూ.8,499కు దిగొచ్చింది. ఇందులోనే మరో మోడల్ ధర రూ.7,999. జెన్ ఫోన్ గో 5 అంగుళాల మోడల్ ధర రూ.6,499. 5.5 అంగుళాల మోడల్ ధర రూ.6,999.

మార్కెట్లో బ్రిటానియా కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్: భారత మార్కెట్లో ప్యూర్ మ్యాజిక్ డ్యూస్ పేరిట సరికొత్త బిస్కెట్లను విడుదల చేసినట్టు బ్రిటానియా ఇండస్ట్రీస్ ప్రకటించింది. నోటిలో కరకరలాడట,తో పాటు చాక్లెట్ అనుభూతిని ఇవి అందిస్తాయని సంస్థ మార్కెటింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ హరీశ్ శేరే వెల్లడించారు. గత ఎనిమిది సంవత్సరాల్లో బిస్కెట్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని ఆయన తెలిపారు. ప్యూర్ మ్యాజిక్ డ్యూస్ 2 మోడళ్లలో లభిస్తుందని వెల్లడించారు. హైదరాబాద్ సహా అన్ని మెట్రో నగరాల్లో లభ్యమవుతుందన్నారు.

బ్లోసమ్ కొచ్చర్ సదస్సు విజయవంతం



హైదరాబాద్: మారుతున్న వాతావరణానికి అనుగుణంగా చర్మం తీరును అనుసరించి చికిత్సలు చేయించుకోవాలని ప్రచారం చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన బ్లోసమ్ కొచ్చర్ సదస్సు విజయవంతమైంది. తొలిసారిగా ఇక్కడికి వచ్చిన ఆమె, దాదాపు 300 మందికి పైగా బ్యూటీ ప్రొఫెషనల్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రతి నిత్యం జీవితంలో అరోమా థెరపీ, ఉపయుక్త తైలాలను ఉపయోగించటం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మనసు, శరీరం సేద తీరేలా ప్రభావం చూపే చికిత్సలు, ఉపయుక్త తైలాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. పుష్పాలు, మూలికలు, పండ్లు, మసాలా దినుసుల నుంచి తీసే తైలాల ప్రయోజనాలను తెలిపారు.

రాష్ట్రపతికి లేఖ రాసి, బీజేపీని ఇరకాటంలో పెట్టిన సుబ్రహ్మణ్యం స్వామి

● ఆర్మీపై కేసు పెట్టేందుకు ఎందుకు అనుమతి ఇచ్చారో వివరణ అడగండి ● నిర్మలా సీతారామన్‌ను మందలించండి ● వదిలేస్తే కాశ్మీర్‌లో ఆర్మీపై వందల కొద్దీ కేసులు నమోదవుతాయి

న్యూఢిల్లీ : రాష్ట్రపతికి లేఖ రాసి, బీజేపీని ఆ పార్టీ ఎంపీ సుబ్రహ్మణ్యం స్వామి ఇరకాటంలో పడేశారు. జమ్ము కాశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలోని ఒక గ్రామంలో కొందరు పాక్ అనుకూల పౌరులు ర్యాలీ తీశారు. అటుగా వెళుతున్న ఆర్మీ పెట్రోలింగ్ బృందంపై అకారణంగా రాళ్ల వర్షం కురిపించారు. ఒక మేజర్ నుంచి గన్ లాక్కునే ప్రయత్నం చేశారు. దీనిని ప్రతిఘటించిన సైనికులు, ఆత్మ రక్షణార్థం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఆ కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. దీనిపై రాష్ట్ర పోలీసులు ఆర్మీ మేజర్, ఇద్దరు జవాన్లపై హత్యా నేరం కేసు పెట్టారు. దీనిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, రక్షణ శాఖ మంత్రి అనుమతి తీసుకున్న తరువాతే తాము ఆర్మీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు. దీనిని నిరసిస్తూ సుబ్రహ్మణ్యం స్వామి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. ఆర్మీ మీద కేసు పెట్టడానికి అనుమతి ఇచ్చిన రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను పిలిపించి వివరణ కోరాలని, అవసరమైతే మందలించాలని ఆయన లేఖలో విజ్ఞప్తి చేశారు. కాశ్మీర్‌లో ఇలాంటి కేసుల సంస్కృతి మొదలైతే ఆర్మీపై ముున్ముందు వందల కొద్దీ కేసులు నమోదవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఇండియన్ ఆర్మీ నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతుందని ఆయన తన లేఖలో హెచ్చరించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 77 (1) ప్రకారం ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలూ రాష్ట్రపతి పేరిటే ఉంటాయి. కాబట్టి మీరు రక్షణ శాఖ మంత్రిని పిలిపించి మాట్లాడవచ్చు' అని సుబ్రహ్మణ్యం స్వామి రాష్ట్రపతికి సూచించారు.

కేవీపీ ఒంటరి

● మద్దతు తెలపని కాంగ్రెస్ సభ్యులు ● రాజ్యసభలో నిరసన తెలిపిన ఎంపీ కేవీపీ ● ప్లకార్డుతో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ నిరసన ● చైర్మన్ వెంకయ్య ఆదేశానుసారం వెనక్కి తగ్గిన కేవీపీ ● కేవీపీ చర్యలను సమర్థించబోమని చెప్పిన గులాం నబీ ఆజాద్ ● గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డుతో నిరసన కొనసాగించిన కేవీపీ

న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్ఃఏపీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో నిత్యం గళం ఎత్తుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేత, రాజ్యసభసభ్యులు కేవీపీ రామచంద్రరావుకు సొంతపార్టీ నుంచి మద్దతు లభించకపోవడంతో నిర్వేదం వ్యక్తంచేశారు. అయినా వెనక్కి తగ్గకుండా రాష్ట్ర ప్రజయోజనాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన తన పోరాటాన్ని కొనసాగించారు. కేవీపీని సభను నుంచి వెళ్లిపోవాలని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యానాయుడు ఆదేశించారు. దీంతో ఆయన సభనుంచి బయటకు వచ్చి పార్లమెంటు ఆవరణలోనున్న గాంధీ విగ్రహం వద్ద తన నిరసనను కొనసాగించారు. ఏపీ ప్రయోజనాల విషయంలో కేవీపీ ఆందోళన చేస్తున్న సమయంలో వెంకయ్య ఆగ్రహం వ్యక్తంచేయడంతో తమ పార్టీ సభ్యుడికి అండగా నిలవాల్సిన గులాం నబీ ఆజాద్ అందుకు భిన్నంగా స్పందించారు. కేవీపీ వైఖరి దురదృష్టకరమని గులాం నబీ ఆజాద్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్లితే బుధవారంనాడు ఉదయం కేవీపీ రాజ్యసభలో ఏపీ ప్రయోజనాలపై గళ్ళం ఎత్తారు. కేవీపీ ఆందోళన కొనసాగిస్తుండగా ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటనతో టీడీపీ ఎంపీలు దాదాపు తమ పోరాటాన్ని ఆపేయగా, రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచందర్రావుకు మాత్రం సొంత పార్టీ నేతల నుంచి మద్దతు లభించలేదు. రాజ్యసభలో ఏపీకి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీ రామచందర్రావు ప్లకార్డుతో పోడియం వద్ద నిరసన తెలిపారు. అయితే వెంటనే స్పందించిన రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఇది సరైన విధానం కాదని, ఈరోజు కేవీపీని అనుమతిస్తే రేపు మరొకరు ఇలా నిరసన చేస్తారన్నారు. ఇలా అయితే సభను సజావుగా నడపలేనని, వాయిదా వేస్తానని వెంకయ్య హెచ్చరించారు. కేవీపీని తన సీట్లో కూర్చునేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలని చైర్మన్ వెంకయ్య కోరారు. సభలో ఇలాంటి చర్యలకు సహకరించబోమని వెంకయ్యకి గులాం నబీ ఆజాద్ వివరణ ఇచ్చుకున్నారు. నిబంధన 255 కింద ఎంపీ కేవీపీ తన హాజరును ఉప సంహరించుకొని, సభ నుంచి నిష్క్రమించాలని చైర్మన్ ఆదేశించారు.




'హిజ్ ఎక్సెలెన్సీ' వద్దు... 'గౌరవనీయులైన చైర్మన్' అంటే చాలు

సభ్యులకు రాజ్యసభ చైర్మన్ సూచన




న్యూఢిల్లీ : రాజ్యసభ చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన పాత్రను సమర్థంగా పోషిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. అవసరం లేని పాత సంప్రదాయాలకు చరమ గీతం పాడుతున్నారు. తాజాగా చైర్మన్‌ను సంబోధించే సమయంలో పేరుకు ముందు ఉపయోగించే 'హిజ్ ఎక్సెలెన్సీ' అనే గౌరవ వాచకాన్ని పక్కన పెట్టాలని మంగళవారం ఆయన సభ్యులకు సూచించారు. ఇలా పిలుస్తుంటే తనకు చాలా ఇబ్బందిగా ఉందని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలం నుండి అమలులో ఉన్న ఈ వాక్యాన్ని భవిష్యత్తులో వాడాల్సిన పని లేదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేయడం గమనార్హం. సభ జీరో అవర్‌లో జనతా దళ్ సభ్యుడు హరివంశ్ నారాయణ్ సింగ్ కొన్ని పత్రాలను సమర్పిస్తున్న సమయంలో వెంకయ్య ఈ మేరకు సూచనలు చేశారు. రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య ఇలాంటి గౌరవ వాచకాలను పక్కన పెట్టిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. పత్రాలను బల్లపై ఉంచే ముందు 'నేను అర్థిస్తున్నా' అని చెప్పడానికి బదులుగా 'నేను సభ దృుఎష్టికి తీసుకువస్తున్నా' అని చెబితే సరిపోతుందని కూడా ఆయన ఇది వరకే సూచించిన సంగతి విదితమే.

రాజ్యసభకు త్రిపుర నుంచి సీతారామ్ ఏచూరికి అవకాశం!



న్యూఢిల్లీ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి రాజ్యసభకు తిరిగి నామినేట్ కావడం ఖాయమైపోయింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు త్రిపుర రాష్ట్రం తరఫున ఆయనను రాజ్యసభకు పంపాలని ఆ పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న జర్నదాస్ బైద్య అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే ఆమె తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తారు. దానితో ఆమె స్థానంలో సీతారామ్ ఏచూరిని పెద్దల సభకు పంపించాలని పార్టీ నిర్ణయించింది. వాస్తవానికి బైద్య రాజ్యసభ సభ్యత్వం 2022 వరకు ఉంది. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయించేందుకు ఆమెను పార్టీ ఒప్పించింది. రాష్ట్ర ఎన్నికల్లో గెలిస్తే మంత్రి పదవి ఇచ్చేందుకు హామీ కూడా ఆమెకు లభించిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

'రజనీకాంత్ ప్రధాని అయితే...'



ముంబయి : సోషల్ మీడియా ద్వారా వివిధ అంశాలపై స్పందించే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా రజనీకాంత్ రాజకీయం, త్వరలో విడుదల కానున్న '2.0' సినిమాలను మిక్స్ చేస్తూ ట్విట్టర్‌లో తనదైనశైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న 200 దేశాల్లో భారత్ కూడా ఒక దేశం. అదే రజనీకాంత్ ప్రధాని అయితే ఇండియా కచ్చితంగా అమెరికా స్థాయికి చేరుతుంది. 2.జీరో నుంచి 200.జీరోకు చేరుతుంది' అని పేర్కొన్నాడు. మరో ట్వీట్‌లో 'శివ సినిమాతో నాగార్జున నాకు కిక్ స్టార్ట్ ఇచ్చాడు. ఇన్నేళ్ల తరువాత నాకు మరో కిక్ కావాలి. రిలీజ్ డేట్, టైమ్ త్వరలోనే ప్రకటిస్తాను. నాగార్జునతో హిట్ కొట్టకపోతే ఆయన ఫ్యాన్స్ నన్ను తన్నేందుకు సిద్ధంగా ఉన్నారు. సినిమాలో విలన్స్ కోసం నువ్వు కిక్స్ రెడీ చెయ్యి, నన్ను తన్నేందుకు నీ ఫ్యాన్స్ కిక్స్‌ను రెడీగా ఉంచమను' అంటూ ట్వీట్ చేశాడు.

మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు పాలన అంతా మోసాలమయం



పట్టించుకోవడం లేదని విమర్శించారు. మన అధికారంలోకి రాగానే రూ. 1100 కోట్లు చెల్లించి.. అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేస్తామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అగ్రిగోల్డ్డ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చేస్తామని, అగ్రిగోల్డ్డ బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఇంకా జగన్ ఏమన్నారంటే "దేవుడి దయవల్ల మనం అధికారంలోకి రాగానే మంచి పాలన అందిస్తాం. నేను చనిపోయిన తర్వాత నాన్న ఫొటోతోపాటు నా ఫొటో కూడా ప్రతి ఇంట్లో ఉండాలి ఆరాటపడుతున్నాను. అందుకే ప్రతి పేదవాడికి మంచి చేసే ఉద్దేశంతో నవరత్నాలు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదవాలి. ఇవాళ ఇంజినీరింగ్ చదవాలంటే లక్షలు లక్షలు ఫీజులు ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రూ. 30వేలకు మించడం లేదు. దివంగత నేత, నాన్నగారి పాలనలో ప్రతి పిల్లాడికి ఉన్నత చదువులు చదివేందుకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా మనం అధికారంలోకి రాగానే డాక్టర్లు, ఇంజినీర్లు వంటి ఉన్నత చదువులు చదివే పిల్లలకు పూర్తి ఫీజులు చెల్లిస్తాం. విద్యార్థుల ఖర్చుల కోసం ఏటా రూ. 20వేల చొప్పున అందజేస్తాం. బడికి వెళ్లే పిల్లలకు ఏటా రూ. 15వేలు ఇస్తాం' అని వైఎస్ జగన్ తెలిపారు అవ్వతాతల పెన్షన్ వయస్సును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు 45 ఏళ్లకే రూ. రెండువేల చొప్పున పెన్షన్ అందజేస్తామన్నారు. వైద్యబిల్లు రూ. వెయ్యి ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ కింద హైదరాబాద్ సహా ఎక్కడైనా ఆపరేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు. కుటుంబ పెద్ద ఆపరేషన్ చేయించుకుంటే విశ్రాంతి సమయంలో ఆర్థిక సాయం చేస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 10వేలు పెన్షన్ ఇస్తామని చెప్పారు. గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటుచేసి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్, పెన్షన్లు, రేషన్ కార్డులను 72 గంటల్లోనే మంజూరు చేస్తామని తెలిపారు



ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం హసనాపురంలో వైఎస్ జగన్ ముస్లింలతో ముఖాముఖి భేటీలో మాట్లాడారు. మసీదులతోపాటు ఆలయాలు, చర్చిలను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముస్లింలదరినీ బీసీ-ఈ కింద చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. రూ. 1100 కోట్లు చెల్లిస్తే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరుగుతుందని చంద్రబాబుకు చెప్తున్నా

గాలికి అశ్రు నివాళి



చిత్తూరు జిల్లా రామ చంద్రపురం మండలం వెంకట్రామాపురంలో జి.రామానాయుడు, రాజమ్మ దంపతులకు జన్మించారు. బీఎస్సీ, ఎంఏతోపాటు న్యాయవాద డిగ్రీ పట్టా పొందారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పుత్తూరు నుంచి ఆరుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించి రికార్డులకెక్కారు. విద్య (1984), అటవీశాఖ (1987), ఉన్నత విద్య (1994) మంత్రిగా సేవలందించారు. తెలుగుదేశంతో విభేధించి కాంగ్రెస్‌లో చేరి 2004 ఎన్నికల్లో ఆ పార్టీ శాసనసభ్యునిగా గెలుపొందారు. తిరిగి 2008లో తెదేపాలో చేరి 2009 ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం తెదేపా ఎమ్మెల్సీగా సేవలందిస్తున్నారు.

చిత్తూరుతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు ముద్దు కృష్ణమనాయుడని వైకాపా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో గాలి ముద్దుకృష్ణమనాయుడి పార్థివ దేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. రాజకీయ జీవితంలో అవినీతి, లంచగొండితనానికి ఆస్కారం లేకుండా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన లేని లోటు తీరనిదని.. ఆ కుటుంబానికి దేవుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు.

మాజీ మంత్రి, టీడీపీ నేత గాలి ముద్దుకష్ణమనాయుడు మతికి ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతికి గురయ్యారు. మాజీ మంత్రి, టీడీపీ నేత గాలి ముద్దుకష్ణమనాయుడు 1983లో ఎన్టీఆర్ పిలుపుతో అధ్యాపక వత్తిని వదిలి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. రికార్డు స్థాయిలో పుత్తూరు నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ గాలి ముద్దుకష్ణమనాయుడు (71) అర్ధరాత్రి కన్నుమూశారు. రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్సపొందుతూ ఆయన మత్యువాతపడ్డారు. గాలి ముద్దుకష్ణమనాయుడు 1947 జూన్ 9న చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామపురంలో జి.రామానాయుడు, రాజమ్మ దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం తరువాత అధ్యాపక వత్తిని స్వీకరించిన ఆయన, 1983లో దిగ్గజ నటుడు ఎన్టీఆర్ పిలుపు మేరకు రాజకీయరంగప్రవేశం చేశారు. పుత్తూరు నుంచి ఆరుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించి రికార్డులకెక్కారు. ఈ క్రమంలో ఆయన వివిధ పదవులను అలంకరించారు. 2014 ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన సినీ నటి రోజా చేతిలో ఓటమిపాలయ్యారు. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన మతితో టీడీపీ ఒక సీనియర్ నేతను కోల్పోయింది. ఆయన మతి విషయం తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సినీ నటుడు నందమూరి బాలకష్ణ, సుజనా చౌదరి, ఎంపీలులి కేశినేని నాని, రాయపాటి సాంబశివరావు, గల్లా జయదేవ్, మురళీమోహన్, మంత్రులు పరిటాల సునీత, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్క ఆనంద్ బాబు, శాసన సభ్యులు, టీడీపీ నేతలు దేవినేని అవినాష్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, చిట్టాబత్తిన చిట్టిబాబు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముద్దుకష్ణమనాయుడు అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పార్లమెంటులో ఎంపీల ఆందోళనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు టెలికాన్ఫరెన్స్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమస్యలను జాతీయ స్థాయి అజెండాగా మార్చామన్నారు. ఏపికి జరిగిన అన్యాయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం చేశామన్నారు. దీనిని హేతుబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలి, రాష్ట్ర ప్రయోజనాలను సాధించాలన్నారు. సభనుంచి సస్పెండ్గ చేసినా వెనుకంజ వేయవద్దు అన్నారు. ప్రజా ప్రయోజనాలే మనకు ముఖ్యం, రాష్ట్రాభివద్ధే మన లక్ష్యమన్నారు. విభజన సమయంలో 6నెలలు పార్లమెంటులో పోరాటం చేశామన్నారు. తక్కువమంది ఎంపిలతోనే సభను స్థంభింపచేశాం, అన్యాయాన్ని ప్రతిఘటించాం, అప్పుడు వాళ్లు చేసేది వాళ్లు చేస్తే ప్రజలు చేయాల్సింది ప్రజలు చేశారన్నారు. ఏ పార్టీ అయినా ప్రజాభిప్రాయం మేరకే నడుచుకోవాలన్నారు. రెండు ప్రభుత్వాల మధ్య సమస్య ఇది. బంద్‌ల ద్వారా జనజీవనానికి ఇబ్బందులు మంచిదికాదన్నారు. పార్లమెంటులో పోరాడాల్సిన సమస్య ఇది, వీధి పోరాటాల సమస్య కాదన్నారు. ఆర్థికలోటు భర్తీపై ఇప్పుడు కొత్తగా ఫార్ములా ప్రస్తావన ఏమిటి? అన్నారు. విభజనకు లేని ఫార్ములా రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కావాలా? అన్నారు. ఏపికి జరిగిన అన్యాయంపై ఖర్గే ఎందుకు ప్రశ్నించలేదు? అన్నారు. ఈ రెండురోజులే సభ జరుగుతుంది, ఎల్లుండి సభ వాయిదా పడుతుంది. కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ముఖ్యమంత్రి కోరారు.

తెలుగుదేశం సీనియర్ నేత, మాజీమంత్రి, యంయల్‌సి గాలి ముద్దుకష్ణమనాయుడు మతికి మంత్రులు నారా లోకేష్, కిమిడి కళా వెంకట్రావు, ఎం.ఎల్.ఏ నందమూరి బాలకష్ణ, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు వి.వి.వి.చౌదరి, టి.డి.జనార్దన్ రావు, గిడ్డంగుల సంస్థ చైర్మెన్ యల్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, కార్యాలయ కార్యదర్శి ఏ.వి. రమణ, రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, ఏపిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, బి.జె.పి రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, ఎం.పి., ఎమ్మెల్యేలు, ఎంపిలు, నాయకులు, అధికారులు పలువురు ప్రగాడ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన మతి తెలుగుదేశం పార్టీకి, రాష్ట్రానికి, ప్రముఖంగా చిత్తురు జిల్లా అభివద్ధికి తీరనిలోటన్నారు. ఆయన ఆశయసాధనకు అవసరమైన మనోధైర్యాన్ని, గుండెనిబ్బరాన్ని ఆయన కుటుంబసభ్యులకు అందించాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రిగా, శాసనసభ్యునిగా, శాసన మండలి సభ్యుడిగా వారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్సీ గాలి ముద్దుకష్ణమ నాయుడి భౌతిక కాయాన్ని ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా వెంకట్రామపురానికి తరలించారు. భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్థివ దేహానికి పలువురు టీడీపీ శ్రేణులు, అభిమానులు నివాళులర్పిస్తున్నారు. రేపు మధ్యాహ్నం వెంకట్రామపురంలో ముద్దుకృష్ణమ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

నా సవాలుకు జవాబు ఏది?

ఓడించారన్నారు. ప్రస్తుతం 70సీట్లలో కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందని చెబుతున్న ఆ పార్టీ నేతలు ఏ హేతుబద్ధతతో చెబుతున్నారని, తాడుబొంగురం లేని విధంగా ఉత్తమ్ ప్రకటనలు గుప్పిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ నేతలు శిఖండి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో తాము చేసిన అభివృద్ధికి ప్రజలు ఓటు వేస్తారన్న విశ్వాసం, నమ్మకం ఉందని దాంతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గొంగడిలో కూర్చొని ఎంట్రుకలు పీకిన చందంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలున్నాయని ఆయన ఆరోపించారు.

దమ్ము ధైర్యం ఉంటే...లేకున్నా...


ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దమ్ము ధైర్యం ఉన్నా..లేకున్నా నా ప్రకటనకు కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు రాజకీయ చైతన్యం ఉన్నవారని తమకు అపారమైన నమ్మకం ఉందని, వారిపై ప్రేమ కూడా ఉందని, కేసీఆర్ నాయకత్వానికి జై కొడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలను శాశ్వతంగా నివారించేందుకు కేసీఆర్ నాయకత్వంలో చేస్తున్న పథకాలు, ప్రాజెక్టులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తే ప్రతి నీటిబొట్టులో కేసీఆర్ కనిపిస్తారన్నారు. రాష్ట్రాభివృద్ధికి నాడు, నేడు కాంగ్రెస్‌పార్టీ శనిలా దాపురించిందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇన్నేళ్లు అధికారాన్ని వెలుగబెట్టిన కాంగ్రెస్‌పార్టీ, ఆపార్టీ నేతలు కనీసం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న ఆలోచనచేయలేదని, నల్గొండ జిల్లా ప్రజలు ఫ్లోరోసిస్‌తో అల్లాడుతున్నారని, దీనికి కాంగ్రెస్‌పార్టీ దుష్పరిపాలనే కారణమన్నారు.

రైతులకు పెట్టుబడి పథకం...

రైతులకు పెట్టుబడి పథకం ఓ యజ్ఞంలాంటిదన్నారు. దేశంలో ఎవరు చేయని విధంగా రైతులకు పెట్టుబడిగా డబ్బులు అందిస్తే ప్రతి రైతు కుటుంబంలో ఆనందం చూస్తామన్నారు. కరెంటు, విత్తనాలు, ఎరువులు, గోదాంలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీంతో టీఆర్ఎస్‌పార్టీ బలం మరింత పెరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

బాహుబలికి వచ్చిన కలెక్షన్ బడ్జెట్ కేటాయింపులు లేవు...

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎవరికి కూడా అర్థం కాకుండా ఉందని, రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు తప్పా కొత్తగా ఏమీ ఇవ్వలేదని మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బాహుబలి సినిమాకు వచ్చిన కలెక్షన్‌కు సరిపడా బడ్జెట్‌లో తెలంగాణాకు కేటాయించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో చేపట్టిన మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ, కేసీఆర్ కిట్స్, పెట్టుబడి పథకం,కాళే శ్వరం తదితర వాటిని ప్రధానితో సహా కేంద్ర మంత్రులు, అధికారులు ప్రశంసిస్తున్నారని అయితే బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. మిషన్‌భగీరథకు 19వేల కోట్లు కేటాయించాల్సిందిగా నీతి అయోగ్ ప్రభుత్వానికి నివేదిక అందజేసినా...పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందని ఆ పార్టీ నేతలు ప్రజలకు చెబుతారని, ఇంకా ప్రత్యామ్నాయం ఎలా అని ఆయన ఎద్దేవా చేశారు. అంబర్‌పేటకు కిషన్‌రెడ్డి, ముషీరాబాద్‌కు లక్ష్మన్‌కు పరిమితమన్నారు. ఎన్డీఏ మిత్రపక్షాలు బడ్జెట్ కేటాయింపులపై పెదవి విరుస్తున్నారన్నారు. ఆశోక్‌గజపతి, సుజనాచౌదరి కేంద్ర మంత్రులు సైతం బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఏయిమ్స్ అడిగాం..సిరిసిల్లలో టెక్స్‌టైల్‌పార్కు, కాకతీయపార్కు అడిగాం ఏవీ ఇవ్వలేదన్నారు. దీనితో పాటు ఐటిఐఆర్ గురించి, రాష్ట్ర ప్రాజెక్టుల గురించి మూడున్నరేళ్లుగా అడుగుతూనే ఉన్నామన్నారు.ఎన్డీఏలోని భాగస్వాములకే దిక్కులేదన్నారు. ఈవిషయాలన్నీ ప్రజలకు తెలుపుతామన్నారు.



మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోడీ ఫైర్

చేసుకున్న మోడీ టీడీపీ ఆవిర్భావం నాటి పరిస్థితులను ప్రస్తావించడం గమనార్హం. తెలుగువారి ఆత్మ గౌరవ నినాదంతో ఆయన పోరాడి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఆనాడు రాజీవ్ గాంధీ ఓ దళిత ముఖ్యమంత్రిని అవమానించారని, అంజయ్య, పీవీ నరసింహారావు, నీలం సంజీవరెడ్డి పట్ల కాంగ్రెస్ దుర్మార్గంగా వ్యవహరించిందని ప్రధాని విమర్శించారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు సైతం పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, మోడీ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో సభలో గందరగోళం ఏర్పడింది. మోడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూనే, ఏపీలో కాంగ్రెస్ అనేక రాజకీయ దారుణాలు చేసిందని ఆరోపించారు. ఆ రాష్ట్రం గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని, ప్రజాస్వామ్యం గురించి మీరా మాట్లాడేది? అంటూ కాంగ్రెస్‌కు కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ పుట్టిందని చెబుతూ, నిదానంగా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ మేరకు తాను హామీ ఇస్తున్నానని అన్నారు.

అచ్చంపేటలో లక్ష ఎకరాలకు నీరు

ఇక్కడ జలసౌధలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం లోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉల్పర రిజర్వాయర్ నిర్మాణం వల్ల మునుకు గురవుతామనే భయాందోళనలు అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం పై జరుగుతున్న ఊహగానాలను నమ్మవద్దని ఆయన కోరారు. 3 టి.ఎం.సి.లు లేదా 1 టి.ఎం.సి.ల కెపాసిటీతో రిజర్వాయర్ కడుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కేవలం 25 టి.ఎం.సి.లతోనే ఉల్పర రిజర్వాయర్ ను నిర్మిస్తున్నట్టు హరీష్ రావు స్పష్టం చేశారు. ఈ రిజర్వాయర్ పరిధిలో దాసరాజుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందనే ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఈ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురి కాదన్నారు. భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. డిండి చీఫ్ ఇంజనీర్ సునీల్, రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తారని మంత్రి తెలిపారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీళ్లందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభించనున్నదని మంత్రి అన్నారు. ప్రస్తుతం పంటలు వేసుకొని ఉన్నందున దిగుబడి వచ్చేవరకు కాలువల తవ్వకం జరగదని కూడా హరీష్ రావు చెప్పారు. రెండు, మూడు నెలల తర్వాత ఆర్.డి.ఓ. ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ప్రజలతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. కాలువల వెడల్పు తగ్గించి, భూసేకరణ తగ్గించాలని రైతులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రత్యామ్నాయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హరీష్ రావు రైతులకు హామీ ఇచ్చారు. సముద్రానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఆమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని అచ్చంపేట శాసన సభ్యుడు బాలరాజు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి అచ్చంపేట నియోజకవర్గానికి 50 వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఒక లక్ష ఎకరాలకు సాగునీరందించెందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్టు మంత్రి హరీష్ రావు తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈ.ఎన్.సి. మురళీధర్ రావు, సి. ఈ.ఎస్. సునీల్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు

రాజధాని ప్రాంతంలో 14 మెడికల్ కళాశాలలు : చంద్రబాబు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : రాజధాని ప్రాంతంలో 14 మెడికల్ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని, రూ.34 వేల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుధవారం మంగళగిరి మండలం కురగల్లులో అమృత విద్యాపీఠం, అమరావతి క్యాంపస్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలకు రూ. 15,900 కోట్లు, పరిపాలనా నగరానికి రూ. 9,600కోట్లు, కొండవీటి వాగు వరద నివారణకు రూ. 1,450 కోట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. రాజధాని ప్రాంతంలో 10–15 నిమిషాల నడక దూరంలోనే ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, వినోద సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, రాజధానిలో 1600 కి.మీ. సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అమృత విద్యాపీఠం విలువలతో కూడిన విద్యను అందించడం అమృత విద్యాలయం ప్రత్యేకత అని, నవ్యాంధ్ర రాజధానిలో సంస్థ ఏర్పాటుకావడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ముందుగా ఇంజనీరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఆర్ట్స్ విభాగాల్లో కోర్సులు ఉంటాయని, పేద కుటుంబంలో పుట్టిన అమ్మ అమృతానందమయి సేవకు ప్రతిరూపంగా ఎదిగారని, అమృతానందమయి సంస్థ విద్యారంగం, ఆధ్యాత్మికరంగంలో ముందుందని సీఎం కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా మాతా అమతానందమయికి లక్షలాది భక్తులున్నారని, ఇలాంటి విద్యాసంస్థ రాజధానికి రావడంతో ఆధ్యాత్మికత పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సబ్సిడీ ట్రాక్టర్లు పంపిణీలో రాజకీయ జోక్యం

- పథకం పక్కదార్లు • నిబంధనలకు పాతర
- టిఆర్ఎస్ నేతలే లబ్ధిదారులు • సన్న చిన్నకారు రైతులకు మొండి చేయి
- అధికార పార్టీ కనుసన్నల్లో టాక్టర్ల పంపిణీ • ఇదేం న్యాయమంటున్న రైతులు
- రచ్చ బండల కెక్కిన ట్రాక్టర్ల పంపిణీ • పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు
- మంత్రి కనుసన్నల్లోనే అక్రమాలంటూ టిడిపి ధ్వజం



ఖమ్మం, సూర్య బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల మేలు కోరి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంత్రలక్ష్మి ట్రాక్టర్ల పంపిణి పథకం రాజకీయ జోక్యంతో రచ్చకు దారి తీస్తుంది. అధికారుల అతి ఉత్సాహం, అధికారపార్టీ నాయకుల జోక్యంతో పథకం పక్కదార్లు పడుతుందనే విమర్శలు వెల్లు ఎత్తు తున్నాయి. మంత్రి కనుసన్నల్లోనే ఈ పథకం పక్కదార్లు పడుతుందంటూ తెలుగుదేశం పార్టీ ధ్వజమెత్తింది. టిడిపికి చెందిన మాజీ ఎంపి నామా నాగేశ్వర రావు, సత్తుపల్లి శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్యలు పథకం ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాకు మంజూరి అయిన 578 ట్రాక్టర్ల పంపిణికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి 17న ఖమ్మం వస్తున్నారు. ఎంపిక చేసిన లబ్దిదారులకు ట్రాక్టర్లు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగా సిద్ధమౌతున్న వేళ ఆరోపణలు రావటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకించి లబ్దిదారుల ఎంపికలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ స్వయంగా కలెక్టర్‌ను కలిసి ఇద్దరు మహిళా రైతులు తెలపటం అధికార పార్టీ నేతలకు రుచించటంలేదు. చింతకాని మండలం లచ్చగూడెంకి చెందిన సీతమ్మ, నేరడ గ్రామానికి చెందిన నాగలక్ష్మిలు నేరుగా సోమవారం గ్రీవన్స్ డే సందర్భంగా కలెక్టర్‌ను నేరుగా కలిసి ట్రాక్టర్ల పంపిణిలో లబ్దిదారుల ఎంపికలో జరుగుతున్న డొల్లతనాన్ని వివరించారు. తమకు ట్రాక్టర్ ఇస్తామని స్థానిక అధికారి 10వేల రూపాయాలు లంచం తీసుకున్నట్లు కూడా ఫిర్యాదు చేయటంతో గ్రీవెన్సుకు వచ్చిన అధికా రులంగా నివ్వెర పోయారు. అక్కడే ఉన్న వ్యవసాయశాఖ అధికా రులను విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో గుట్టుచప్పుడుగా తమ వారికి ఇప్పిద్దామనుకున్నా ట్రాక్టర్ల పథకం చిలికి చిలికి గాలివాన లాగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ నేతలు ఒక్కరో అరో తిసుకుంటే తాము అభ్యంతరం పెట్టే వాళ్లము కాదని మొత్త అన్ని ట్రాక్టర్లు అధికారపార్టీ నాయకులకు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు కేటాయిచటం ఏమిటని రైతులు భగ్గుభగ్గుమంటున్నారు. ఒక్క ఇంట్లోనే ఇద్దరికి ముగ్గురికి ప్రభుత్వం పథకాలు అందజేయటంపై పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామ సభలు, మండల కమిటీలు ద్వారా వ్యవసాయశాఖ అధికారి, ఉధ్యాన వన శాఖ అధికారి, డిఆర్‌డిఓ అధికారి కలిసి ఎంపిక చేయా లనే నిబంధనలు ఉన్నా వాటిని బేఖాతర్ చేస్తు లబ్దిదారుల జాబితా తయారు చేయటంపై గ్రామాల్లో రైతులు రగిలిపోతున్నారు. నియమ నిబంధనల్లో చిన్న సన్నకారు రైతులకు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేయాలని ఉన్నా వాటిని పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లు ఎత్తుతు న్నాయి. కూలీలు దొరకటం లేదని ప్రస్తుతం యంత్రిక యుగం నడుస్తున్నం దున వ్యవసాయాన్ని సులువుగా పేద రైతులు చేసుకేందుకు ఉద్దేశించిన ఈ పథకం పెద్దలకు, పైరవీ కార్లకు, వ్యవసాయం చేయని వాళ్లకు అందటంపై గ్రామాల్లో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాకు కేటాయించిన 578 ట్రాక్టర్లలో పాలేరుకు 121, మధిరకు 150, సత్తుపల్లికి 148, వైరాకు 96, ఖమ్మంకు 64 ట్రాక్టర్లను జిల్లా వ్యవసాయశాఖ కేటాయించింది. 50శాతం సబ్సీడీతో ఇస్తున్న పథకం కావటంతో దీనిపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలానికి 38 ట్రాక్టర్లు మంజూరి కాగా ఎస్సీ రైతులకు 6, ఎస్టీ రైతులకు 6 మాత్రమే కేటాయించారు.గిరిజన రైతులు ఎక్కువగా ఉన్న ఈమండలంలో వారికి అధికంగా ఎందుకు కేటా యించ లేదనే ప్రశ్నలకు అధికారుల నుంచి జవాబు దొరకటంలేదు. రెండున్నర ఎకరా లకు పైన వ్యవసాయ భూమి ఉన్న రైతులను లబ్దిదారులుగా ఎంపిక చేయాలి. కాని అధికార పార్టీ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నియమ నిబం ధనలు పక్కనబెట్టి తమ అనుయాయులకు తమకే కేటాయింప చేసుకుంటు న్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2 ఎకరాలు ఉన్న రైతులకు కూడా కేటాయిం చారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల పంపిణికి ముందే ఈ పథకంపై గ్రామా ల్లో ఆలజడి రేగుతుంది. ఎవరుకి ట్రాకర్టు వస్తుంది. ఆయనకు ఎంత భూమి ఉంది. నిజంగానే అర్హుడేనా? నియమాలు పాటిస్తున్నారా? లేదా అనే విషయా లపై గ్రామ రచ్చ బండలమీద చర్చలు జరుగుతున్నాయి.

ఏపి విద్యుత్ సంస్థల ఆదాయం కేసులపై ప్రత్యేక దృష్టి

విద్యుత్ శాఖ మంత్రి కళావెంకట్రావు



అమరావతి, సూర్య బ్యూరో : విద్యుత్ శాఖ పరిధిలోని ఏపిట్రాన్స్‌కో, ఏపి విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చా లని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళా వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపుడిలోని తన కార్యలయంలో ఏపి విద్యుత్ సంస్థల్లో కోర్టు కేసుల పురోగతి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఏ) విండ్, సోలార్ విద్యుత్ తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. సమీక్షలో ఇంధన శాఖ సలహాదారు కె. రంగనాథం, ఏపిట్రాన్స్‌కో జేయండీ దినేష్ పరుచూరి, ఏపి ట్రాన్స్‌కో న్యాయ సలహాదారు శివరావు, సి.ఈ ఐపిసి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పిపిఏలు) సంబంధించి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఢిల్లీ, ఏపీఈఆర్సీ, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులు పరిష్కారం అయితే విద్యుత్ సంస్థలకు ఆదాయం వచ్చే కేసుల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మంత్రి అధికా రులను ఆదేశించారు. సుప్రీంకోర్టు కేసులకు సంబంధించి ప్రతి వాయిదాకు క్రమం తప్పకుండా అధికారులు హాజరు కావాలని, ఏఓఆర్, సీనియర్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌కో తరవున వాదనలు బలంగా వినిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో టెండర్లు నియ మావళి రూపొందించే సమయంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే సమయాన్ని పొందు పొరచాలని, నిర్ణీత సమయంలో సంబంధిత కంపెనీ పనులు పూర్తి చేయకుండా కాలవ్యవధి పొడిగిస్తే ఆ సమయంలో పిపిఏ లో పేర్కొన్న విద్యుత్ కొనుగోలు ధర కంటే మార్కెట్లో విద్యుత్ ధర తక్కువ ఉంటే ఆ రేటు మ్రామే చెల్లించేలా నిబంధనను చేర్చాలని మంత్రి ఆదేశించారు. ఈ నిబంధనను టెండర్ దరఖాస్తులోను, పిపిఏ నిబంధనల్లోనూ ఖచ్చితంగా పొందుపరచాలని, దీనివల్ల విద్యుత్ సంస్థలకు ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. భవిష్యత్తులో విద్యుత్ కొనుగోలులో ధరలు తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవా లన్నారు. భవిష్యత్‌లో సాంప్రదాయేతర ఇంధన వనరులైన విండ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుందని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకునే సమయంలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. విద్యుత్ రంగం లో దేశానికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విభాగాల్లో మార్గదర్శకంగా ఉందని మంత్రి కిమిడి కళా వెంకట్రావ్ ప్రశంసించారు.

కాలుష్యకార పరిశ్రమలపై ఉక్కుపాదం



అమరావతి, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో కాలుష్యకార పరిశ్రమలను ఉపేక్షించే ప్రసక్తే లేదని రాష్ట పర్యావరణం, అడువులు, శాస్త్ర సాంకేతిక శాఖామంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. వెలగపూడి సచివాలయంలో తన కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఛైర్మన్ బిఎస్ఎస్ ప్రసాద్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలుష్య కారక పరిశ్రమల మీద తీసుకున్న చర్యలు గురించి పిసిబి ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 19, 2017న జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు మేరకు డిసెంబర్ 2017న జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు మేరకు డిసెంబర్ 2017 నుంచి ఫిబ్రవరి 5, 2018వ తేదీ వరకు మూడు మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 జోన్లలో 866 పరిశ్రమలను తనఖీ చేయడం జరిగిందని, పిసిబి నిబంధనలు పాటించని 405 పరిశ్రమలకు నోటీసులు జారీ చేయడం, 301 పరిశ్రమలకు మార్గదర్శకాలు జారీ చేయడం, 29 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, పిసిబి నిబంధనలు ఆచరణార్థం 23 పరిశ్రమల మీద బ్యాంకు గ్యారంటీ విధించి తీసుకోవడం జరిగిందని పిసిబి ఛైర్మన్ మంత్రికి తెలిపారు.

మహిళల అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర

విజయవాడ, సూర్య బ్యూరో : గ్రామీణాభివృద్ధి మరియు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధించాలి అంటే సహకార రంగమే ఒక మంచి సాధనమని కృష్ణా జిల్లా నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ తురిమెళ్ళ విజయ్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ సహకార యూనియన్, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఎ.పి.రాష్ట్ర సహకార యూనియన్, విజయవాడ, సహకార శిక్షణా కేంద్రం, విజయవాడ ఆధ్వర్యంలో షేడ్యూల్డ్ కులములు, "షెడ్యూల్డ్ తెగలు, బలహీన వర్గాల మహిళల అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర" అనే అంశంపై సకల స్నేహ చారిటబుల్ ట్రస్ట్, అమెరికన్ ఆసుపత్రి వద్ద విజయవాడ సమావేశ మంది రంలో నిర్వహించబడిన 'సెమినార్'కు కృష్ణా జిల్లా నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ శ్రీతురిమెళ్ళ విజయ్‌గారు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొని కృష్ణాజిల్లాలో సుమారు 70,000 స్వయం శక్తి సంఘాలు పనిచేస్తున్నాయని, మహిళా స్వయం శక్తి సంఘాలకు ఋణాలు మంజూరు చేయాలని నాబార్డు ప్రథమంగా రిజర్వు బ్యాంకుకు సూచించిందని, తదుపరి రిజర్వుబ్యాంకు వారి ఉత్తర్వుల మేరకు అన్ని జాతీయ బ్యాంకులు మహిళా స్వయం శక్తి సంఘాలకు విరివిగా అందిస్తున్నాయని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా సహకార ఆడిట్ అధికారి టి.వీరన్న మాట్లాడుతూ పాల్గొన ప్రతి ఒక్కరు అందరి కోసం పనిచేయాలని పరస్పర సహాయం, స్వయం సహాయం వంటి లక్షణాలతో ఏర్పాటు చేయబడిన మహిళా స్వయం శక్తి సహకార సంఘాలు పరస్పర సహాయ సహకార సంఘంల చట్టం పరిధిలోనికి తేవడం జరిగిందని ఈ సంఘాలు బడుగు, బలహీన మరియు షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు జాతుల సాంఘిక, ఆర్థిక, విశేషముగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. "సర్వజన స్నేహ చారిటబుల్ ట్రస్టు స్టీలు, సిస్టర్ పి.సుగుణ ఫ్రాన్సిస్ మరియు సిస్టర్ జాయిల్ మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 6 మహిళా పరస్పర సహాయ సహకార సంఘాలు పేద మహిళల ఆర్థిక స్వావలంబన మరీ ముఖ్యంగా వెనుక బడిన జాతులకు చెందిన మహిళలు మరియు షెడ్యూల్డ్ తెగలు మరియు జాతులకు చెందిన మహిళల వారు నిరక్షరాస్యత వలన గాని, పేదరికం వలనగాని వెనుకబడి ఉండడం, వడ్డీ వ్యాపారులు, ఇతరత్రా సంస్థలవారు ప్రజలను అపలు చేయుటకు ప్రోత్సహించి ఆర్థికంగా వీరిని ఇంకా బలహీనులు చేయడం జరుగుతుందని, వారిని సమైక్యపరచి ఆర్థిక స్వావలంబన సాధించుటకు మరియు వారి భవిష్యత్‌కు భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో మా సహకార సంఘాలు పనిచేస్తున్నాయన్నారు.

ముద్దుకృష్ణమనాయుడు మృతికి మండలి చైర్మన్ సంతాపం



అమరావతి, సూర్య బ్యూరో : మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతి పట్ల శాసనమండలి ఛైర్మన్ ఎన్. ఎండీ. ఫరూఖ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసింద న్నారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ ప్రకటన జారీచేశారు. 'మా ఇద్దరి రాజకీయ ప్రస్థానం ఒకేసారి ప్రారంభమైంది. ఎన్టీఆర్ టిడిపిని స్థాపించినప్పుడు ఆయన పిలుపుమేరకు 1983లో ఆ పార్టీలో చేరాం. ఆనాటి నుంచి నేటి వరకు ముద్దు కృష్ణమనాయుడు తన నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రాభివద్ధిలో తనదైన పాత్ర పోషించారు. శాసనమండలి సమావేశాల్లో అనేక సమస్యలను ఆయన ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ముద్దుకష్ణమనాయుడు హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెదేపా ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, తెలంగాణ తెదేపా నేతలు ఎల్.రమణ, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు, తెలంగాణ కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎన్టీఆర్ కుమారులు హరికష్ణ, రామకష్ణ, సినీనటుడు చలపతిరావు, లక్ష్మీపార్వతి తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

ప్రధాని మోడీ తీరు రాష్ట్ర ప్రజలను వంచన చేసింది



ఎపిసిసి అధ్యక్షుడురఘువీరారెడ్డి


విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రపతి ఉపన్యాసానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడిన తీరు రాష్ట్ర ప్రజలను మరోసారి వంచన చేసిందని ఎపిసిసి అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ సమస్యలను పక్కదోవ పట్టించే కుటిల వ్యూహంతో రాష్ట్రానికి మళ్లీ ఒక రాజకీయ అబద్ధపు ఆరోపణలు ఉపన్యాసం ఇచ్చారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రజలకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా దగా చేశారు. 2014 ఎన్నికల్లో నరేంద్రమోడీ ఇలాంటి అబద్దాలనే చెప్పి ఓట్లు దండుకున్నారు. తిరుపతి వెంకన్న దేవుని సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ ఇచ్చిన దానికన్నా ఎక్కువే ఇస్తామని చెప్పలేదా? ప్రత్యేక హోదా అయిదేళ్లు కాదు పదేళ్లు ఇస్తామని ఇదే మోడీ చెప్పలేదా? ఢిల్లీని మించిన రాజధానిని నిర్మించి ఇస్తామని ఇదే మోడీ చెప్పలేదా? హోదా వెంకయ్యే సాధిం చారని మోడీ చెప్పలేదా? అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లు గడుస్తున్నా మోడీ – బాబుల జోడి ఎపి ప్రజలకు అన్యాయం చేశారని ఆందోళన ఎందుతుంటే ఏ విధంగా న్యాయం చేస్తారో ప్రధానిగా రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ పైన రాజకీయ ఆరోపణలు చేసి తప్పించు కోవడం నరేంద్రమోడీ వంచనలో, మోసంలో భాగం తప్ప మరేమీకాదని మరోసారి రుజువైందన్నారు. ప్రధాని మోడీ ఉపన్యాసం మొదలు పెట్టగానే తెలుగుదేశం ఎంపీలు నాటకం ఆపి తోకముడిచారన్నారు. ప్రతిపక్ష ఎంపీలు బాయ్‌కాట్ పేరిట పలాయనం చిత్తగించి పారిపోయారన్నారు. టిడిపి, వైకాపాల పోరాటం నాటకమని, బూటకమని తెలిపోయిందన్నారు.

రాష్ట్ర బంద్‌కు మహిళా సంఘాల మద్దతు




విజయవాడ, సూర్య బ్యూరో : మహిళల అభ్యున్నతి, మహిళా సాధికారత, మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావన లేని కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని నగర మహిళా సమాఖ్య, ఐద్వా, పి.ఒ.డబ్ల్యూ నేతలు మహిళా లోకాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొండిచెయ్యి చూపిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 8వ తేదీన జరుగు రాష్ట్ర బంద్‌కు మహిళా సంఘాలు మద్ధతు ఇస్తున్నాయని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో ఎ.పి.కి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పిన కేంద్రం ఈ ఊసే మరిచిందని, విభజన హామీలను సైతం అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిట్టనిలువునా ముంచిందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం పై మహిళా లోకం గళం విప్పాలని, స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నగర మహిళా సమాఖ్య అధ్యక్షులు ఓర్సు భారతి, ప్రధానకార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఐద్వా నాయకులు ఎం.శ్రీదేవి, కాజా సరోజ, పిఒడబ్ల్యూ నాయకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం క్యాలండర్ ఆవిష్కరణ



తాండూర్ రూరల్, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుదవారం సమాచార హక్కు చట్టం క్యాలం డర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాధికారి వెంకటయ్య, సీఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో సంపూర్ణ సమాచారాన్ని పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని అన్నారు. సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై సమాచార హక్కు చట్టం క్రింద చర్యలు తీసుకోవచ్చని అన్నారు. ఈ సమాచారం హక్కు చట్టం 2005 అమలు చేశారనిఅన్నారు. దీని ముఖ్య ఉద్దేశం ఎవరైనా అర్జీ దారుడు కోరిన సమాచారం నెల లోపు ఇచ్చే విధంగా చట్టాన్ని అమలు చేశారని ఈ చట్టం తమర కావాల్సిన సమాచారాన్ని పొంద వచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని వినియోగించు కోవాలని అన్నారు.


దొనకొండలో పరిశ్రమల స్థాపన : ఎన్డీర్ గ్రూప్



అమరావతి, మేజర్‌న్యూస్ : దొన కొండలో రూ 400 కోట్లతో పరిశ్రమలు స్థాపించ డానికి ఎన్డీఆర్ గ్రూప్ ముం దు కొచ్చింది. కంపెనీ ప్రతి నిధులు నేటి సాయంత్రం సచివాలయంలో మంత్రి శిద్ధా రాఘవ రావును కలిసి పరిశ్ర మలను స్థాపించడానికి 400 ఎకరాలు భూమి అవసరం అవుతుందని తెలియ జేశారు. అనుమతుల కోసం డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్‌తో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు అనుమతులు ప్రభుత్వం నుంచి త్వరగా తెప్పించడానికి తన వంతు సహాయ, సహకారాలు అందచేస్తానని కంపెనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. దీని వలన ప్రత్యేక్షంగా 250 మందికి, పరోక్షంగా 500 మంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో యడవల్లి నాగరాజా ప్రాజెక్టుకో ఆర్డినేటర్, సీఈవో రవీంద్రనాథ్ రెడ్డి ఉన్నారు.

జగన్‌కు ఇంటిపోరు తప్పటం లేదు


(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : కడప ఎంపీ సీటు నాకే కావాలంటోంది జగన్ సోదరి షర్మిల. ఆ సీటు మాకే ఇవ్వాలంటున్నారు మరోవైపు అవినాష్ రెడ్డి వర్గీయులు. ఫలితంగా ఎటు నిర్ణయం తీసుకోవాలో అర్థం కాని పరిస్థితి. గత ఎన్నికల్లో షర్మిల పోటీ చేస్తే ఎలా ఉండేదో. కానీ ఎక్కడా ఆమె పోటీ చేయలేదు. కానీ ఈ సారి ఆ అవకాశాన్ని వదులుకునేందుకు ఆమె సిద్ధంగా లేదంటున్నారు. ఇప్పుడు అది జగన్ ఇంట్లో చిచ్చు పెడుతుందని తెలుస్తోంది. మరోవైపు శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారం మధ్య గొడవలు ప్రారంభమయ్యాయట. పార్టీలో ముందునుండి ఉన్న నేత తమ్మినేని సీతారం. ఆ తర్వాత వచ్చారు ధర్మాన. కానీ ఇద్దరికి అసలు పొసగడం లేదు. ఫలితంగా ఆ జిల్లా నేతలు రెండు వర్గాలుగా విడిపోయారని తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసించిన నేత ధర్మాన ప్రసాదరావు. తమ్మినేని సీతారం, రెడ్డి శాంతి వంటి నేతలకూ సొంత బలం, బలగం ఉన్నాయి. కానీ ఆముదాల వలస, పాతపట్నం మినహా మిగతా నియోజకవర్గాల్లో తన అనుచరులనే ఇంఛార్జ్‌లుగా పెట్టారు ధర్మాన. తమ్మినేని, రెడ్డి శాంతి నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోలేక పోతున్నారాయన. జిల్లాలో బలమైన కళింగ, కాపు సామాజిక వర్గాలకు చెందిన సీతారాం, రెడ్డిశాంతిలు ఒక వర్గంగా ఏర్పడటం ధర్మానకు ఇబ్బందిగా మారింది. ఫలితంగా ధర్మాన అనుచరులకు ఆయన చెక్ పెడుతున్నారు. టెక్కలి, పలాసలో నేతల గొడవలు ఎక్కువయ్యాయి. ఫలితంగా నేతలను పక్కన పెడుతున్నారు. గతంలో ఇలానే ఎవరికి వారే నేతలు వివాదాలతో పార్టీ పరువును బజారుకీడ్చారు. ఈ సారి అదే పరిస్థితి అయితే.. గెలువు అంత తేలిక కాదన్నది నిజం.



భూములిచ్చిన రైతులకు వసతులకు కృషి

- 30 ప్రసిద్ధిచెందిన ఇన్‌స్టిట్యూషన్స్‌కు స్థలాలు
- ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూముల రైతులకు ప్లాట్స్
- మునిసిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ

అమరావతి, సూర్య బ్యూరో : అమరావతి రాజధానిలో రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ కింద భూములు సేకరించేటప్పుడే మూడు సంవత్సరాలలో మౌలిక వసతులు పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. బుధవారం అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న రోడ్ల పురోగతిపై అధికారులతో కలసి పరిశీలించిన అనంతరం వెలగపూడి ఎన్‌సిసి క్యాంపులో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ ఉదయం ఎన్8, ఎన్10, రోడ్ల పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించడం జరిగిందన్నారు. రోడ్లు పూర్తి అయిన వెంటనే బ్రిడ్జిల నిర్మాణం కూడా జరగటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎన్ 10 రోడ్డు పొడవు 16.3 కిలోమీటర్లుతో ఎన్8 13.8 కిలోమీటర్లలో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్లాట్‌లలో కూడా రోడ్లు వేయాల్సి వుందని ఇవి మొత్తం కలుపుకుంటే అమరావతి రాజధానిలో 1,006 కిలోమీటర్ల లో రోడ్డు నిర్మాణాలు 29 గ్రామాలలో 13 ప్యాకేజీలలో చేయాల్సి వుండగా 10 ప్యాకేజీలలో పనులు చేస్తున్నామన్నారు. మిగిలిన పనులు త్వరలోనే టెండర్లు అవుతాయని, అమరావతి రాజధాని 217 చదరపు కిలోమీటర్లు నిర్మాణంలో చేస్తున్నామని, దీనికి సంబంధించి రైతుల దగ్గర నుంచి ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూముల రైతులకు ప్లాట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.




అమరావతి రాజధానిలో ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా 2018 డిసెంబరు నాటికి రోడ్లు, డ్రైనేజి, కేబుల్ వైర్లు తదితరమైన మౌలిక వసతులు పూర్తవుతాయన్నారు. సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్ కి అనుగుణంగా 320 కిలోమీటర్లలలో రాజధానిలో రోడ్లు నిర్మాణం చేయ నున్నామన్నారు. ఇందులో మేజర్ ఆర్టీరియల్ రోడ్లు 60 అడుగుల వెడల్పుతో , సీడ్ యాక్సిస్ రోడ్లు 60 అడుగుల వెడల్పుతో, సబ్ ఆర్టీరియల్ రోడ్లు 50 అడుగుల వెడల్పుతో (ఇందులో బిఆర్‌టియస్ కూడా వుంటుందన్నారు), 25 మీటర్ల వెడల్పుతో కనెక్టివ్ రోడ్లు వుంటాయన్నారు. మొత్తంగా అమరావతి రాజధానిలో 34 రోడ్లు, 320 కిలోమీటర్లతో వన్ బై వన్ కిలోమీటరుతో ఈ రోడ్లు వుంటాయన్నారు. తూర్పునుంచి పడమరకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణమునకు 18 రోడ్లు నిలువుగా డిజైను చేసి నిర్మిస్తున్నామన్నారు. 24 రోడ్లకు సంబంధించి టెండర్లు పూర్తయి పనులు వేగంగా జరుగుతున్నాయని మిగతా 10 రోడ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వచ్చే నెల మొదటి వారంలోపు పూర్తిచేస్తామన్నారు. అమరావతి రాజధానిలో దేశంలోనే ప్రసిద్ది చెందిన ఎస్ ఆర్‌ఎమ్, విట్ లాంటి సంస్థలకు తోడు బుధవారం అమృత విశ్వ విద్యాలయంకు శంకుస్థాపన జరిగిందన్నారు. అమరావతి రాజధానిలో మొత్తం 30 ప్రసిద్ది చెందిన ఇనిస్టిట్యూషన్స్‌కు స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాజధాని నగరంలో అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించిన నమూనా లను నార్మన్ పోస్టర్స్ సంస్థ వచ్చే నెలలో పూర్తి నమూనాలు ఇవ్వనుందని ఇచ్చిన వెంటనే టెండర్స్‌కు వెళ్లి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అధికారులకు సంబంధించి 3,400 క్వార్టర్స్ పనులు గ్రౌండింగ్ జరిగి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే ఆ నిర్మాణాలకు శ్లాబ్స్ వేయనున్నామన్నారు. అమరావతి రాజధానిలో జరుగుతున్న పనుల వురోగతిని సీఆర్‌డీఏ అధికారులు మరియు ఎడిసి అధికారులు వారానికి 3 రోజులు సందర్శిం చాలని, మూడవసారి అధికారులతో పనుల వురోగతిలో నేను పరిశీలిస్తా నన్నారు.

ముద్దుకృష్ణమ నాయుడు మృతి తీరని లోటు

మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడి అకాల మృతికి సంతాపం తెలియ జేస్తున్నానని, ఆయనతో నాకు గత కొన్ని సంవత్సరాలుగా మంచి అనుబంధం వుందని తెలిపారు. అనాడు స్వర్గీయ ఎన్‌టి రామారావు పిలువుతో రాజకీ యాలలోకి వచ్చిన ముద్దు కృష్ణమ నాయుడు 6 సార్లు ఎమ్మెల్యేగా, అటవీ, విద్యా శాఖల మంత్రిగా పనిచేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుతున్నానని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారన్నారు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే
ఆందోళన మరింత తీవ్రతరం

జె.ఎ.సీ చైర్మన్ ఆశోక్‌బాబు




విజయవాడ, సూర్య బ్యూరో : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత తీవ్రతరం చేయడంతో పాటు, కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వునరుద్దరించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని ఉద్యోగ సంఘాల జెఏసీ చైర్మన్ పి.ఆశోక్‌బాబు తెలిపారు. సిపియస్ రద్దుపై చేపట్టనున్న మహా ధర్నా, ఉద్యోగుల డిమాండ్లపై బుధవారం విజయవాడలోని ఎ.పి.ఎన్.జి.వో ఆసోసి యేషన్ రాష్ట్ర కార్యాలయం నందు ఉద్యోగ సంఘాల జెఏసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ అనంతరం మీడియా ప్రతినిధులతో పి.ఆశోక్‌బాబు మాట్లాడుతూ సిపియస్ విధానం రద్దుపై గతంలో మండల స్థాయిలో ధర్నాలను నిర్వహిం-ామని, 10న ఉ.10 గంటల నుండి మ.2 గంటల వరకు 13 జిల్లాల జిల్లా కేంద్రాలలో ధర్నా కార్యక్రమం పెద్దఎత్తున చేపడతున్నామన్నారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్ ఉద్యోగులకు తీవ్రమైన నిరాశను కలిగించిందని, గతంలో ఇన్‌కంటాక్స్ చెల్లింపులో ఉద్యోగులకు శ్లాబ్ రేటు పెంచడం జరిగేదని అందుకు విరుద్ధంగా ఈసారి బడ్జెట్‌లో శ్లాబ్ రేటు పెంచకపోగా అదనపు భారం ఉద్యోగులపై వేయడం దారుణమైన విషయమన్నారు. సిపియస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.యం. దాస్ మాట్లాడుతూ 2004 నుండి ఇప్పటివరకు రిటైర్ అయిన వారు, మరణించిన ఉద్యోగులున్నారని వారి కుటుంబ సభ్యు లకు పెన్షన్ పొందే సౌకర్యం లేక పోవడం వల్ల వీధిన పడ్డారన్నారు. సమా వేశంలో ఎ.పి.జె.ఎ.సీ వైస్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ఎన్ చంద్రశేఖరరెడ్డి, కోచైర్మన్ యు కుళ్ళాయప్ప, కార్యదర్శి ఎ.వి.నరసింహారావు, ఉపాధ్యక్షులు కె.కె.వి భాస్కర రావు, మహిళా ప్రతినిధులు పి.వి.ఎల్.ఎస్ రత్న, ఎం.రాజ్యలకి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమైక్య జనరల్ సెక్రటరీ డి.ఎ.ఎస్.వి ప్రసాద్, ఎ.పి.టి.ఎఫ్. రాష్ట్ర ఆధ్యక్షులు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి పి. పాండు రంగా వరప్రసాద్, ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, ఎస్టీయూ ప్రెసిడెంట్ సి.హెచ్ జోసఫ్‌సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బెల్ట్ షాపు మాటే వినిపించరాదు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్


అమరావతి, సూర్యబ్యూరో : రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపుల మాటే వినబ కూడదని, ప్రభుత్వ హెచ్చరికలు పెడచెవినపెట్టి షాపులు నిర్వహించే వారిపైనా, వారికి సహకరించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. బెల్ట్ షాపుల నిర్వహణకు మద్యం సరఫరా చేసే మద్యం షాపుల యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. అవసరమైతే ఆయా షాపుల లైసెన్సులను రద్దుచేయాలని సీఎస్ ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్రంలో బెల్ట్ షాపుల నిరోధంపై తీసుకుంటున్న చర్యల గురించి ఎక్సైజ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ముందుగా బెల్ట్ షాపుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి డి. సాంబశివ రావు సీఎస్‌కు వివరించారు. గతేడాది జులై 18 తేదీన రాష్ట్ర మంత్రి మండలి బెల్ట్ షాపులు మూసివేయాలని నిర్ణయించిన నాటి నుంచి నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 8,827 కేసులు నమోదు చేశా మన్నారు. 9,192 మందిని అరెస్టు చేయగా, 331 వాహనాలను సీజ్ చేశా మన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసినట్లు గుర్తించిన 265 మద్యం షాపులను మూసి వేయించామన్నారు. పరిష్కార వేదిక 1100 ద్వారా 7,649 ఫిర్యాదులు రాగా, 7,641 పరిష్కారాలు చూపామన్నారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న టోల్ ఫ్రీ కంట్రోల్ నెంబర్ కు వస్తున్న ఫిర్యాదులకు పరిష్కారాలు చూవుతున్నామన్నారు. సీఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో బెల్ట్ షాపులను సమూలంగా నిర్మూలించాలన్నారు. ఎక్కడా బెల్ట్ షాప్ మాట వినబడకూడదన్నారు. ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, ఎక్కడయినా బెల్ట్ షాపు నిర్వహిస్తే, సదరు నిర్వాహకుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే షాపులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆయా షాపుల యజమానులపై కేసులు నమోదు చేయాలని, అవసరమనుకుంటే షాపుల లైసెన్సులు రద్దుచేయా లన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణలో ఎక్సైజ్ సిబ్బంది పాత్ర ఉంటే, వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాలను ఎప్పటికప్పుడు వేలం వేయించి, విక్రయించాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ వేలం నిర్వహించా లన్నారు. కేసులు నమోదు చేయడంతో పాటు ఛార్జిషీట్లు దాఖలు చేయాల న్నారు. కేవలం ఛార్జిషీట్లు దాఖలు చేయడంతోనే సరిపెట్టకుండా, నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్ష్యాలు కూడా చూపాలన్నారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రచారం చేయాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ లక్ష్మీనసింహం, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కె.వేంకటేశ్వరరావు, అడిషనల్ డైరెక్టర్ జనరల్ నరేష్ కమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


ముద్దు కృష్ణమనాయుడి మృతి పట్ల ఎపిఎంఎఫ్ సంతాపం



అమరావతి, సూర్య బ్యూరో : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, యం.ఎల్.సి గాలి ముద్దు కృష్ణమ నాయుడు అకాల మతి పట్ల ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఢిల్లీ బాబు రెడ్డి తన సంతాపాన్ని తెలిపారు ఆయన మాట్లాడుతూ ఆరు పర్యాయాలు శాసన సభ కు ప్రాతినిధ్యం వహించడమే కాక మంత్రిగా పనిచేసిన ఘనత ఆయన సొంతం అన్నారు. అధ్యాపక వ త్తి నుండి ఎన్టీ రామారావు పిలువు మేరకు రాజకీయాల లోకి ప్రేవేసించి చిత్తూరు జిల్లా వుత్తూరు నుంచి శాసన సభకు ఎన్నికైన ఆయన నాటి నుండి నేటి వరకు ప్రజాజీవితంలో ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని అలాంటి వారు నేడు మా మధ్యలో లేడు అన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు ఈ సందర్భంగా వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. యూనియన్ నాయకులు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామకష్ణ, అన్నంగి శ్రీనివాస్, ఇస్కా రాజేష్ బాబు, వల్లూరు ప్రసాద్ కుమార్, అరిగెల శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

బంద్ విరమించండి, పార్లమెంట్‌లో కలసి రండి

వామపక్షాలకు ప్రభుత్వం తరపున అచ్చెన్నాయుడు, ఆనందబాబు వినతి




అమరావతి, సూర్య బ్యూరో : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని వామ పక్షాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలువుపై వునరాలోచన చేసి బంద్ విరమించాలని ప్రభుత్వం తరవున మంత్రులు కింజరావు అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. సమస్య న్యాయమైనదేనని, అయితే ఈ అంశంపై పార్లమెంటులో కలసిరావాలని కోరారు. సచివాలయం 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో బుధవారం మధ్యాహ్నం వారు మీడియాతో మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం మూడున్నరేళ్ల చంటిబిడ్డ అని, చిన్నపిల్లలను ఎలా చూసుకుంటారో అలా రాష్ట్రాన్ని చూసుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టి ఒక స్థాయికి తీసుకు వచ్చారని చెప్పారు. ఎన్డీఏలో తాము భాగస్వాములైనప్పటికీ రాష్ట్రాభివద్ధి కోసం సీఎం ప్రధాన మంత్రిని, కేంద్ర మంత్రులను కలుస్తూ నిరంతరం శ్రమిస్తూ మిత్రధర్మాన్ని పాటిస్తున్నారని చెప్పారు. హామీలు అమలు విషయంలో, కేంద్ర బడ్జెట్ కేటాయింవులలో ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. ఢిల్లీలో తమ ఎంపీలతో ఆందోళనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌వల్ల రాష్ట్రానికి నష్టమేకాకుండా, ప్రజలు ఇబ్బందులుపడతారని, వామపక్షాలు, ఇతర పార్టీ లు బంద్‌పై వునరాలోచనచేసి విరమించాలని అచ్చెన్నాయుడు కోరారు. ఎక్కడ అన్యాయం జరిగిందో అదే పార్లమెంట్ వద్ద జాతీయస్థాయిలో ప్రతిబింభించే విధంగా ఆందోళన చేపట్టాలని మంత్రి ఆనందబాబు అన్నారు. ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏపీలో నిరసన తెలియజేసి ఢిల్లీలో ఆందోళన చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

కూరగాయల రైతులకు ఊరట

స్వల్పంగా పెరిగిన కూరగాయలు : మంత్రి దేవినేని

విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడ రైతు బజారుల్లో స్వల్పంగా కూర గాయలు ధరలు పెరిగాయి. జిల్లా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చొరవ తో రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో ఈ ధరలను పెంచడం జరిగిందని రైతుబజారు ఎస్టేటు ఆఫీసర్లు తెలిపారు. పొరుగు జిల్లాల్లో టమాటా ధర గిట్టు బాటు కాకపోవడంతో రైతులు కడువు రగలిపోయి రోడ్లమీద పోసిన సంఘట నను కృష్ణా జిల్లాలో వునరావతం కాకూడదని మంత్రి సూచనల మేరకు టమాటా ధరను నిలకడగా కొనసాగిస్తున్నారు. గతేడాది ఇదే రోజుల్లో టమాటా కిలో కేవలం రూ.6 నుండి 7లు మ్రామే కలిగింది. ఈ యేడాది మాటా దిగుబడి ఇబ్బండి ముబ్బడిగా వుండటంతో రైతుల్లో భయాందోళనలు రేగాయి. కాగా ధరలు నికరంగా వుంచడం రైతులను ఆదుకోవాలనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేయ డంతో కూరగాయల రైతులు ఊరట చెందారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లోని తోట్లవల్లూరు, ఉయ్యూరు, జి. కొండూరు, చెరువు మాదారం, నంది గామ, ఇంకొల్లు, అవనిగడ్డ నూజివీడు తదితర ప్రాంతాల్లో మాటాలు వందలాది ఎకరాల్లో పండిస్తున్నారు. గత నెలలో వంకాయి కిలో రూ. 7లకే అమ్మడంతో రైతుల్లో గుబులు రేగింది. విషయం తెలుసుకున్న ప్రజా ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగు శాఖాధి కారులు రైతు బజారుల్లో వంకాయి కిలో 10 రూపాయిలు వుండే విధంగా తగిన చర్యలు చేపట్టారు. బెండకాయ కిలో రూ. 17 నుండి 20కి చేరుకుంది. పచ్చిమిర్చి ధర కిలో రూ. 12 నుండి 14కు చేరుకుంది. బీరకాయ రూ. 26 నుండి 28కి పెరిగింది. క్యాలిఫ్లవరు రూ. 15, 20లు అమ్మినవల్లా పంట దిగుబడి పెరగడం తో వాటి ధర పడిపోయి నేడు కేవలం రూ. 8లకే వినియోగదారునికి అందు బాటులోకి వచ్చాయి. క్యాబేజీ రూ.8, క్యారేటు రూ.18లు ధరలు నికరంగా వున్నాయి. నాటు చిక్కుడు కిలో రూ. 12 నుండి రూ. 16కి, హైబ్రీడు చిక్కుడు కిలో రూ. 12 నుండి రూ. 16కు ధరలు పెరిగాయి. బంగాళ



దుంప మాత్రం గత నాలుగైదు నెలల నుంచి నికరంగా రూ. 13, రూ. 14లు మ్రామే ధర పలికి పేదవారికి అందుబాటులో వున్నాయి. బీటురూట్ రూ. 12కి ధర తగ్గి రూ. 10లకే అమ్ముతున్నారు. కీరదోస గత నెలల నుంచి కిలో రూ. 20లే నికరంగా వుంది. ఆకుకూరలు మాత్రం కట్ట కేవలం రూ. 1.75పైసలు అమ్ముతున్నారు.మహారాష్ట్రలో పండుతున్న ఉల్లి దిగు బడి అధికం కావడంతో రూ. 32లు అమ్మి నటువంటి ఉల్లిపాయలు ఘాటు తగ్గి నేడు కేవలం కిలో రూ. 25లకే లభిస్తున్నాయి. అధికారులు ధరల విషయంలో సమన్యాయం చేయ డంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి సోమిరెడ్డి చొరవతో
మూడు రోజుల్లోనే సీఎం సహాయనిధి



విజయవాడ, సూర్య బ్యూరో : బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి వైద్యం సాయం కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ తో రికార్డు స్థాయిలో మూడు రోజుల్లో సీఎం సహాయ నిధి నుంచి రూ. 8 లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. దీనికి సంబంధించి ప్రభుత్వ మంజూరు పత్రాన్ని(ఎల్.ఓ.సీ) బుధవారం చిన్నారి కుటుంబ సభ్యు లకు సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందజేశారు. తోటపల్లి గూడూరు మండలం పోట్లవూడికి చెందిన చిన్నారి కాగొల్లు రేష్మీ శ్రుతి(9) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తల్లిదండ్రులు పలు ఆసుపత్రులు తిరిగిన అనంతరం చెన్నైలోని గ్లోబల్ ట్రస్టు హాస్పిటల్‌కు వెళ్లారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు బోన్ మ్యారో మార్పిడి చేయాలని, రూ.20 లక్ష లు ఖర్చువుతుందని అంచనా వేశారు. అంతస్తోమత లేని పేదకుటుంబం కావ డంతో పోట్లవూడి టీడీపీ నేతలు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి సహకారంతో రాష్ట్రమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన వెంటనే సంబంధిత ఫైలును స్వయంగా సీఎం దగ్గరకు తీసుకెళ్లి కేవలం మూడు పనిదినాల్లో సహాయనిధి నుంచి సాయం రూ.8 లక్షలు మంజూరు చేయిం చారు. అడిగిన వెంటనే సాయం చేయడంపై మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన రెడ్డి తోపాటు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి చిన్నారి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోనే కాక దేశంలో ఏ ఆస్పత్రిలో చికిత్స పొందినా ఆర్థికసాయం మంజూరు చేస్తూ చంద్ర బాబు పేదకుటుంబాలకు అండగా నిలుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా
సూర్యపత్రిక డైరెక్టర్ కూనిరెడ్డి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం (ఎపి జెఎఫ్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరిగా ప్రముఖ సిని నిర్మాత, సూర్య పత్రిక డైరెక్టర్ కూనిరెడ్డి శ్రీనివాస్ ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణాం జ నేయులు, మారేళ్ళ వంశీ కృష్ణలు బుధవారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలిపారు. అదే విధంగా జిల్లా కోశాధికారిగా పైల శ్రీనివాస్‌ను, జిల్లా కమిటి సభ్యులుగా బుద్దన శ్రీకాంత్, యర్రగోగుల దుర్గా ప్రసాద్, కొప్పిశెట్టి ప్రసాద్, చింతకాయల దొరబాబును నియమిస్తున్నట్లు నియామక పత్రం విడుదల చేశారు. ఈ సందర్బంగా ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎన్నికైన కూనిరెడ్డి శ్రీనివాస్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాల రావు, నరసాపురం ఎంపి గోకరాజు గంగ రాజు, జర్నలిస్టుఫోరం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాంజనేయులు, కార్యదర్శి మారేళ్ళ వంశీకృష్ణ, జిల్లా అధ్యక్షులు వేగిరాజు సీతారామరాజు, కె.మోహన్, గౌరవ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు, తాడేపల్లిగూడెం శాఖ అధ్యక్షులు బండి రామస్వామి, ఏపిజెఏఫ్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : కూనిరెడ్డి శ్రీనివాస్

ఈ సందర్బంగా కూనిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎన్నుకోవడం పట్ల ఏపిజెఏఫ్ నాయకులకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఏపిజెఏఫ్ మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేయాడానికి కృషి చేస్తానని కూనిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

ముద్దుకృష్ణమ నాయుడు మృతి జీర్ణించుకోలేనిది

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

(వెలగవూడి సూర్య ప్రధాన ప్రతినిధి) : మాజీ మంత్రి గాలి ముద్దుకష్ణమ నాయుడు మృతి జీర్ణించుకోలేనిదని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా రామచంద్రవురం మండలం వెంకట్రామ వురంలో ప్రజల సందర్శనార్థం ఉంచిన ముద్దుకష్ణమ భౌతికకాయానికి చంద్ర బాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలి పారు. చివరి రోజుల్లో ఆయన అనారోగ్యంతో బాధపడ్డారని, ఏ మాత్రం సమయం దొరికినా ప్రజలతో మమేకమయ్యేవారని సీఎం అన్నారు. అభివృద్ధి కార్య క్రమాల్లో ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపించేవారంటూ ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

పార్థీవదేహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు


చిత్తూరు జిల్లాకు ఎనలేని సేవ చేసిన వ్యక్తి, ఒక ఆశయం కోసం పని చేసే సహచరుని కోల్పోవడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముదుకృష్ణమ నాయుడు మరణవార్త తెలిసిన వెంటనే తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుని ముఖ్యమంత్రి చంద్ర బాబు బుధవారం మధ్యాహ్నం హుటాహుటిన రామచంద్రావురం మండలం, వెంకట్రామవురం చేరుకొని దివంగత ఎమ్మెల్సీ గాలి ముదుకృష్ణమ నాయుడు పార్థివ దేహంపై వుష్పగుచ్చం ఉంచి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ముద్దుకష్ణమ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గాలి ముద్దుకష్ణమ నాయుడు చనిపోవడం జీర్ణించుకోలేకపోతున్నానని, నమ్మశక్యంగా లేదన్నారు. సంక్రాంతికి ముందు తనను కలిసి దుబాయ్ వేళుతున్నానని సంక్రాంతి రోజు కలవ లేనని తిరిగొచ్చాక మీతో మాట్లాడతానని అన్నారని.. కానీ విధి ఆ అవకాశం లేకుండా చేసిందన్నారు. గత మూడు రోజుల ముందు గ్రామాల్లో తిరిగిన వ్యక్తికి జ్వరం రావడంతో హైదరాబాద్ వచ్చి చెకప్ చేసుకొని ఇంటికి వెళ్లారని



తెలిపారు. చిత్తశుద్ధి, క్రమశిక్షణ, ప్రజల కోసం బ్రతికే వ్యక్తి.. సమయం దొరికితే పది మందికి సేవ చేయాలనే ఆలోచన వున్న వ్యక్తిగా ముద్దుకష్ణమ నాయుడు జిల్లాలో తనదైన ముద్ర తెచ్చుకున్నారని అన్నారు. ప్రజల ఆశయం కోసం పనిచేసే వ్యక్తి, సహచరుని కోల్పోవడం జిల్లాకు ఎనలేని సేవలందించిన వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, బీఎన్ రాజసింహులు, శాసనసభ్యులు నారాయణ స్వామి, తలారి ఆదిత్య, డి.కె.సత్యప్రభ, సుగుణమ్మ, జిల్లా పరిషత్ చైర్మన్ గీర్వాణి, మేయర్ కటారి అనూరాధ, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, జేసి గిరీషా, జేసి-2 చంద్రమౌళి, ఎస్పీలు రాజశేఖర్‌బాబు, అభిషేక్ మహంతి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జిల్లా పరిషత్ సిఇఓ తుకారాం, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, తదితరులు ఎమ్మెల్సీ గాలి ముద్దుక ష?మ నాయుడు పార్థీవ దేహానికి నివాళులు అర్పించిన వారిలో వున్నారు.

దళితుల్లో ఆత్మ విశ్వాసం పెంచాలి

'దళిత తేజం - తెలుగు దేశం' వర్క్ షాప్‌లో మంత్రి శిద్ధా



ఒంగోలు, మేజర్‌న్యూస్ : దళితుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ప్రభుత్వంపై దళితు ల్లో విశ్వాసం పెరుగుతోందని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవ రావు అన్నారు. బుధవారం నగరంలోని పాటిబండ్ల అంజనీ గోపాలకృష్ణ కల్యాణ మండలంలో ఏర్పాటు చేసిన 'దళిత తేజం – తెలుగు దేశం' ఒక్క రోజు వర్క్ షాపులో పార్టీ జిల్లా అధ్యక్షులు దామచర్లతో పాటు మంత్రి శిద్ధా రాఘవరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ నాలుగేళ్ల టిడిపి ప్రభుత్వంలో దళితుల కోసం ప్రభుత్వం ఎలాంటి పథకాలు, కార్యక్రమాలు చేపట్టిందో వారికి వివరించాలన్నారు. ప్రతీ దళిత వాడకు దళిత నేతలు పార్టీ శ్రేణులు వెళ్లాల్సి ఉందన్నారు. వారిలో నమ్మకం పెంచి ప్రభుత్వ ఆలోచినలు, విధానాలు, పాలన శైలిని వివరించా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'దళిత తేజం – తెలుగు దేశం' కార్యక్రమ లక్ష్యాలను నిర్ణీత సమయంలో చేరుకునేందుకు ప్రతీ కార్యకర్త ప్రత్యేక కృషి చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు దామ చర్ల జనార్దన్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, కొండపి ఎమ్మెల్యేలు పాలపర్తి డేవిడ్ రాజు, డోలా బాల వీరాంజనేయస్వామి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్ విజయ్ కుమార్, మార్కాపురం ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి, లీడ్ క్యాప్ట్ ఏరిక్షన్ బాబు, జిల్లాతో తెదేపా దళిత నేతలు, ముఖ్య నేతలు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక గుణదల మేరీ మాత





గుణదల కొండపై మేరిమాత చర్చికి 70వ వార్షికోత్సవ వేడుకలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. తమిళనాడులోని వేళంకణి మాత తరువాత భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకునే చర్చిల్లో గుణదల కొండ రెండోది కావటం విశేషం. వాస్తవానికి గుణదలమాత ఆలయం క్రైస్తవ పుణ్యక్షేత్రం అయినప్పటికీ అన్ని మతాలవారినీ అక్కున చేర్చుకుని మత సామరస్యానికి ప్రతీకగా భాసిల్లుతోంది. ఇక్కడకు వచ్చే యాత్రికులు కొండపైన, గుణదలమాత పుణ్యక్షేత్రంలో కొబ్బరి కాయలు కొట్టటం, తలనీలాలు సమర్పించుకోవటం, పసిపిల్లలకు చర్చి ఫాదర్లతో పేర్లు పెట్టించుకోవటం, బిడ్డలు కలగని తల్లిదండ్రులు కొండపై చెట్లకు ఊయలలు కట్టటం, కొత్త వాహనాలకు ఫాదర్స్‌తో పరిశుద్ధ జలంతో ప్రార్ధనలు చేయించి ప్రత్యేక ఆశీర్వదింపచేయించుకోవటం ఇక్కడ నిత్యకృత్యంగా జరుగుతూ ఉంటుంది.

రేపటి నుంచి మేరీమాత ఉత్సవాలు

గుణదల పుణ్యక్షేత్రంలో మూడురోజుల పాటు జరిగే మేరీమాత ఉత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 7 గంటలకు విజయవాడ కథోలిక పీఠం పాలనాధికారి బిషప్ గోవింద్ జోజి, పుణ్యక్షేత్ర గురువులు తొలి సమిష్టి దివ్య బలి పూజ చేయడంతో ఉత్సవాలు మొదలవుతాయి. తిరునాళ్లకు లక్షలాదిగా హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఉత్సవ కమిటీ



అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మేరీమాత ఆలయాన్ని రంగు రంగుల తోరణాలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

దక్షిణ భారతదేశంలో నాగపట్నం వేళాంగణీమాత పుణ్య క్షేత్రం తరువాత రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా గుణదలమాత పుణ్యక్షేత్రం విరాజిల్లుతొంది. ఈ క్షేత్రానికి దేశ విదేశాల నుండి భక్తులు వస్తుంటారు. రాష్ట్రం నుంచి కూడా కులమతాలకు అతీతంగా వచ్చి తల్లిదీవెనలు పొందు కుంటారు. ఫ్రాన్సులోని లూర్థు నగరం సహజమైన గుహలో ఉన్న మేరీమాత చర్చ్‌ను పోలినట్టుగా విజయవాడ శివారులోని గుణదలలో కూడా సహజమైన గుహలో మేరీ మాత విగ్రహం ఉన్నందున ఈ క్షేత్రం ప్రసిద్ధమైంది.

ఈ ఆలయ నిర్మాణం వెనుక

ఫాదర్ హ్యూజెస్ పెజ్జోని అనాథలను ఆదుకునేందుకు తొలుత . 1923లో ఆ కొండ చుట్టూ స్థలాన్ని సేకరించి, గుణదల కొండపై షెల్టర్ ఏర్పాటు చేశారు ఆ తరువాత ఫాదర్ ఆర్లాటి అభివృద్ధిని కొనసాగిం చారు.

అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 1924లో గుణదలలో సెయింట్ జోసఫ్స్ ఇనిస్టిట్యూట్ పేరున ఒక అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. దానికి రెక్టర్‌గా ఇటలీకి చెందిన ఫాదర్ పి. అర్లాటి నియుక్తులయ్యారు. ఆయన అదే సంవత్సరం గుణదల కొండపై చిన్న మేరీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో మేరీమాత గుడికి అంకురార్పణ జరిగింది. గుడి అంకురార్పణ జరిగిన నాటి నుంచి అనాథబాలలు, క్రైస్తవ మత కన్యలు, కథోలికులు (క్యాథలిక్స్) ప్రతి ఏటా ఫిబ్రవరిలో అక్కడ మరియమ్మ (మేరీమాత) ఉత్సవాలు నిర్వహించు కునేవారు. 1933లో ఫాదర్ అర్లాటి ఆఎధ్వర్యంలోనే ఈ కొండ శిఖరాగ్రాన ఓ శిలువ ప్రతిష్ఠితమైంది. 1947లో విజయవాడ నగరంలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన కథోలికులు, ఫాదర్ అర్లాటి ఆధ్వ ర్యంలో కొండపై ఆరోగ్యమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి, గుహ ప్రాంగణంలో విశాలమైన దివ్య బలిపీఠాన్ని నిర్మించారు.

1933లో కొండపై సిలువను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఫిబ్రవరి 11న వార్షికోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే తమిళ కేథలిక్‌లు కొందరు వచ్చి సెప్టెంబరులో వార్షికోత్సవాలు నిర్వహించాలని చెప్పారు. అయితే ఈ విధానం కొద్దికాలమే నడిచింది. 1947లో ఫాదర్‌గా వచ్చిన బెట్రోలి ఫిబ్రవరిలోనే వార్షికోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 1948లో కలరా ప్రబలిన కారణాన ఆ ఒక్క సంవత్సరం తప్ప ప్రతిఏటా ఫిబ్రవరి 9 నుంచి మూడు రోజుల పాటు మేరీమాత ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 195లో గుహకు ఇరువైపులా ఆర్చిలను నిర్చించి, శిలువ వరకు మెట్లమార్గం ఏర్పాటు చేశారు. ఈ కాలిబాటలో క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే 14 స్థలాల విశిష్టత వివరించేలా, జపమాల పవిత్రతను తెలుసుకునేలా క్రీస్తు స్వరూపాలతో క్రీస్తు జీవిత ఘట్టాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఈ క్షేత్రం జనాదరణ పొందడంతో 1971లో పూర్తిస్థాయి చర్చి నిర్మితం అయ్యింది. ఉత్సవాలకు ముందు తొమ్మిది రోజుల పాటు నవదిన ప్రార్ధనలు, ఆరాధనలు వైభవంగా నిర్వహిస్తారు. అప్పట్నుంచి వార్షిక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రస్తుతం సిలువ వద్ద దాదాపు ఐదువేల మంది ఒకేసారి ప్రార్ధనలు చేసేందుకు అవకాశం ఉంది. దీన్ని మరింత విస్తరించనున్నారు. ఇక ప్రతి ఏటా ఫిబ్రవరి 9, 10, 11తేదీలలో ఇక్కడ ఘనంగా ఉత్సవాలు జరుగుతాయి. దేశవ్యాప్తంగా దాదావు 13 నుంచి 15 లక్షల మంది భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉన్న క్షేత్రం కనుక ఈసారి మరిన్ని హంగులతో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2017 ఉత్సవాలకు కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల నుంచి భక్తులు హాజరవడానికి సిద్ధపడుతున్నారు.

లూర్ధునగర్‌లో వున్న గుణదలమాత ప్రధాన వుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులు కొండ నడుమున సహజసిద్ధంగా వెలిసిన గుహలో మరియతల్లి (గుణదలమాత) స్వరూపం, శిఖరానవున్న ఏసుక్రీస్తు శిలువను దర్శించుకుని ప్రత్యేకప్రార్ధనలు చేస్తారు. ఉత్సవాల సందర్భంగా గోల్డెన్ జూబిలేరి యన్స్ ఫాదర్స్ దివ్య ప్రసాదాన్ని క్రైస్తవులకు అందజేస్తారు.



బెసిలిక హోదా

మహిమగల మేరిమాత చర్చిని మరింతగా విస్తరించి బెసిలిక హోదా తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని రెక్టర్ ఫాదర్ జయరాజ్ బసిలిక చర్చిగా ఏర్పడాలంటే స్థల చరిత్ర, ఇక్కడి ఆచార వ్యవహారాలు, ఆలయ విస్తీర్ణం, సంప్రదాయ పూజలు అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. గుణదల కొండపై మేరి మాత చర్చికి ఘన చరిత్రే ఉంది. వాటికన్ సిటీకి వెళ్లి అక్కడ నుంచి అనుమతి తీసుకు రావాల్సి ఉంది. బెసిలిక హోదా వస్తే ప్రత్యేక దీవెన ప్రదేశంగా మేరిమాత చర్చి మారుతుందని తెలిపారు. ఈ హోదా రావాలంటే మేరిమాత చర్చిని మరిం త పెంచాలి. పీఠాన్ని విస్తరించాలి. ఇక్కడ ఫాదర్ల సంఖ్యను పరిగణనలోకి తీసు కుని ఆ హోదా ఇస్తారు. బెసిలిక హోదా వచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ హోదాతో విజయవాడకు ఇప్పటికే ఉన్న వుణ్యక్షేత్ర మహిమ మరింతగా విస్తరించనున్నది.

బెసిలిక చర్చిలు ఎక్కడెక్కడ ?

రోమ్‌లో నాలుగు పెద్ద బెసిలిక చర్చిలు ఉంటే భారతదేశంలో 23 ఉన్నాయి. 1946లో మొట్ట మొదటి బెసిలిక చర్చి గోవాలో ఏర్పాటైంది. తమిళనాడులో ఐదు, కర్నాటకలో రెండు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, వుదుచ్చేరిల్లో ఒకటి చొప్పున ఉన్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్ చర్చి 2008 లో గుర్తింపు పొందింది. మిగిలినవి కేరళలో ఉన్నాయి. పోప్ ఆధ్వర్యంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్సీఎం) నిబంధనల మేరకు మేరిమాత చర్చి నడుస్తోంది. దాదావు 20 ఏళ్ల క్రితమే పెద్ద చర్చిగా గుర్తింపు కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అయి తే అప్పట్లో ఆర్చి బిషప్ మారంవూడి జోజి హయాం లో పోప్ ఆదేశాల మేరకు పెద్దభవనం ఏ ర్పాటుకు ప్రత్యేక వెసులు బాటు కల్పించి నప్పటికీ, అనంతరం ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. బిషప్ డాక్టర్ తెలగతోటి రాజారావు నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులు రూపు దిద్దుకుంటున్నాయి.

కనిపించే హిందూ సంప్రదాయాలు

ఇక్కడికి వచ్చిన భక్తులు మైనవు వత్తులు వెలిగిస్తారు. ఇక్కడ హిందూ దేవాలయాల మాదిరిగా కొబ్బరికాయలు కొడతారు, తలనీలాలు ఇచ్చి మొక్కు తీర్చుకుంటారు. చంటి పిల్లలకు అన్నప్రాసనలు, అక్షరాభ్యాసం చేస్తారు. చెట్లకు ఉయ్యాల కట్టి తమ కోరికలు తీరాలని ప్రార్ధిస్తారు. వాహన పూజ చేయిస్తారు. కొండ దిగువున వుణ్యక్షేత్రం ప్రధాన దేవాలయం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ప్రధానంగా బిష్రప్గాసి పాఠశాల ఆవరణలో జరిగే సమిష్టి దివ్యబలి వూజ కార్యక్రమాలకు హాజరవుతారు. తాత్కాలిక మరుగుదొడ్లు, వురుషులు తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఐటిఐ కళాశాల ఆవరణలో ఆహ్లాదం కోసం ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఏలూరు రోడ్డులోని వుణ్యక్షేత్రం ప్రధానద్వారం నుంచి భక్తులు వేళాంగణి క్షేత్రంలో మాదిరి ఇసుక మార్గంలో మోకాళ్లతో మొక్కుబడులు తీర్చుకునేలా ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

మూడు రోజులపాటు రాత్ర పగలు సేవలందించే దిశగా పోలీసులు మూడు షిఫ్టుల్లో డ్యూటీ చేయనున్నారు. ఏలూరు రోడ్డుపై భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. దాదావు 1200 మంది పోలీసు సిబ్బంది, అధికారులు విధులు నిర్వ హించనున్నారు. వుణ్యక్షేత్రంలోని ప్రధానాలయం, బిషప్ ప్రాంగణాల లో ఉచిత వైద్య శిబిరాలను సైతం ఏర్పాటు చేశారు.







దీపికకు లేఖ పంపిన రేఖ



పద్మావతిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బాలీవుడ్ ప్రముఖులంతా దీపికను అభినందనలతో ముంచెత్తుతున్నారు. అమితాబ్ బచ్చన్, రిషి కపూర్, ఆశా పరేఖ్, హేమమాలిని, వహీదా రెహమాన్, నీతూ కపూర్ వంటి వారు ఇప్పటికే దీపికను ఆకాశానికి ఎత్తేయగా.. ఇప్పుడు ఈ జాబితాలో రేఖ కూడా చేరింది. దీపిక అభినయాన్ని అభినందిస్తూ స్వదస్తూరితో రేఖ పంపిన లేఖ దీపికను ఆనంద పారవశ్యంలో ముంచుతోంది. వివాదాలకు రణవీర్, దీపికల అసాధారణమైన అభినయం తోడు కావడంతో 'పద్మావత్' చిత్రం వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. 200 కోట్ల క్లబ్బులో దర్జాగా చొరబడిన ఈ చిత్రం 300 కోట్ల క్లబ్బులో స్థానం కోసం పరుగులు తీస్తోంది!

తేజు స్టార్‌డమ్‌కి పునాదిరాయి

ఇంటెలిజెంట్ డైరెక్టర్ వి.వి.వినాయక్

సూపర్ స్టార్స్‌కి సరిసమానమైన క్రేజ్ కలిగిన దర్శకుల్లో వి.వి.వినాయక్ ఒకరు. 'ఆది'లోనే విశ్వరూపం చూపించి.. ఆ తర్వాత నుంచి ప్రతి సినిమాతో తన గ్రాఫ్ పెంచుకుంటూ వెళ్తున్న వినాయక్ ఒక దర్శకుడిగా డిజప్పాయింట్ చేయడం అన్నది చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. అందుకే వినాయక్ సినిమా వస్తోందంటే అంచనాలు ఒక రేంజ్‌లో ఉంటాయి. ముఖ్యంగా 'ఖైదీ నంబర్ 150'తో రికార్డులు బద్దలు కొట్టిన వినాయక్ దర్శకత్వంలో రూపొందిన 'ఇంటెలిజెంట్'పై ఆ అంచనాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. మెగా హీరోలతో వినాయక్ ట్రాక్ రికార్డ్ కూడా అలాటింది మరి. చిరంజీవికి 'టాగోర్, ఖైదీ నంబర్ 150, అల్లు అర్జున్‌కి 'బన్నీ', రామ్ చరణ్‌కి 'నాయక్' సినిమాలు ఇచ్చిన వినాయక్ మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్‌కి కూడా సూపర్ హిట్ ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాయి సరసన లావణ్య త్రిపాఠి నటించింది. ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా వినాయక్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు.



? సినిమా ఫస్ట్ కాపీ చూసుకున్నాక ఎలా ఫీల్ అయ్యారు?

! చాలా ఆనందంగా, హ్యాపీగా ఫీల్ అయ్యాం. ఖచ్చితంగా సూపర్‌హిట్ కొడతామని నమ్మకంతో వున్నాం. బేసిగ్గా ఇది మంచి హ్యూమర్, యాక్షన్, బ్యూటిఫుల్ సాంగ్స్ వున్న పక్కా కమర్షియల్ మూవీ.

? ఆడియోకి ఎలాంటి ఫీడ్‌బ్యాక్ వస్తోంది?

! 'నాయక్' సినిమా తర్వాత మళ్ళీ థమన్‌తో కలిసి వర్క్ చేశాను. నాయక్ ఆడియోతో పాటు సినిమా కూడా చాలా పెద్ద హిట్ అయ్యింది. 'ఇంటిలిజెంట్'కి థమన్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చాడు. నాలుగు సాంగ్స్ సూపర్‌హిట్ అయ్యాయి. రీరికార్డింగ్ అద్భుతంగా చేశాడు.

? నిర్మాత సి.కళ్యాణ్ మేకింగ్ ఎలా వుంది?

! నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా వున్నప్పటి నుండి నాకు కళ్యాణ్‌గారు తెలుసు. ఇద్దరం ఫ్రెండ్స్‌లా వుంటాం. అన్‌కాంప్రమైజ్డ్‌గా ఎంతో ఖర్చు పెట్టి చాలా రిచ్‌గా ఈ చిత్రాన్ని నిర్మించారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో 'ఇంటిలిజెంట్' సినిమా పెద్ద హిట్ చిత్రంగా నిలుస్తుందని కాన్ఫిడెన్స్‌తో చెబుతున్నాను. జనరల్‌గా నేను అందర్నీ బాగా చూసుకుంటాను. అలాంటి నన్ను ఒక గాజు బొమ్మలాగా కళ్యాణ్‌గారు చూసుకున్నారు. ప్రొడక్షన్ సైడ్ ఎలాంటి ప్రాబ్లెమ్స్ లేకుండా సి.వి.రావు, పత్స నాగరాజా ఎంతగానో సపోర్ట్ చేశారు.

? సాయిధరమ్ తేజ్ క్యారెక్టర్ ఎలా వుంటుంది?

! సరదాగా లైఫ్‌ని ఎంజాయ్ చేస్తూ వుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తేజ్ తన స్టైల్‌లో బాగా చేశాడు. కామెడీ, యాక్షన్ సీన్స్‌లలో అద్భుతంగా చేశాడు. పర్టిక్యులర్‌గా కొన్ని షాట్స్‌లో అచ్చం చిరంజీవిగారిలా కన్పించాడు. సాయి అంతకు ముందు చేసిన చిత్రాల్లో కంటే ఈ చిత్రంలో పాటలు చాలా బాగుంటాయి. డ్యాన్స్‌లు ఇరగదీశాడు. శేఖర్, జానీ మాస్టర్స్ ఎంతో కష్టపడి రిహార్సల్స్ చేయించారు. అందులోని బెస్ట్ మూవ్‌మెంట్స్‌ని సెలెక్ట్ చేసుకుని చేశాం.

?ఈ సినిమా మెయిన్ కథాంశం ఏమిటి?

! తనకి సాయం చేసిన ఒక గాడ్‌ఫాదర్ లాంటి వ్యక్తికి అన్యాయం జరిగితే అతని కోసం హీరో ఎలా రియాక్ట్ అయ్యాడు? విలన్ మీద ఎలా పోరాడాడు? అనేది మెయిన్ కథాంశం. ఒక చిన్న మైండ్‌గేమ్‌తో 'ఇంటిలిజెంట్'గా ప్రాబ్లెమ్ ఎలా డీల్ చేశాడు అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటుంది.

? 'చమక్ చమక్' సాంగ్‌ని రీమిక్స్ చేయాలన్న థాట్ ఎవరిది?

! అన్నయ్య సినిమాల్లోని నాకు చాలా ఇష్టమైన పాట అది. 'చమక్ చమక్' పాట పెట్టాలని అందరం అనుకున్నాం. కళ్యాణ్‌గారు ఇళయరాజాగారిని అప్రోచ్ అయ్యి ఈ పాట రీమిక్స్ గురించి అడగ్గానే ఆయన చాలా ఆనందంగా స్పందించి ఓకే చేశారు. ఈ పాటని రోమ్‌లో అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఒరిజినల్ పాటకి ఏమాత్రం తీసిపోని విధంగా వుంటుంది.

? హీరోయిన్ లావణ్య త్రిపాఠి గురించి?

! ఫస్ట్‌టైమ్ ఫుల్ కమర్షియల్ మూవీలో లావణ్య త్రిపాఠి నటించింది. ఈ సినిమాతో లావణ్య పెద్ద కమర్షియల్ హీరోయిన్ అవుతుంది. సంధ్య క్యారెక్టర్‌లో లావణ్య ఫెంటాస్టిక్‌గా పెర్‌ఫార్మ్ చేసింది. డ్యాన్స్‌లు కూడా బాగా చేసింది.

? 'అదుర్స్-2' సినిమా ఎప్పుడు?

! రెండు మూడు కథలు అనుకున్నాం. కానీ మేం శాటిస్‌ఫై అయ్యేంతగా అన్పించలేదు. అదుర్స్ సినిమాని మించి 'అదుర్స్-2' తీయాలని మంచి కథ కోసం వెయిట్ చేస్తున్నాను. తప్పకుండా 'అదుర్స్-2' చేస్తాను.

? మహేష్‌తో సినిమా ఎప్పుడు?

! మా కాంబినేషన్‌లో తప్పకుండా సినిమా వుంటుంది. మంచి కథ కోసం వెయిట్ చేస్తున్నాం.

? ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసే ఉద్దేశం వుందా?

! నాకు కొన్ని ఐడియాలు వున్నాయి. కొత్త దర్శకులను ప్రోత్సహిస్తూ మంచి కాన్సెప్ట్ బేస్డ్ మూవీస్ తీయాలని ప్లాన్ చేస్తున్నాను. అయితే ఇప్పుడు కాదు రెండు సంవత్సరాల తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ చేస్తాను.

? మీ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటి?

! ఇంకా ఏం కమిట్ కాలేదు. ప్రస్తుతానికి 'ఇంటిలిజెంట్' మీదే నా ఫోకస్ అంతా వుంది. రెండు నెలలు గ్యాప్ తీసుకుని నెక్స్‌ట్ చేయబోయే సినిమా గురించి ఆలోచిస్తాను.

తొలిప్రేమ ఒక మధురానుభూతి!



తొలిప్రేమ ప్రతి ఒక్కరికీ ఎంతటి మధురమైనదో.. 'తొలిప్రేమ' చిత్రం కూడా అంతటి మధురమైన అనుభూతిని పంచుతుందని చిత్ర కథానాయిక రాశీ ఖన్నా చెబుతోంది. గత శుక్రవారం 'టచ్ చేసి చూడు'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రాశీ ఖన్నా ఈ వారం 'తొలిప్రేమ'తో వస్తోంది. ఈ చిత్రం గురించి ఆమె మాట్లాడుతూ.. వెంకీ అట్లూరి కొత్తగా పరిచయమవుతున్నప్పటికీ.. అన్ని విషయాల్లో అతనికి క్లారిటీ ఉంది. చాలా బాగా తీశాడు. వరుణ్ తేజ్‌కి నాకు మధ్య వచ్చే రొమాంటిక్ సీన్స్ అన్నీ మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా ఉంటాయి. థమన్ చాలా మంచి ట్యూన్స్ ఇచ్చాడు. దిల్ రాజు విడుదల చేస్తున్న ఈ సినిమా మంచి హిట్టవుతుందని, నాకు మంచి పేరు తీసుకు వస్తుందని నమ్మకముందని చెప్పుకొచ్చింది!

సెట్స్ మీదకి అల్లుడుగారి సినిమా

మెగాస్టార్ చిరంజీవి అల్లుడు కళ్యాణ్ దేవ్ కథానాయకుడిగా రాకేష్ శశి దర్శకత్వంలో వారాహి చలనచిత్రం పతాకంపై ఇటీవల పూజాకార్యక్రమాలతో లాంఛనంగా సినిమా ప్రారంభమైన విషయం తెలిసిందే. కళ్యాణ్ దేవ్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యింది. భారీ నటీనటవర్గం మరియు సాంకేతిక నిపుణులతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సాయి కొర్రపాటి నిర్మిస్తున్నారు.

కళ్యాణ్ దేవ్, మాళవికా నాయర్, తనికెళ్ళభరణి, మురళీ శర్మ, నాజర్, సత్యం రాజేష్, ప్రగతి, కళ్యాణి నటరాజన్, పోసాని, రాజీవ్ కనకాల, జయప్రకాష్ (తమిళ నటుడు), ఆదర్ష్ బాలకృష్ణ, నోయల్, కిరీటి, భద్రమ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఫైట్స్: జాషువా, కళ: రామకృష్ణ, సాహిత్యం: రెహమాన్, సంగీతం: యోగేష్, ఛాయాగ్రహణం: కెకె.సెంథిల్ కుమార్, సమర్పణ: సాయి శివాని, నిర్మాణం: సాయి కొర్రపాటి, నిర్మాత: రజని కొర్రపాటి, కథ - చిత్రానువాదం - మాటలు - దర్శకత్వం: రాకేష్ శశి.



తమన్ తన్నుకుపోతున్నాడు!

భాగమతి చిత్రంతో ఈ ఏడాదికి బోణీ కొట్టడమే కాదు.. తన ఆర్.ఆర్.తో హారర్ పుట్టించి తన సత్తా చాటుకున్న తమన్.. ఈవారం ఏకంగా మూడు సినిమాలతో ముందుకు వస్తున్నాడు. గతంలో ఎప్పుడైనా ఒక సంగీత దర్శకుడి సినిమాలు ఒకే సారి మూడు సినిమాలు విడుదలయ్యాయేమో తెలియదు కానీ.. ఇటీవలి కాలంలో మాత్రం జరగలేదు. అందుకే తమన్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాడు. తమన్ సంగీతం సమకూర్చిన సినిమాలు 'ఇంటెలిజెంట్, తొలిప్రేమ, గాయత్రి' మూడూ ఒక రోజు వ్యవధిలో విడుదల కానున్నాయి. ఈ మూడు సినిమాల్లో ఏ సినిమాకి తమన్ మ్యూజిక్ హెల్ప్ అవుతుందో వేచి చూడాల్సిందే!









రెచ్చిపోతున్న రకుల్!



హిందీలో 'ఆయారి' అనే సినిమా చేస్తున్న రకుల్.. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. అంతేకాదు.. ఆ సినిమాకి ప్రచారం కల్పిస్తూ.. తనను తాను ప్రమోట్ చేసుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ సినిమా హిట్టయితే హిందీలో వచ్చే అవకాశాలు మిస్సవ్వకుండా ముందు జాగ్రత్తగా తెలుగు, తమిళ్‌లో ఏ సినిమాలు పడితే ఆ సినిమాలకు సైన్ చేయడం లేదు. మరి మబ్బుల్లో నీళ్ల కోసం ముంత ఒలకబోసుకున్న చందంగా రకుల్ పరిస్థితి తయారవుతుందేమో వేచి చూడాలి!

అమ్మడు అలా ఇలా భయపెట్టడం లేదు



విరాట్ కోహ్లీతో పెళ్లి తర్వాత సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చిన అనుష్క శర్మ తిరిగి వచ్చేసింది. ఎప్పుడు బబ్లీ గర్ల్‌గా కనిపించే ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు మాత్రం భయపెట్టే అవతారంతో ముందుకు వచ్చింది. అదే బాలీవుడ్ మూవీ 'పరి'. ప్రోసిత్ రాయ్ దర్శకత్వంలో ప్రరంబత చటర్జీ రజత్ కపూర్ రీతాబరి చక్రవర్తి ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా యాభై సెకండ్ల టీజర్ విడుదల చేసారు. నిడివి తక్కువగానే ఉన్నా చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా స్పష్టంగా ఇందులో చెప్పారు. కాదు చూపించారు. అనుష్క శర్మ గతంలో ఎన్నడూ చూడని తరహాలో హారర్ సినిమాలో నటించడం ఒక ట్విస్ట్ అయితే నిర్మాత కూడా తనే కావడం పరి ప్రత్యేకత. చాలా డిఫరెంట్ మేకింగ్‌తో ఇంటరెస్టింగ్ అనిపించేలా ఇది కట్ చేసారు.





మాల్దీవులకు సాయం చేయడానికి సిద్ధంగా భారత సైన్యం

ఆదేశాలు రావడమే తరువాయి

న్యూఢిల్లీ : మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం చోటు చేసుకున్న నేపథ్యంలో అక్కడ ఏదైనా అనుకోని పరిస్థితులు తలెత్తితే సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని భారత సైనిక వర్గాలు తెలిపాయి. అక్కడ భారత పర్యాటకులను సురక్షితంగా తరలించడం మొదలుకుని సైనిక జోక్యం వరకు సాయం అందించనున్నట్లు పేర్కొన్నాయి. కానీ ఈ విషయంలో ఇప్పటి వరకు తమకు ప్రభుత్వం పరంగా ఎలాంటి ఆదేశమూ అందలేదని తెలిపాయి. మాల్దీవుల్లో నెలకొన్న పరిస్థితులను సాయుధ దళాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయని, ఏదైనా అనుకోని పరిణామాలు చోటు చేసుకుంటే స్వల్ప వ్యవధిలోనే అక్కడ మోహరిస్తాయని ఆ వర్గాలు తెలిపాయి. భారత నావికా దళానికి సంబంధించిన రెండు యుద్ధ నౌకలు ఎల్లప్పుడూ పశ్చిమ సముద్ర తీరంలో గస్తీ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. అవసరమైతే వాటిని మాల్దీవులకు పంపుతామని నేవీ అధికారి ఒకరు తెలిపారు. మరో వైపు రక్షణ సహకారం కోసం మాల్దీవుల్లో భారత్‌కు రక్షణ దళం కూడా ఉంది. యుద్ధ నౌకలు, విమానాలు, హెలికాప్టర్లు తరచు పహరా కాస్తుంటాయని ఆయన చెప్పారు. మాల్దీవులకు గతంలోనూ భారత్ సాయం అందించింది. ఉదాహరణకు, 1988లో మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ ప్రభుత్వంపై అబ్దుల్లా లుతుఫీ నేతృత్వంలో కొందరు పన్నిన కుట్రను అణచివేసేందుకు అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 'ఆపరేషన్ కాక్టస్' కింద పారాట్రూపర్లు, నావికా దళ యుద్ధ నౌకలను మాల్దీవులకు హుటాహుటిన తరలించిన సంగతి తెలిసిందే.

ఇక బీజేపీకి చుక్కలే

- మోడీ హవాను ఎదురొడ్డే నాయకుడు వచ్చేశాడు
- కాంగ్రెస్ సంబరం
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం
- బీజేపీ గెలిచినా మోడీ ప్రధాని కాలేరు
- ఉప ఎన్నికల్లో బీజేపీకి చుక్కలు చూపిస్తున్న కాంగ్రెస్
- రాజస్థాన్‌లో బీజేపీ నుంచి మూడు సిట్టింగ్ స్థానాలు లాగేసుకున్న కాంగ్రెస్
- తేల్చి చెబుతున్న కాంగ్రెస్ వర్గాలు



న్యూఢిల్లీ : మోడీ హవాకు బ్రేకులు వేసే నాయకుడు వచ్చేశాడని కాంగ్రెస్ నేతలు తెగ సంబరపడిపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఇక చుక్కలే కనిపిస్తాయని అంటున్నారు. మోడీ హవాను అడ్డుకునే శక్తి ఒక్క రాహుల్ గాంధీకే ఉందని చెబుతున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, హర్యానా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలే అందుకు నిదర్శనమని చెబుతున్నారు. బీజేపీ నుంచి ఈసారి మరి 60 సీట్లను కాంగ్రెస్ లాగేసుకుంటుందని, దీనితో ప్రధానిగా రెండో మారు కొనసాగాలని ఉవ్విళ్లూరుతున్న మోడీ కల నెరవేరదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ఒకరు చెప్పారు. మిత్ర పక్షాలతో కలసి పని చేయడం మోడీకి రాదని, ఆయన తీరుతో మిత్ర పక్షాలు ఎన్డీఏలో ఇమడలేకపోతున్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు మార్పులు స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. యూపీఏ అధికారంలోకి రావడం ఖాయమని, లేదంటే, ఒకవేళ బీజేపీ వచ్చినా మోడీ మాత్రం ప్రధానిగా ఉండే అవకాశం లేదని ఆయన వివరించారు. మిత్ర పక్షాలు ఈసారి మోడీని అంగీకరించే అవకాశమే లేదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం శివ సేన, అకాలీ దళ్, టీడీపీ మోడీతీరుపై గుర్రుగా ఉన్నాయని, మున్ముందు మరిన్ని పార్టీలు బయటకు వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 220 సీట్లకు పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. గత ఎన్నికల్లో కాషాయ పార్టీకి 282 సీట్లు వచ్చాయి. మోడీ వంటి వ్యక్తి కూటములకు సరిపోడని, రాజ్‌నాథ్ వంటి వారు అయితే సరిగ్గా సరిపోతారని అంటున్నారు. ఇక, గుజరాత్ ఎన్నికల్లో బీజేపీతో కాంగ్రెస్ హోరాహోరీగా తలపడి, ముచ్చెమటలు పట్టించడం, ఇటీవలి రాజస్థాన్ ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి మూడు సిట్టింగ్ స్థానాలను లాక్కోవడం చూస్తుంటే ప్రజలు బీజేపీ నుంచి క్రమంగా కాంగ్రెస్ వైపు మళ్లుతున్నట్టు అర్థమవుతోందని కాంగ్రెస్ ఆశాభావం వ్యక్తం చేసింది.

'దేశ ప్రజలు ఇలాంటి ఉపన్యాసాలు కోరుకోవడం లేదు'



న్యూఢిల్లీ : రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగిన సంగతి తెలిసిందే. దేశం విచ్ఛిన్నం కావడానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని ఆయన దుయ్యబట్టారు. ఆ పార్టీ దేశాన్ని నాశనం చేసిందని విమర్శించారు. ఆయన ప్రసంగం మొత్తం కాంగ్రెస్‌ను విమర్శిస్తూనే సాగింది. ఏపీకి అన్యాయం చేసింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. తరువాత మోడీ ప్రసంగంపై కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పందించారు. మోడీప్రసంగం ఎప్పటి వలెనే ఉందని, అందులో కొత్తదనమేమీ లేదని ఎద్దేవా చేశారు. యువతకు ఉపాధి అవకాశాల గురించి మోడీ ప్రస్తావించలేదని అన్నారు. తమ భవిష్యత్తుపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారని చెప్పారు. దేశ ప్రజలు ఉపాధిని కోరుకుంటున్నారని, ఇలాంటి ఉపన్యాసాలకు కాదని సెటైర్ వేశారు.

'మోడీ మాట్లాడుతుండగా బిగ్గరగా నవ్విన రేణుకా చౌదరి'



న్యూఢిల్లీ : రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ అవసరం లేదని మహాత్మా గాంధీ చెప్పారని అన్నారు. కాంగ్రెస్ లేని భారత్ అనేది తన నినాదం కాదని, మహాత్మా గాంధీదేనని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మోడీ ప్రసంగానికి అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. దీంతో, ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవద్దని రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు వారించారు. ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ వద్దకు వెళ్లాలని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరికి సూచించారు. ఆ తరువాత మోడీ ప్రసంగం వింటూ రేణుకా చౌదరి బిగ్గరగా నవ్వారు. ఈ నవ్వుపై మోడీ స్పందిస్తూ, అప్పట్లో రామాయణంలో ఇలాంటి నవ్వులు విన్నామని, ఇప్పుడు మరోసారి వింటున్నామని ఎద్దేవా చేశారు. దీంతో, బీజేపీ సభ్యులంతా బల్లలు చరుస్తూ నవ్వారు.

ఇక్కడే ఇలా చేస్తున్నారంటే ఇంటిలో ఇంకెలా ఉంటారో?



న్యూఢిల్లీ: ఎంత నచ్చజెపుతున్నా వినకుండా లోక్ సభలో నినాదాలు చేస్తూ పోడియం ముందు నిలబడిన తెలుగు దేశం పార్టీ ఎంపీలను ఉద్దేశించి స్పీకర్ సుమిత్రా మహాజన్ చురకలంటించారు. ఎంపీలు చిన్న పిల్లల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని, ఇక్కడే ఇలా ఉన్నారంటే, ఇంటిలో ఇంకెలా ఉంటారోనని, తమ పిల్లలను కూడా వీరు క్రమశిక్షణలో పెట్టలేనట్టుగా అనిపిస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. సభ సజావుగా సాగేందుకు ఏపీ ఎంపీలు సహకరించాలని కోరారు. 'నేను మీ అందరినీ ఒకటే కోరుతున్నాను. మీ మీ స్థానాల్లోకి వెళ్లండి. ఈ విధమైన అల్లరి చిన్న పిల్లలు కూడా చేయరు. మీరు మీ ఇళ్లలో పిల్లలను ఎలా కంట్రోల్ చేస్తారో అర్థం కావడం లేదు. ఇలా ప్లకార్డులు పట్టుకుని మాట్లాడుతున్న సభ్యుల ముఖం ముందు పెట్టడం మంచి పద్ధతి కాదు. దయ చేసి అర్థం చేసుకోండి' అని అన్నారు.

అత్యంత శక్తిమంతమైన రాకెట్ ప్రయోగం



- స్పేస్ ఎక్స్ ఫాల్కన్ హెవీ ప్రయోగం విజయవంతం
- వేలాది మంది చూస్తుండగా దూసుకెళ్లిన రాకెట్
- ఓ పర్వతమంత విస్తరించిన పొగ
- 27 ఇంజన్‌లతో రాకెట్ డిజైన్

కేప్ కెనవెరల్ : ప్రపంచపు అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'స్పేస్ ఎక్స్ ఫాల్కన్ హెవీ'ని అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. కేప్ కెనవెరల్‌లోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి దీనిని ప్రయోగించగా, వేలాది మంది ప్రత్యక్షంగా తిలకించారు. భూమి నుంచి అంగారకుడి వరకూ ఉన్న దూరాన్ని ఏకధాటిగా అధిగమించేంతటి శక్తి దీని సొంతం. 18,747 జెట్ లైనర్స్‌కు ఉండేంత శక్తితో ఇది ఆకాశంలోకి దూసుకువెళ్లింది. చంద్ర మండలం మీదకు అపోలో 11 సిబ్బందిని తీసుకువెళ్లిన లాంచ్ ప్యాడ్‌పై నుంచి దీన్ని ప్రయోగించడం గమనార్హం. ఈ రాకెట్ కదిలే ముందు, ఇంజన్‌లను ఆన్ చేసిన తరువాత వచ్చిన పొగ ఓ భారీ పర్వత విస్తీర్ణమంత కనిపించింది. 27 ఇంజన్‌లు, 3 బూస్టర్లు కలిగిన ఈ రాకెట్ దేన్నైనా మార్స్ వరకూ స్వల్ప కాలంలో చేరుస్తుందని స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ తెలిపారు. కాగా, ఈ రాకెట్ ప్రయోగానికి యుఎస్ సర్కారు ఎలాంటి నిధులనూ కేటాయించకపోవడం గమనార్హం. ప్రైవేట్ నిధులతో, అంటే ఎలాన్ మస్క్ తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అయినప్పటికీ అమెరికా ఏరోస్పేస్ రంగంలో ఇదో కీలక మైలురాయని స్పేస్ ఫ్లోరిడా ప్రతినిధి డేల్ కెట్చామ్ వ్యాఖ్యానించారు. భద్రతా శాటిలైట్లను, అంతరిక్షంలోకి మానవ నిర్మాణాలను పంపాలన్న నాసా ఆశలను నెరవేర్చే సత్తా స్పేస్ ఎక్స్‌కు ఉందని, పెంటగాన్ అవసరాలనూ తీరుస్తుందని చెప్పారు. కాగా, భూ కక్ష్యలో 1,40 లక్షల పౌండ్ల బరువు ఉండే ఈ రాకెట్ మార్స్ సమీపానికి వెళ్లేసరికి కేవలం 40 వేల పౌండ్ల బరువు ఉంటుందట.

ప్రాజెక్టులను అప్పట్లోనే పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి రాకపోయేది

- రాజ్యసభలో మోడీ
- వేల కోట్ల ఖర్చుతోనే ప్రాజెక్టులు పూర్తయ్యేవి
- ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు లక్షల కోట్లు కావాలి
- రైల్వే బడ్జెట్‌లో కొత్త పథకాలు ప్రకటించేవారు
- వాటి అమలును పట్టించుకునే వారు కాదు



న్యూఢిల్లీ : దేశంలో పలు ప్రాజెక్టులను అప్పట్లోనే పూర్తి చేసి ఉంటే వేల కోట్ల ఖర్చుతోనే అవి పూర్తయ్యేవని, ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు లక్షల కోట్లు కావాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో బడ్జెట్‌లో కొత్త పథకాలు ప్రకటించేవారని, వాటి అమలును పట్టించుకునే వారు కాదని అన్నారు. అలాగే రైల్వే బడ్జెట్‌లో కొత్త పథకాలు ప్రకటించేవారని, వాటి అమలును పట్టించుకునే వారు కాదని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 1500 పైగా రైల్వే ప్రాజెక్టులను ప్రకటించిందని, పనులను మాత్రం ప్రారంభించలేదని విమర్శించారు. ఇప్పుడు తాము చేపడుతున్న స్వచ్ఛ భారత్, యోగా దినోత్సవాన్ని ఎగతాళి చేస్తున్నారని తెలిపారు. అలాగే, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదించాలని అన్నారు. ట్రిపుల్ తలాక్‌పై కాంగ్రెస్‌కు ఎలాంటి చట్టం కావాలని ఆయన ప్రశ్నించారు. ఎంతగానో ఉపయోగపడుతున్న ఆధార్ కార్డు ఐడియా తమదేనని కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటోందని, ఒక్కసారి 1998లో రాజ్యసభలో ఎల్‌కె అద్వానీ చేసిన ప్రసంగం వింటే ఆధార్ కార్డు తేవాలన్న ఆలోచన ఎలా పుట్టిందో తెలుస్తుందని అన్నారు. అలాగే, తాము ఒకే ర్యాంకు ఒకే పింఛన్‌పై నిర్ణయం తీసుకున్నామని మోడీ చెప్పారు.

హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన స్వామి నిత్యానంద

- మదురై ఆధీనం మఠం 293వ పీఠాధిపతిగా ప్రకటించుకున్న స్వామి నిత్యానంద
- మద్రాసు హైకోర్టుకు క్షమాపణలు
- తాను చేసిన ప్రకటన ఉపసంహరించుకుంటానని అఫిడవిట్ దాఖలు



మదురై : వివాదాస్పద స్వామీజీ నిత్యానంద మద్రాసు హైకోర్టుకు క్షమాపణలు చెప్పారు. 'మదురై ఆధీనం' మఠం 293వ పీఠాధిపతిని తానేనంటూ చేసిన ప్రకటన తప్పేనని ఆయన కోర్టు ముందు ఒప్పుకుని క్షమాపణలు తెలిపారు. ఆ ప్రకటనను ఉపసంహరించుకుంటున్నానని తెలుపుతూ మద్రాసు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ వివరాల్లోకి వెళితే, మదురై ఆధీనం 293వ పీఠాధిపతిగా నిత్యానంద తనకు తాను ప్రకటించుకున్నారు. దానిని సవాలు చేస్తూ జగదల ప్రతాపన్ అనే ప్రముఖుడు మద్రాసు హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. 292వ పీఠాధిపతి జీవించి ఉండగా తాను పీఠాధిపతినని స్వామి నిత్యానంద ఎలా ప్రకటించుకుంటారని ఆయన పిటిషన్‌లో ప్రశ్నించారు. ఒక పీఠాధిపతి జీవించి ఉండగా, ఆ మఠం ఉత్తరాధికారిగా ప్రకటించుకునే వెసులు బాటు లేదని, అన్ని అధికారాలు 292వ పీఠాధిపతికే ఉన్నాయని తెలపాలని ఆయన సదరు పిటిషన్‌లో కోరారు. దీనిని విచారించిన న్యాయస్థానం దీనిపై సమాధానం చెప్పాలని నిత్యానందకు నోటీసులు జారీ చేయగా, కౌంటర్ అఫిడవిట్‌లో న్యాయస్థానానికి నిత్యానంద క్షమాపణలు చెప్పారు. అనంతరం ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 26కు న్యాయస్థానం వాయిదా వేసింది.

యమీన్ దెబ్బకు వెనక్కి తగ్గిన మాల్దీవుల సుప్రీం కోర్టు

- రాజకీయ ఖైదీల విడుదల నిర్ణయం వెనక్కి
- 9 మంది హై ప్రొఫైల్ రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని గతంలో ఆదేశం
- దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన అధ్యక్షుడు యమీన్
- గత అర్ధరాత్రి అత్యవసరంగా నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న సుప్రీం కోర్టు



మాలె : మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ దెబ్బకు సుప్రీం కోర్టే వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దేశంలో అత్యవసర పరిస్థితికి కారణమైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. తొమ్మిది మంది రాజకీయ ఖైదీలను విడుదల చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రకటించింది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు జోక్యం చేసుకోవాలని మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్ భారత సాయాన్ని కోరడంతో సుప్రీం ఈ నిర్ణయం తీసుకుంది. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడం, దానిని అధ్యక్షుడు బేఖాతరు చేయడంతో దేశంలో అల్లర్లు చెలరేగాయి. తనను అభిశంసించేందుకు సుప్రీం ప్రయత్నిస్తోందని దేశాధ్యక్షుడు ఆరోపించారు. మరో వైపు తమను తొలగించేందుకు యమీన్ ప్రయత్నిస్తున్నారని న్యాయమూర్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. దీంతో సోమవారం రాత్రి అధ్యక్షుడు 15 రోజుల అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అంతే కాదు. చీఫ్ జస్టిస్ అబ్దుల్లా, న్యాయమూర్తి అలీ అహ్మద్‌లను అరెస్ట్ చేశారు. దీంతో పరిస్థితి చేయి దాటే అవకాశం కనిపిస్తుండడంతో మిగతా ముగ్గురు న్యాయమూర్తులు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. 9మంది హై ప్రొఫైల్ రాజకీయ ఖైదీలను విడుదల చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్టు మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రకటించారు. అధ్యక్షుడి ఆందోళనను దృష్టిలో పెట్టుకుని ఆదేశాలను ఉపసంహరించుకున్నట్టు న్యాయమూర్తులు తెలిపారు.

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడంటే ఇంతే మరి!



మనీలా : ఎటువంటి ముందస్తు అనుమతులూ తీసుకోకుండా దేశంలోకి అత్యంత ఖరీదైన కార్లను దిగుమతి చేశారని ఆరోపిస్తూ 20 లగ్జరీ కార్లను దగ్గర ఉండి బుల్డోజర్లతో తొక్కించారు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటిరెట్టో. కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆడి, మెర్సిడిస్ బెంజ్ తదితర కంపెనీల కార్లను మనీలాలోని ఓ ప్రాంతానికి చేర్చగా, వాటిపైకి బుల్డోజర్లను ఎక్కించారు. వీటి విలువ సుమారు 11,83,000 యుఎస్ డాలర్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే డ్రగ్స్, అక్రమ ఆయుధ వ్యాపారంపై ఉక్కు పాదం మోపి, ఎంతో మందికి మరణ దండన విధించేలా చేసిన ఆయన ఇప్పుడు అక్రమ దిగుమతులపైనా కొరడా ఝుళిపించడం ప్రారంభించారు.

మోడీ భార్య జశోదా బెన్‌కు యాక్సిడెంట్

- హుటాహుటిని ఆసుపత్రికి తరలింపు
- రోడ్డు ప్రమాదానికి గురైన జశోదా బెన్
- ప్రమాదంలో మోడీ భార్యకు గాయాలు
- వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం



జైపూర్ : ప్రధాని నరేంద్ర మోడీ భార్య జశోదా బెన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రాజస్థాన్‌లోని కోటాలో జరిగిన ఓ వేడుకకు కుటుంబ సభ్యులతో కలసి హాజరై గుజరాత్‌కు తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చిత్తోర్‌గఢ్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. కోటా– చిత్తోర్ హైవేపై ఈ ప్రమాదం సంభవించింది. ప్రస్తుతం ఆమె తన సోదరుడు అశోక్ మోడీతో కలసి గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా ఉంఝా పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఆమెకు మెహ్సానా జిల్లా పోలీసులు భద్రతను కల్పిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

తైవాన్‌లో భారీ భూకంపం

- కూలిన భారీ భవంతులు
- మిన్నంటిన ప్రజల ఆర్తనాదాలు
- తైవాన్ తూర్పు తీరంలో 6.4 తీవ్రతతో భూకంపం
- రాత్రి 11.50 గంటలకు కంపించిన భూమి
- కుప్పకూలిన భారీ భవంతులు, పెద్ద పెద్ద నిర్మాణాలు



తైపీ : తూర్పు ఆసియా దేశం తైవాన్‌ను ప్రకృతి వణికించింది. తైవాన్‌లో మంగళవారం రాత్రి 11.50 గంటల సమయంలో భారీ భూకంపం సంభవించింది. తైవాన్ తూర్పు తీరం లోని పట్టణమైన హువాలి యెన్‌లో భారీ భవంతులు, ఇతర నిర్మాణాలు కుప్పకూలాయి. అర్ధరాత్రి కావడంతో కూలిన భవంతుల్లో వందలాది మంది ప్రజలు చిక్కుకుపోయి ఆర్తనాదాలు చేస్తున్నారు. ఒక్కసారిగా పట్టి కుదిపేసిన భారీ భూకంపం తరువాత సుమారు 100 సార్లకు పైగా భూమి స్వల్పంగా కంపించడంతో ప్రాణ భయంతో జనం రోడ్లపై పరుగులు తీశారు. కాగా, హువాలియెన్‌కు 21 కిలో మీటర్ల దూరంలో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు అమెరికా జియొలాజికల్ సొసైటీ తెలిపింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.4గా నమోదైంది. ఇక్కడి ప్రఖ్యాత మార్షల్ హోటల్ భవనం కూలిపోయిన దృశ్యాలు అత్యంత భీతి గొలిపించేలా ఉన్నాయి. తీవ్రమైన భూకంపం కావడంతో తైవాన్ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించింది. యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

అమ్మాయితో మాట్లాడినందుకు 2000 జరిమానా



లాహోర్ : పాకిస్తాన్ లాహోర్‌లోని ఎం. ఇస్లాం మెడికల్ అండ్ డెంటల్ కాలేజీలో చోటు చేసుకున్న ఘటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తరగతి బయట ఇద్దరు విద్యార్థినులతో మాట్లాడాడు. దీనిని చూసిన కళాశాల యాజమాన్యం అలా మాట్లాడడాన్ని దుష్ప్రవర్తనగా భావించి 2000 రూపాయల జరిమానా విధించింది. తరగతి బయట ఒక అమ్మాయితో పిచ్చాపాటి మాట్లాడుతున్నావు అంటూ జరిమానా రశీదుపై పేర్కొనడం విశేషం. ఇది 2017 డిసెంబర్ 28న చోటు చేసుకోగా, దానికి సంబంధించిన ఫోటోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దీంతో అది వైరల్‌గా మారింది. ఇదే కాలేజీలో చోటు చేసుకున్న మరో ఘటనకు సంబంధించిన వీడియో అప్‌లోడ్ చేయగా, దానిలో ఇద్దరు విద్యార్థుల ఫోన్‌లను రాళ్లతో పగులగొడుతుండడం కనబడుతోంది. ఈ రెండు అక్కడ వైరల్ కాగా, కాలేజీ యాజమాన్యం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఏపీ నేతలకు, ప్రజలకు షాకిచ్చిన మోడీ ప్రసంగం

- ఏపీ కష్టాలకు కాంగ్రెసే కారణమన్న మోడీ
- పార్లమెంటు తలుపులు మూసి ఏపీని విభజించారన్న ప్రధాని
- మోడీ ప్రసంగంలో వినిపించని విభజన హామీలు
- తీవ్ర నిరాశలో ఏపీ ప్రజలు, నేతలు



న్యూఢిల్లీ : లోక్ సభలో బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం ఏపీ ప్రజలకు ఏమాత్రం రుచించలేదు. పైపెచ్చు, తీవ్ర నిరాశ మిగిల్చింది. విభజన హామీలపై ప్రధాని నుంచి స్పష్టమైన హామీలు వస్తాయని భావించిన వారికి చివరకు నిరాశే మిగిలింది. తన ప్రసంగంలో విభజన హామీలను ఏ మాత్రం ప్రస్తావించని మోడీ రాష్ట్ర విభజన తప్పును కాంగ్రెస్ పార్టీపైకి తోసేశారు. ఏపీ ప్రజల మనోభావాలను దెబ్బ తీయకుండా రాష్ట్రాన్ని విభజించాలని బీజేపీ కోరుకుందని తెలిపారు. గతంలో ఎన్డీయే హయాంలో రాష్ట్రాలను ఒక పద్ధతి ప్రకారం, ఎవరికీ అన్యాయం జరగకుండా విభజించామని, కానీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికలు తరుముకువస్తున్న వేళ పార్లమెంటు తలుపులను మూసి, ఆంధ్ర పదేశ్‌ను విభజించిందని విమర్శించారు. ఏపీ కష్టాలకు కాంగ్రెస్ పార్టీనే కారణమని చెప్పారు. తన ప్రసంగంలో ఏపీకి ఇచ్చిన ఒక్క హామీని కూడా మోడీ ప్రస్తావించలేదు. పోలవరం, రాజధాని నిర్మాణం, విశాఖ రైల్వే జోన్ తదితర ఏ ఒక్క అంశం కూడా ప్రధాని ప్రసంగంలో వినపడలేదు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూనే, కాంగ్రెస్ పార్టీని ఎండగట్టే ప్రయత్నం చేశారు. నెహ్రూ దగ్గర నుంచి ఇప్పటి నేతల వరకు అందరిపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని ముక్కలు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ఆరోపించారు. నెహ్రూ స్థానంలో పటేల్ ఉండి ఉంటే కాశ్మీర్ సమస్య ఉండేది కాదని అన్నారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ సర్వ నాశనం చేసిందని చెప్పారు. మొత్తం మీద రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రసంగాన్ని చివరకు ఎన్నికల ప్రసంగంగా మోడీ మార్చేశారు. మోడీ ప్రసంగం ముగిసిన వెంటనే లోక్ సభను స్పీకర్ సుమిత్రా మహాజన్ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

మాల్దీవుల రాజకీయాలు మీకెందుకు?



బీజింగ్ : మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా భారత్ అడుగులు వేస్తున్న వేళ ఆ దేశపు సంగతి మీకెందుకని చైనా ప్రశ్నించింది. మాలేలోకి భారత్ సైన్యాన్ని పంపించరాదని డిమాండ్ చేస్తూ వారి సంక్షోభంలో భారత్ కల్పించుకోరాదని సూచించింది. ఈ మేరకు చైనా అధికార పత్రిక 'గ్లోబల్ టైమ్స్' సంపాదకీయంలో పలు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ అనిశ్చితి వారి అంతర్గత వ్యవహారమని అంటూ, ఇండియా అక్కడికి వెళ్లి ఏమి న్యాయం చేయాలని అనుకుంటోందని ప్రశ్నించింది. ఇండియా కావాలనే మాల్దీవుల ప్రభుత్వంపై ఒత్తిడి పెడుతోందని, ఇది సరి కాదని వ్యాఖ్యానించింది. కాగా, మాల్దీవులకు సైన్యాన్ని, దూతలను పంపించి పరిస్థితి సద్దుమణిగేలా చూడాలని ఆ దేశ ప్రతిపక్ష నేత పదే పదే కోరుతుండడం, ప్రజల నిరసనలను అదుపు చేసేంత సైనిక బలం ఆ దేశంలో లేకపోవడంతో, భారత సైన్యం ఏ క్షణమైనా మాలేలో కాలు పెట్టేందుకు సిద్ధంగా ఉందన్న సంగతి తెలిసిందే.

అందుకే మన స్పిన్నర్లను ఎదుర్కోలేకపోతున్నారు



న్యూఢిల్లీ : ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేల్లో భారత మణికట్టు స్పిన్ ద్వయం చాహల్, కుల్‌దీప్ కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. తొలి రెండు వన్డేల్లో వీరికే 13 వికెట్లు దక్కాయి. సఫారీ బ్యాట్స్‌మెన్లు ఎందుకు మన మణికట్టు స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతున్నారో మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ తెలిపాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్లు మన మణికట్టు స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ప్రాక్టీస్ సమయంలో వారు స్పిన్నర్ ఇమ్రాన్ తాహీర్‌తో బంతులు వేయించుకుంటున్నారు. తాహీర్ మణికట్టు స్పిన్నర్ కాదు. అందుకే వారు చాహల్, కుల్‌దీప్ బౌలింగ్‌లో తడబడుతున్నారు. మార్‌క్రమ్, డీకాక్ చాలా సులువైన షాట్లకు యత్నించి వికెట్లను కోల్పోయారు. వారు తమ జట్టులో కొన్ని మార్పులు చేస్తే మంచిది అని గంగూలీ సూచించాడు. అనంతరం రోహిత్ శర్మ ఫామ్ గురించి మాట్లాడుతూ..ప్రస్తుతం టీమిండియా అద్భుత ఫామ్‌లో ఉంది. రోహిత్ శర్మ గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని గంగూలీ తెలిపాడు.

సఫారీగడ్డపై అదే తప్పు మరోసారి



కేప్‌టౌన్ : భారత్-దక్షిణాఫ్రికా మధ్య మూడో వన్డే ప్రారంభానికి ముందే మ్యాచ్ జరిగే న్యూలాండ్స్ మైదానం వార్తల్లోకి ఎక్కింది. గతంలో చేసిన తప్పే మరోసారి చేసింది. అదే భారత త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఎగరవేయడం. వన్డే సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య మూడు టెస్టుల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ మైదానంలో తొలి టెస్టు జరిగింది. మళ్లీ ఇదే మైదానంలో ఈ రోజు ఇరు జట్ల మధ్య మూడో వన్డే జరుగుతోంది.ఐతే టెస్టు ప్రారంభానికి ముందు మైదానం సిబ్బంది భారత త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఎగరవేసి ఆ తర్వాత సరి చేశారు. ఇప్పుడు అదే తప్పు మళ్లీ చేశారు. మ్యాచ్ కోసం మైదానం సిద్ధం చేసిన సిబ్బంది జెండాను తలకిందులుగా ఎగరవేశారు. మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు మైదానానికి వచ్చిన అభిమానులు తప్పిదాన్ని గుర్తించి జెండాను ఫొటో తీసి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. బీసీసీఐ, దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఈ తప్పిదాన్ని వెంటనే గుర్తించి.. సరిచేయాలి అని ఈ సందర్భంగా వారు సూచించారు. ఇరు జట్ల మధ్య తొలి టెస్టు ప్రారంభానికి ముందు క్వీన్‌లాండ్స్ సిబ్బంది ఇలాగే చేశారు. ఇప్పుడు మరో సారి ఇలా చేయడం సరికాదు అంటూ నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది.

కీపర్‌గా ధోనీ అరుదైన ఘనత

400 మందిని పెవీలియన్‌కు పంపిన తొలి ఇండియన్



కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా మాజీ సారథి, వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ అరుదైన ఘనత సాధించాడు. వికెట్ల వెనకాల ఉండి 400 ఔట్లు చేసిన ఘనత సాధించాడు. కుల్‌దీప్‌యాదవ్ వేసిన 16.2 బంతిని అయిడెన్ మార్క్రమ్ (32) ముందుకొచ్చి ఆడాడు. వెనకాలే ఉన్న ధోనీ వెంటనే బంతిని అందుకొని మెరుపు వేగంతో స్టంపౌట్ చేశాడు. దీంతో 304 పరుగుల లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా రెండో వికెట్ చేజార్చుకుంది. ఈ డిస్మిసల్‌తో ధోనీ వికెట్ల వెనకాల ఉండి 400 మందిని పెవిలియన్‌కు పంపించిన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌కు ముందు మహీ 314 వన్డేల్లో 399 డిస్మిసల్స్ చేశాడు. అందులో 294 క్యాచులు, 105 స్టంపింగ్స్ ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో 400 డిస్మిసల్స్ చేసిన ఘనత సాధించిన నాలుగో బ్యాట్స్‌మన్ ధోనీ. అంతకు ముందు గిల్‌క్రిస్ట్, కుమార సంగక్కర, మార్క్ బౌచర్ ఉన్నారు. 19 ఓవర్లు ముగిసే సరికి దక్షిణాఫ్రికా 88/2తో ఉంది. డుమిని (48; 60 బంతుల్లో 4స4) అర్ధశతకానికి చేరువయ్యాడు. హెన్రిచ్ (6) ఆడుతున్నాడు.

ప్రాణం తీసుకోవడానికికైనా రెడీ




న్యూఢిల్లీ : తాను ఎంచుకున్న క్రీడలో విశేషంగా రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటాడు ఏ క్రీడాకారుడైన. విశేష ప్రతిభతో రాణి స్తూ ఉన్న తమను దేశం తరవున ఆడ నివ్వకపోతే ఎవరు మాత్రం అసహ నానికి గురవ్వరు చెప్పండి. తాజాగా ఓ భారత క్రీడాకారిణి కామన్వెల్త్ గేమ్స్‌లో తనను ఎంపిక చేయకపోతే భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓ ఏ) ఎదుట ఆత్మహత్య చేసుకుంటా నని హెచ్చరించింది. ఇంతకీ ఆమె ఎవరంటే పారా వెయిట్ లిఫ్టర్ సకీనా ఖాటున్. కొద్ది రోజుల క్రితం ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో నిర్వహించనున్న కామన్వెల్త్ గేమ్స్-2018కు భారత్ తరవున ప్రాతినిధ్యం వహించనున్న కొందరి క్రీడాకారుల జాబితాను ఐఓఏ ప్రకటించింది. ఈ జాబితాలో సకీనాకు చోటు దక్కలేదు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. భవిష్యత్తులో ఐఓఏ ప్రకటించే జాబితాల కోసం వేచి చూస్తున్నాను. కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత జట్టులో నా స్థానం కోసం చివరి వరకు పోరాడుతాను. అయినప్పటికీ నా పేరు లేకపోతే కోర్టుకు వెళ్తాను. ఎందుకంటే వారు నా జీవితాన్ని నాశనం చేసినట్లే. ఏమాత్రం వెనుకాడను. ఐఓఏ ముందు ఆత్మహత్య చేసుకుంటానికై నా నేను సిద్ధంగా ఉన్నాను అని తెలిపింది. గ్లాస్గోలో నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ లైట్‌వెయిట్ కేటగిరీలో సకీనా పతకం గెలిచింది. ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్ కోసం నేను నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. ఎంతో కష్ట పడ్డాను. ఇప్పుడు ఎంపిక చేయకపోవడంతో నాకు ఏం చేయాలో అర్థం కావ దం లేదు. చాలా ఒత్తడికి గురవుతున్నాను అని సకీనా తన ఆవేదనను వ్యక్తం చేసింది. దీనిపై ఇప్పటికే భారత పారాలింపిక్ కమిటీకి సకీనా లేఖ రాసింది. అయితే కామన్వెల్త్ గేమ్స్ కమిటీ కొన్ని మార్పులు చేసిందని, అందుకే ఆమెను ఎంపిక చేయలేదని ఐఓఏ తెలిపింది. ఇదిలా ఉండగా భారత పారాలింపిక్ కమి టీ సకీనా లేఖకు స్పందించింది. కామన్వెల్త్ గేమ్స్ కమిటీతో చర్చించి సకీనాను ఆడేలా చూడాలని ఐఓఏకు లేఖ రాసింది.

కోహ్లీసేన కొత్త చరిత్ర



- సఫారీగడ్డపై వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన ఘనత సొంతం
- మూడో వన్డేలో 124 తేడాతో విజయం
- సొంతగడ్డపై చిత్తుచిత్తుగా ఓడిన సఫారీలు
- టెస్టు పరాజయానికి భారత్ ప్రతీకారం
- ఆరు మ్యాచ్‌ల సీరీస్‌లో 3-0 ఆధిక్యం సొంతం చేసుకున్న భారత్



కేప్‌టౌన్ : కోహ్లీసేన చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికాలో ఒక సిరీస్‌లో మూడు వన్డేలు గెలిచిన భారత తొలి జట్టుగా అవతరించింది. ఆరు వన్డేల సిరీస్‌లో 3-0తో ఆధిక్యంలో నిలిచింది. న్యూలాండ్స్ వేదికగా జరిగిన మూడో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 124 పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించింది కోహ్లీసేన. 304 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆ జట్టును మరోసారి మణికట్టు స్పిన్ ద్వయం యజువేంద్ర చాహల్ (4/46), కుల్‌దీప్ (4/23), పేసర్ బుమ్రా (2/32) చావుదెబ్బ కొట్టడంతో 40 ఓవర్లకు 179 పరుగులకు కుప్పకూలింది. ఆతిథ్య జట్టులో జేపీ డుమిని(51) అర్ధశతకం సాధించాడు. అయిడెన్ మార్క్రమ్ (32), డేవిడ్ మిల్లర్ (25) రాణించారు. అంతకు ముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్‌లో విరాట్ కోహ్లీ (160 నాటౌట్; 159 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు), దావన్ (76) దుమ్మురేపారు.

కేప్‌టౌన్‌లో ఆకాశమే హద్దుగా రెచ్చిపోయిన కోహ్లీ ఆటతీరులో అందాన్ని ఎంత ప్రశంసించినా తక్కువే. వర్ణనలకు అందని బ్యాటింగ్ అది. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆ బ్యాటింగ్‌ను చూసిన వారెవ్వరైనా ఆహా! ఏమి ఆడాడ్రా బాబూ! అనకుండా ఉండలేరు. ఈ తరం క్రికెటర్లలో తనకు సాటి లేనే లేరు అనేంతగా చెలరేగాడు విరాట్. ఈ వన్డే సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికాలో కోహ్లీ ఖాతాలో ఒక్క శతకం లేదు. ఇప్పుడు 3 వన్డేల్లోనే 2 శతకాలు నమోదు చేసుకున్నాడు. అటు సారథిగానూ రికార్డులు బద్దలు కొట్టేశాడు ఈ పరుగుల యంత్రం. కపిల్ దేవ్ (175★ జింబాబ్వేపై 1983లో) తర్వాత విదేశాల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన భారత కెప్టెన్‌గా ఘనుతికెక్కాడు. కెరీర్‌లో 34వ శతకం బాది గంగూలీ (11) తర్వాత సారథిగా అత్యధిక శతకాలు సాధించిన భారత్ కెప్టెన్ (12)గా చరిత్రకెక్కాడు. దక్షిణాఫ్రికాలో అత్యధికంగా స్కోరు సాధించిన భారత ఆటగాడిగానూ నిలిచాడు. కోహ్లీ ఆటంటేనే విన్యాసం.. విలాసం.. విధ్వంసం.. వైవిధ్యం.. అన్నిటికీ మించి అందం!

సాటి లేని ఆట

టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ (0 ; 6 బంతుల్లో) మరోసారి విఫలమయ్యాడు. రబాడ వేసిన ఇన్నింగ్స్ ఆరో బంతికే కీపర్ హెన్రిచ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతడి నిష్క్రమణ తర్వాతే మొదలైంది అసలైన ఆట. ఒక వైపు ఫామ్‌లో ఉన్న ధావన్ (76). మరోవైపు పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ (160★). ఇద్దరూ పోటీ పడి ఆడారు. ఒకరితో ఒకరు పోటీగా బౌండరీలు బాదేశారు. విరాట్‌తో పోలిస్తే గబ్బర్ ఎక్కువగా బౌండరీలు బాదుతూ అలరించాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ అర్ధశతకాలు సాధించి ఊపు కొనసాగించారు. రెండో వికెట్‌కు 140 పరుగుల భాగస్వామ్యం అందించారు. ధాటిగా ఆడుతున్న ఈ జోడీని ధావన్ రూపంలో ఔట్ చేయడం ద్వారా డుమిని విడదీశాడు. ఆ తర్వాత 20 పరుగులకు రహానె (11), 188 వద్ద పాండ్య (14), 228 వద్ద ధోనీ (10), 236 వద్ద కేదార్ జాదవ్ (1) ఔటయ్యారు.

భువితో కలిసి వేట కొనసాగింపు

మిడిలార్డర్ విఫలమైనా కోహ్లీ పరుగుల వేట ఆపలేదు. భువనేశ్వర్ (16 నాటౌట్) సహకారంతో విజృంభించాడు. ఏడో వికెట్‌కు 67 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా ఆడేశాడు. అందమైన హాఫ్ వ్యాలీలు, కవర్ డ్రైవ్‌లు, స్ట్రెయిట్ డ్రైవ్‌లు, ఫుల్ షాట్లు, కట్‌షాట్లు ఆడుతూ పరుగులు రాబట్టాడు. మధ్యమధ్యలో పేసర్ రబాడ కవ్వించినా విరాట్ ఏకాగ్రత కోల్పోలేదు. అతడు విసురుతున్న షార్ట్‌పిచ్ బంతుల్ని చాకచక్యంగా ఆడి సింగిల్స్, డబుల్స్ తీశాడు. అనవసర షాట్లకు ప్రయత్నించలేదు. అతడు సాధించిన పరుగుల్లో 100 సింగిల్స్, డబుల్స్ ద్వారానే వచ్చాయి. భువి సైతం సారథికి చక్కగా స్ట్రైకింగ్ ఇచ్చాడు. స్కోరు 293 ఉన్నప్పుడు చివరి రెండు బంతుల్లో ఒక సిక్సర్, ఒక బౌండరీ బాది టీమిండియా స్కోరును 303కు చేర్చాడు కోహ్లీ. డుమిని 2, రబాడ, మోరిస్, ఫెహ్లుక్‌వాయో, తాహిర్ తలో వికెట్ తీశారు.

కోహ్లీ ఖాతాలో 34వ శతకం

టీమిండియా సారథి విరాట్ కోహ్లీ (108) తనకు తానే సాటి అని మరోసారి రుజువు చేశాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో వన్డేలో అద్భుత శతకం బాదేశాడు. డుమిని వేసిన 39.1వ బంతికి రెండు పరుగులు తీసి వన్డే కెరీర్‌లో 34వ శతకం ఖాతాలో వేసుకున్నాడు. రోహిత్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన కోహ్లీ పట్టుదలతో ఆడాడు. విరాట్‌కు మాజీ సారథి ధోనీ (9) సహకారం అందిస్తున్నాడు. 40 ఓవర్లు ముగిసే సరికి భారత్ 223/4తో ఉంది. అనంతరం ధోనీ, జాదవ్‌లు కూడా పెవిలియన్‌కు చేరినా... ఆఖరు వరకు క్రీజ్‌లో నిలిచిన కోహ్లీ భారత్ స్కోరును 303కు చేర్చాడు.

భారత్ చేతిలో సఫారీలు చిత్తు



- రెండోవన్డేలో 178 పరుగులతో విజయం
- భారత్-దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్

కింబేర్లీ : వరుసగా రెండో వన్డే మ్యాచ్‌లోనూ భారత మహిళా క్రికెటర్లు సత్తా చాటారు. ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించారు. బుధవారం జరిగిన రెండో వన్డేలో 178 పరుగుల భారీ తేడాతో భారత జట్టు ఘన విజయం సాధించింది. 303 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా టీమ్ 30.5 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా క్రీడాకారిణుల్లో ఓపెనర్ లిజెలే లీ(73) మినహా ఎవరు రాణించకపోవడంతో ఘోర పరాజయం చవిచూడాల్సి వచ్చింది. ఏడుగురు సింగిల్ డిజిట్ స్కోరుకే అవుటయ్యారు. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టింది. గైక్వాడ్, శర్మ రెండేసి వికెట్లు తీశారు. జులాన్ గోస్వామికి ఒక వికెట్ దక్కింది. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 302 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధన సెంచరీ (135) చేసింది. హర్మన్ ప్రీత్(55), వేదకృాఎష్ణమూర్తి (51) అర్ధసెంచరీలతో రాణించడంతో భారత్ భారీ స్కోరు చేసింది.

రెండో మ్యాచ్‌లోనూ అఫ్గాన్ విజయం

2-0తో టీ20 సీరీస్ వశం



షార్జా : తటస్థ వేదిక అయిన దుబాయ్‌లోని షార్జా మైదానంలో ఆఫ్గనిస్తాన్-జింబాబ్వే మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సీరీస్‌ను అఫ్గనిస్థాన్ 2-0తో సొంతం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో జింబాబ్వేపై ఆఫ్గనిస్తాన్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్గన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. మహ్మద్ నబి (45), స్తానిక్‌జాయ్ (27) మెరువులు మెరిపించారు. అనంతరం 159 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 141 పరుగులే చేయగలిగింది. సికిందర్ రజా (40), మసకద్జ (29), బుర్ల్ (30) పోరాడినా ఫలితం లేకపోయింది. ముజీబ్ రెహ్మాన్ (2/21), రషీద్ ఖాన్ (2/23) జింబాబ్వేను కట్టడి చేశారు.

ఐపీఎల్-11లో కోచ్‌గా మలింగా!



ముంబై : శ్రీలంక పేస్ బౌలర్ లసిత్ మలింగా ఐపీఎల్-11 సీజన్‌లో కోచ్‌గా కనిపించనున్నాడు. ఈ సీజన్ కోసం నిర్వహించిన వేలంలో ఏ ఫ్రాంచైజీ ఈ సీనియర్ బౌలర్‌పై ఆసక్తి కనబర్చలేదు. దీంతో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన విషయం తెలిసిందే. అయితే 2009 నుంచి ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతి నిధ్యం వహిస్తున్న మలింగా మెత్తం 110 మ్యాచ్‌లాడి 157 వికెట్లు పడగొట్టాడు. తమ జట్టులో ఇంతకాలం ఆటగాడిగా కొనసాగిన మలింగాను బౌలింగ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు ముంబై జట్టు ప్రకటించింది. ఇప్పటికే ముంబై హెడ్ కోచ్‌గా శ్రీలంక క్రికెట్ దిగ్గజం జయవర్ధనే, బౌలింగ్ కోచ్‌గా షేన్ బాండ్ ఉన్నా రు. ఇప్పుడు వీరిద్దరితోపాటు సహాక సిబ్బంది టీంలో మలింగా చేరనున్నాడు. తనను బౌలింగ్ కోచ్‌గా నియమించడంపై మలింగా స్పందిస్తూ.. ముంబై ఇండియన్స్ జట్టులో కొనసాగడం గొప్ప అవకాశం. ముంబై గత దశాబ్ధంగా నా సొంత జట్టుగా ఉంది. ఇంతకాలం జట్టులో ఆటగాడిగా ఉండటం ఎంతో అనం దంగా ఉంది. ఇప్పుడు మెంటర్‌గా ఉండటం కూడా సంతోషమే. నేను ఇప్పుడు మెంటర్‌గా కొత్త పని చేబట్టపోతున్నాను అని పేర్కొన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి ఐపీఎల్ 11వ సీజన్ ప్రారంభంకానుంది.

పాక్‌లో శతకం కోహ్లీకి అంత వీజీ కాదు : మిక్కీ ఆర్థర్



కరాచీ : భారత పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీకి పాకిస్థాన్ క్రికెట్ జట్టు కోచ్ మిక్కీ ఆర్థర్ సవాలు విసిరాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న కోహ్లీ దర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో శతకం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు తాను పర్యటించిన అన్ని దేశాల్లో శతకం సాధించిన క్రికెటర్‌గా కోహ్లీ అరుదైన ఘనత అందుకున్నాడు. ఈ నేపథ్యంలో పాక్ కోచ్ మిక్కీ మాట్లాడుతూ.. కోహ్లీ గొప్ప ఆటగాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాను ఆడిన అన్ని దేశాల్లో కోహ్లీ శతకం సాధించడం సంతోషకరమైన విషయం. కోహ్లీ బ్యాటింగ్ శైలి నాకెంతో నచ్చుతుంది. అతని బ్యాటింగ్ చూడటం ఇష్టం. ప్రతి చోటా శతకం సాధించే కోహ్లీ పాక్ గడ్డపై శతకం నమోదు చేయలేదు. ఇది అతనికి అంత సులువేం కాదు. మా ఆటగాళ్లు కోహ్లీకి ఎంతో ప్రణాళికాబద్ధంగా బంతులేస్తారు. అని అన్నాడు. భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగి చాలా సంవత్సరాలు అయ్యింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరు జట్ల మధ్య సిరీస్‌లు నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ఒప్పుకోవడం లేదన్న సంగతి తెలిసిందే.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-